రష్యా విప్లవం
భారత స్వాతంత్ర్య సంగ్రామం
రూ॥160/- పేజీలు:195
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే సూర్యుడిపై ఉమ్మి వేసినట్లే

యాగాలతో 'అధికార యోగం' సంభవమా?

06

సంపుటి 08, సంచిక: 282 | శుక్రవారం | 12-09-2025 | మహబూబ్‌నగర్

Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## రైల్వే ప్రాజెక్టులు, లైన్లు వేగవంతంగా పూర్తి

- సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధం
- అవసరమైన నిధులతో పాటు భూసేకరణకు వెనుకాడొద్దు
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్ట్ అలైన్‌మెంట్ ఉండాలి
- కొత్త రైలుమార్గాలన్నీ వివిధ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- పెండింగ్, ప్రతిపాదిత రైల్వే ప్రాజెక్టులపై ఎస్‌సిఆర్ అధికారులతో సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చడంతో పాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్‌మెంట్లు ఉండాలని, దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతో పాటు కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ వివిధ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనంగా అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్తగా ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) అధికారులతో పాటు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎస్‌సిఆర్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను ముఖ్యమంత్రి స్వాగతించారు. కొత్త ప్రాజెక్టులపై ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. సిఎంతో పాటు ఎంపి కడియం కావ్య, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రోడ్లు, భవనాల స్పెషల్ సెక్రెటరీ వికాసరాజ్, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ తరువాయి 2లో

## అందరి చరిత్రలను

# బిజెపి హైజాక్

### ఏ చరిత్రా లేని కాషాయ పార్టీ దుష్ట రాజకీయాలకు పాల్పడుతోంది

- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పులుముతూ వక్రీకరిస్తోంది
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆగ్రహం
- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ వారోత్సవాలు ఘనంగా ప్రారంభం
- మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు 'రెడ్ ఫ్లాగ్ మార్చ్'




ప్రజాపక్షం/హైదరాబాద్

ఏ చరిత్ర లేని బిజెపి అందరి చరిత్రను తనదంటూ ఆపాదించుకుని దుష్ట రాజకీయాలకు పాల్పడుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఉన్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సారథుల్లో ఒకరైన మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహానికి సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్. బోస్ పూలమాలలు వేసి వారోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు రెడ్ ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించింది. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సభను ఉద్దేశించి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల దాస్యశృంఖలాలను బద్దలు కొట్టేందుకు మట్టి మనుషులు బంధూకులు పట్టి సాగించిన సాయుధ సమరమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బిజెపి మతం రంగు పులుముతూ చరిత్ర వక్రీకరిస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలం నాటికి అసలు ఉనికే లేని బిజెపి విమోచన దినోత్సవం పేరుతో సెప్టెంబర్17న ఉత్సవాలను నిర్వహించడం తరువాయి 12లో

అమరవీరుల స్మృతివనం ఏర్పాటు చేయాలి


తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

03

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- కేంద్ర కమిటీ సభ్యుడు మొడెం బాలకృష్ణ హతం?
- ఘటనను ధ్రువీకరించిన ఐజి అమ్రేష్ మిశ్ర




### ఎదురు కాల్పుల్లో 10 మంది మావోయిస్టులు మృతి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

ఛత్తీస్‌గఢ్‌లో గురువారం ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఒడిశా రాష్ట్ర సరిహద్దు గరియాబాద్ జిల్లా అటవీ ప్రాంతలో చోటు చేసుకున్న ఈ ఎదురు కాల్పుల్లో 10 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటనను రాయ్‌పూర్ ఐజి అమ్రేష్ మిశ్ర ధృవీకరించారు. ఈ ఎన్‌కౌంట్‌లో తెలంగాణకు చెందిన మొడెం బాలకృష్ణ మృతి చెందినట్లు తెలుస్తోంది. ఆయన ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు. ఎస్‌టిఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్త ఆపరేషన్ భాగంగా మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా పెద్ద ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మావోయిస్టు పార్టీ ఒక్కసారిగా తారసపడడంతో ఇరు వర్గాల మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. సుమారు నాలుగు గంటలపాటు సాగిన ఈ ఎదురుకాల్పుల్లో తరువాయి 12లో

## మారిషస్‌కు భారత్ సహాయం

# 680 బిలియన్ డాలర్లు



- ఏడు ఒప్పందాలపై సంతకాలు
- మనం భాగస్వాములం కాదు, ఒకే కుటుంబం
- నవీన్‌చంద్రతో ద్వైపాక్షిక చర్చల్లో ప్రధాని నరేంద్రమోదీ

**వారణాసి/న్యూఢిల్లీ:** దేశంలో పర్యటిస్తున్న మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గూలమ్ గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ద్వైపాక్షిక సంప్రదింపులు జరిపారు. నాయకులు ఇద్దరూ మొత్తం ఏడు ఒప్పందాలపై సంతకాలు చేశారు.ఈ మేరకు స్థానిక కరెన్సీలలోనే దైపాక్షిక వాణిజ్యం జరుగుతుంది. ఇందులోభాగంగా మారిషస్‌కు భారత్ ప్రకటించిన 680 బిలియన్ డాలర్లు ప్రత్యేక ఆర్థిక సహాయ ఒప్పందం కూడా ఉంది. ఈ ప్రత్యేక ఆర్థిక సహాయ పథకం కింద మారిషస్‌లో కనీసం 10 ప్రాజెక్టులను భారతదేశం అమలు చేస్తుంది. రేవులు, విమానాశ్రయాలు, రహదారులు, స్కూళ్ళు ఏర్పాటు చేయడం, ఆసుపత్రులు నిర్మించడం వంటి అనేక ప్రాజెక్టులను అమలు చేస్తుంది. ఈ ఏడు ఒప్పందాలవల్ల రెండు దేశాలమధ్యా సహకారం మరింతగా విస్తరిస్తుంది. విద్యా,ఇంధనం,విద్యుత్, హైడ్రోగ్రఫీ,అంతరిక్ష పరిశోధనా రంగాలలో తరువాయి 12లో

# నేపాల్ తాత్కాలిక ప్రధానిపై తర్జనభర్జన

### జెనరేషన్ జెడ్ ఉద్యమ నాయకుల మధ్య కుదరని ఏకాభిప్రాయం

### తాత్కాలిక నేతగా తెరపైకి సుశీల కర్కితో పాటు కుల్మన్ ఘీసింగ్, హర్కా సంపంగ్ పేర్లు



**ఖాట్మండు:** నేపాల్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఐతే తాత్కాలిక ప్రభుత్వ ప్రధానమంత్రి ఎంపికపై చర్చల్లో అనిశ్చితి ఏర్పడింది. ఏకాభిప్రాయం కుదరలేదు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కిని తాత్కాలిక ప్రభుత్వాధినేత్రిగా నియమించాలని జనరేషన్ జెడ్ ఉద్యమ (జిజెడ్‌ఎం) నాయకత్వం తరువాయి 2లో

## అమెరికా మితవాద యువనేత

# చార్లీ కిర్క్ హత్య

### బైడెన్ సహా పలువురు నాయకులు ఖండన

**ఉతాహ్:** ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడైన ఛాందసవాద యువ నాయకుడు ఛార్లీ కిర్క్ (31) హత్యకు గురయ్యారు. ఉతాహ్‌లోని ఒక విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వందలమంది విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో గుర్తుతెలియని గన్‌మెన్ ఎత్తైన ప్రదేశం నుండి ఛార్లీ కిర్క్‌ను ఒకేఒక్క తూటా ప్రయోగించి కాల్చిచంపాడు. ఈ ఘటనతో వందలాదిమంది విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. కాల్పులు జరిపిన దుండ



గుడు విద్యార్థుల్లో ఒక విద్యార్థిగా కలిసిపోయాడు. అతడిని తరువాయి 2లో

## 21 నుంచి సిపిఐ

# జాతీయ మహాసభలు

### మొహాలీ ర్యాలీతో ప్రారంభం । జయప్రదానికి అమర్‌జిత్ కౌర్ పిలుపు




**చండీగఢ్:** సిపిఐ 25వ జాతీయ మహాసభలకు చండీగఢ్ కిసాన్ భవన్ వేదికైంది. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు మహాసభలు జరగనున్నాయి. 21వ తేదీ ఉదయం మొహాలీలో ర్యాలీతో మహాసభలు లాంఛనంగా ప్రారంభమవుతాయి. 22న కిసాన్ భవన్‌లో ప్రారంభ సభ జరుగుతుంది. సభా ప్రాంగణానికి కామ్రేడ్ సుధాకర రెడ్డి నగర్‌గా పేరు పెట్టారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమానత్వం, శాంతి కోసం పోరాటాల బలోపేతానికి భవిష్యత్ కార్యాచరణను మహాసభలో తీర్మానిస్తారు. 'మేము పోరాడుతాం... ప్రజలు గెలుస్తారు... న్యాయం, సత్యం జయిస్తాయి' అని పార్టీ నినాదమిచ్చింది. ఈ మేరకు చండీగఢ్ తరువాయి 2లో

# మెదక్‌లో క్లౌడ్ బరస్ట్



- ఐదుగంటలపాటు భారీ వర్షం
- 17 సెంటీమీటర్ల వర్షపాతం
- చెరువులను తలపించిన రోడ్లు
- నీటమునిగిన పలు కాలనీలు
- రాష్ట్రంలో మరో ఐదురోజులు భారీ వర్షాలు

ప్రజాపక్షం/మెదక్/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం సాయంత్రం నుంచి పలుచోట్ల భారీ వర్షాలు కురిసాయి. ముఖ్యంగా మెదక్ జిల్లాలో గురువారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గురువారం ఉదయం 9 గంటలకు మొదలైన భారీ వర్షం మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. మెదక్ లో 17 సెంటిమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లాలోని మెదక్, హవేలీ ఘనపూర్, రామాయంపేట, అల్లాదుర్గం, శివ్వంపేట, నర్సాపూర్, పాపన్నపేట్, కౌడిపల్లి, తరువాయి 2లో



### హైదరాబాద్‌లో కుండపోత

గ్రేటర్ హైదరాబాద్ నగర వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. సరిగ్గా కార్యాలయాలు, విద్యా సంస్థల నుంచి ఇంటికి వెళ్లే సమయం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం మొదలైన వాన ఎడతెరిపి లేకుండా పడుతోంది. భారీ వర్షంతో రోడ్లన్ని జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. నగరంలో కొన్ని గంటల నుంచి నిరంతరాయంగా కురుస్తున్న తరువాయి 2లో

చలో చండీఘడ్
భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21-25 సెప్టెంబర్, 2025
చండీఘడ్ (పంజాబ్)

చైర్మన్ పదవి పునరుద్ధరణ మలి చైర్మన్ ఎస్.ఎ.డాంగే – 6వ పేజీలో



# ప్రపంచం
WORLD NEWS

## బాలీలో వరదలు : 19 మంది మృతి



**బాలి:**ఇండోనేసియా బాలిలో గడచిన పదేళ్ళలో ఎన్నడూలేనంత ఉద్ధృతస్థాయిలో వరదలు సంభవించాయి. 19 ంది మరణించారు. ఇప్పుడిప్పుడే నీరు తగ్గుముఖం పడుతోంది. ఇళ్ళనీ పాచిపట్టి, బురదలో మునిగి ఉన్నాయి. మరో ఇద్దరు గల్లంతయ్యారు. ప్రొవెన్సియల్ ప్రభుత్వం వారంరోజులపాటు రాష్ట్రంలో ఎమర్జెన్సీ ప్రకటించింది. ప్రజలు బురద తొలగించి ఇళ్ళు శుభ్రం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దెన్‌పాసర్‌లో ఎనిమిదిమంది, గియాన్‌యార్‌లో ముగ్గురు, బాడుంగ్ కౌంటీలో ఒకరు మరణించారు.

## హమాస్ నాయకులను అప్పగించకుంటే మూల్యం తప్పదు



నెతన్యాహూ హెచ్చరిక

**జెరూసలెం:** ఐక్యరాజ్యసమితి సహా యావత్ ప్రపంచదేశాలు ఏకమై తీవ్రంగా విమర్శిస్తున్నప్పటికీ ఖతార్ నగరం దోహాపై ఐడిఎఫ్ చేసిన దాడులను ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ సమర్థించుకున్నారు. దోహాలో మంగళవారం చేసినబాంబుదాడుల్లో ఆరుగురు మరణించార చెబుతూ, ఒకవేళ హమాస్ అగ్రనాయకత్వం ఈ దాడుల్లో హతులవ్వకపోతే మరోసారి దాడులు చేస్తామని హెచ్చరించారు. దోహాలో ఉన్న హమాస్ అగ్రనాయకులను దేశం నుండి బహిష్కరించాలని లేదా తమకు స్వాధీనం చేయాలని లేకపోతే తదుపరి తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాలని నెతన్యాహూ హెచ్చరించారు. ఉగ్రవాదం ఎక్కడున్నా సహించబోమన్నారు. ఈ సందర్భంగా వివిధ దేశాల్లో ఇస్లామిక్ ఉగ్రవాదులు చేస్తున్న జీహదీ ఉద్యమాలను ఆయన ప్రస్తావించారు. తమ దేశంపై దాడులు చేసినవారు ఎక్కడ దాక్కున్నాగానీ తరిమి తరిమి కొట్టి చంపుతామన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాకు ఖతార్ అత్యంత సన్నిహిత మిత్రదేశం కావడంతో నెతన్యాహూ నిర్ణయాలకు దూరంగా ఉన్నట్లు ప్రకటించుకున్న డోనాల్డ్ ట్రంప్ ఆయనతో ఫోన్‌లో సంభాషించి వాగ్వాదం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. నెతన్యాహూపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారన్న వార్తలు వచ్చాయి. కానీ దోహాలో దాడులకు ముందే ట్రంప్‌కు ఇజ్రాయెల్ సమాచారం అందించినట్లు తొలుత వార్తలు వెలువడటం, ట్రంప్ ఆగ్రహం వంటివన్నీ సందేహాస్పదంగా మారాయి.

### యెమెన్‌లో ఐడిఎఫ్ దాడులు
### 35 మంది మృతి

యెమెన్‌లో హౌతీ ఉగ్రవాదులపై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో మృతులసంఖ్య 35కు పెరిగింది. ఖతార్ రాజధాని దోహాలో హమాస్ నాయకత్వం ఉన్న భవనంపై దాడులు చేసిన మరునాడే బుధవారం ఇజ్రాయెల్ సైనికదళం పలుచోట్ల హౌతీల స్థావరాలు, వారి ఆయుధసామాగ్రి ప్రదేశాలపై క్షిపణి దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇప్పటివరకూ 35 మంది మరణించగా మరో 131 మంది గాయపడ్డారని హౌతీ నాయకత్వానగల ప్రభుత్వంలో ఆరోగ్యమంత్రిత్వశాఖ గురువారం ప్రకటించింది. అల్ జాఫ్‌లో హౌతీలు నడుపుతున్న అల్ మష్రా టీవీ మీడియాను ధ్వంసం చేసింది. హౌతీ రక్షణమంత్రిత్వశాఖపై దాడులు చేసింది. సెంట్రల్ సనాలో నేషనల్ మ్యూజియం ధ్వంసమైంది. రాజధాని సనాలో 28 మరణించారని, మరో 113 మంది గాయపడ్డారని, వీరిలో అనేకమంది జర్నలిస్టులు ఉన్నారని తెలియజేసింది. అల్‌జాఫ్ ఉత్తరప్రాంతంలో ఏడుగురు మరణించగా 18 మంది గాయపడ్డారు.

## ఇజ్రాయెల్‌ను కోర్టులో నిలబెట్టాల్సిందే

### ఖతార్ డిమాండ్



**దోహా:**ఇజ్రాయెల్ చేసిన దాడులతో ఖతార్ ప్రభుత్వంమండిపడుతోంది.ఇజ్రాయెల్‌ను న్యాయస్థానంలో నిలబెట్టి జవాబుదారీ చేయాల్సిందేనని ఖతార్ ప్రధానమంత్రి, విదేశాంగమంత్రి షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్‌రెహ్మాన్ అల్ థాని డిమాండ్ చేశారు. దోహాలో జరిగిన దాడులపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశానికి హాజరుకావాలని ఆయననుపిలిచింది. గురువారం రాత్రి పొద్దుపోయాక ఈ సమావేశం జరిగింది. అల్ థానీ ఐక్యరాజ్యసమితి కార్యాలయానికి గురువారం చేరుకున్నారు. తొలుత ఆయన దోహా దాడుల్లో మరణించిన ఆరుగురి ఖనన కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమంలో హమాస్ అగ్రనేత ఖలీల్ హయ్యా ఎక్కడా కనపడలేదు. దోహాలో ఈనెల తొమ్మిదోతేదీన ఇజ్రాయెల్ చేసిన దాడులతో గాజాలో హమాస్ వద్ద ఇంకా సజీవంగా ఉన్న 20 మందికిపైగా బందీల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. బందీలను విడుదల చేసేందుకు ఇప్పటివరకూ ఉన్న ఆశలను ఇజ్రాయెల్ వమ్ము చేసిందని ఖతార్ ప్రధానమంత్రి థాని విమర్శించారు. దీంతో బందీల కుటుంబాలలో తీవ్ర నిరాశానిస్పృహలు నెలకున్నాయి. ఐడిఎఫ్ దాడుల్లో హమాస్ అగ్రనాయకుడు ఖలీల్ హయ్యా, ఇతర సీనియర్లు తప్పించుకుని బయటపడ్డారు. గాజాలో మధ్యవర్తిత్వంపై ఖతార్ పునరాలోచన చేస్తున్నట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. ఖతార్‌పై దాడిచేసి ఆ దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించిన చర్యను భారతదేశం సహా అనేక ప్రపంచదేశాలు ఖండించాయి. భారత ప్రధాని మోదీ ఖతార్ ఎమిర్ థానికి ఫోన్‌చేసి మాట్లాడారు. తన సంఘీభావాన్ని ప్రకటించారు.

## కార్మికులు, స్వల్పాదాయాలవారి ప్రభుత్వం కావాలి

### ఒకే వేదికపై మమ్దానీతో కలిసి శాండర్స్ పిలుపు



**న్యూయార్క్:**అమెరికా బ్రూక్లిన్‌కాలేజీ ఆడిటోరియంలో గడచిన శనివారం (సెప్టెంబరు 6) ఒక అద్భుతం జరిగింది. అమెరికా కాంగ్రెస్ చరిత్రలో చట్టసభ సభ్యుడుగా అత్యంత సుదీర్ఘమైన అనుభవంగల 83 ఏళ్ళు వయసుగల ఇండిపెండెంట్ సెనేటర్ (వెర్మోంట్) బెర్నార్డ్ శాండర్స్, డెమోకటిక్‌పార్టీ తరపున వచ్చే నవంబరులో జరిగే ఎన్నికల్లో న్యూయార్క్ సిటీ మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జోహ్రాన్ క్వామే మమ్దానీ ఇద్దరు ఒకవేదికపైన జతకూడి సభికులను అలరించారు. ఈ ఇద్దరు అమెరికాలో ఎంతో ప్రజాదరణ గలవారే. ప్రస్తుతం ట్రంప్‌కు జనాదరణ తగ్గుతున్న తరుణంలో డెమోక్రాట్లతో సుదీర్ఘ స్నేహం ఉన్న ఇండిపెండెంట్ సెనేటర్ శాండర్స్,మమ్దానీలు బ్రూక్లిన్ కాలేజీ ఆడిటోరియంలో హాజరైన 1700 మంది సభికులలలో కొత్త ఆశలు రేకెత్తించారు. మమ్దానీతో తనకు ఎంతో భావసారూప్యత ఉందని శాండర్స్ చెప్పారు. ఆయన పోరాటం చేస్తున్న ఉద్దేశాలు, తమ ఉద్దేశాలమధ్య సారూప్యతలున్నాయన్నారు. దేశంలో అధికారం కేవలం కొంతమంది చేతుల్లోనే ఉండిపోయి దుర్వినియోగం జరుగుతోందనీ, దేశాధికారం కార్మికులు, స్వల్పాదాయ వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉండాలని పోరాటం చేస్తున్న శాండర్స్ ఇప్పటివరకూ దాదాపు 20 రాష్ట్రాలను చుట్టేసి అనేక సభల్లో పాల్గొన్నారు. తాజాగా గడచిన శనివారం మమ్దానీతో కలిసి వేదికను పంచుకుని సభికులను ఉత్తేజపరిచారు. ఇలా శాండర్స్ మొదటిసారి చాలా సన్నిహితంగా మమ్దానీతోఒకవేదికను పంచుకున్నారు. మమ్దానీప్రస్తుతం డెమోక్రాట్ల తరపున 36వ డిస్ట్రిక్ట్ నుండి న్యూయార్క్ స్టేట్ అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మమ్దానీ సుదీర్ఘంగా మాట్లాడుతూ, శాండర్స్‌కు తాను రాజకీయంగా ఎంతో రుణపడి ఉంటానని హర్ష ధ్వానాల మధ్య చెప్పారు. 2016లో శాండర్స్ అధ్యక్ష ఎన్నికల్లో చేసిన ప్రచారం సందర్భంగా ప్రజాస్వామ్య సోషలిజం గురించి తాను తెలుసుకున్నానని, తన రాజకీయాలకు అదే మార్గదర్శకంగా ఉందన్నారు. 2019లో క్వీన్స్‌బెర్గ్‌లో జరిగిన ర్యాలీలో కూడా ఆయన తన మొదటి రాజకీయప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు.

## నేపాల్ జైళ్ళ నుండి 15వేలమంది పరారీ

**ఖాట్మండు:** నేపాల్‌లో ఈనెల 8,9 తేదీలలో జరిగిన అల్లర్ల సందర్భంగా జైళ్ళపై దాడులు జరిగినప్పుడు 15000 మంది ఖైదీలు పారిపోయారు. ఖైళ్ళల్లో ఘర్షణలు చెలరేగాయిప దాదాపు 25 జైళ్ళ నుండి 15 వేలమంది ఖైదీలు పారిపోయారు. కాగా నేపాల్ జైళ్ళలో సిబ్బందికి, ఖైదీలకు జరిగిన ఘర్షణల్లో గురువారం ముగ్గురు ఖైదీలు మరణించడంతో ఇప్పటివరకూ ఇలా మరణించినవారిసంఖ్య ఎనిమిదికి పెరిగింది. గురువారం ఉదయం రామెఛాప్ జిల్లాలోని జైలులో భద్రతాసిబ్బందికి, ఖైదీలకు జరిగిన ఘర్షణలో ముగ్గురు మరణించగా 13 మంది గాయపడ్డారు. ఐతే పారిపోయిన ఖైదీలలో 35 మందిని పోలీసులు అరెస్టు చేసి తిరిగి జైళ్ళకు తరలించారు. రాజ్‌బిరాజ్ జైలు నుండి 192 మంది ఖైదీలు పారిపోయేందుకు యత్నించగా సైన్యం అడ్డుకుంది. ఏడుగురు ఖైదీలు భారత్‌వైపు పారిపోగా భారత సరిహద్దు భద్రతాబలగాలు మూడుప్రాంతాల్లో వారిని పట్టుకుని నేపాల్ ఆర్మీకి అప్పగించారు. ఝూపాజిల్లాలోని అనేక ప్రాంతాలలో జైళ్ళ నుండి 92 మంది ఖైదీలు పారిపోయారు. అనర్‌మణి నుండి 36 మంది, దమాక్ నుండి 51 మంది, ఝిల్‌మిల్ నుండి ఐదుగురు పారిపోయారు. జాడ తెలియడంలేదు. పోలీసులు వాల్‌పోస్టర్లు వేశారు. ఈ నెల 8,9 తేదీలలో జరిగిన హింసాత్మక ఘటనలలో మరణించినవారిసంఖ్య 19 నుండి 31కి పెరిగినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

## వర్జీనియాలో డెమోక్రాట్ల గెలుపు

### ఆదరణ తగ్గిన ట్రంప్‌నకు దిగువసభలో ఎదురీత

**న్యూయార్క్:** అమెరికా దిగువసభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్)లో వర్జీనియా 11 కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ స్థానానికి ఈ నెల తొమ్మి దో తేదీన జరిగిన ఎన్నికల్లో డెమోక్రటిక్‌పార్టీ విజయం సాధించింది. డెమోక్రాట్ల అభ్యర్థి జేమ్స్ వాల్కిన్షా సాధించిన నిర్ణయాత్మకమైన విజయం రిపబ్లికన్‌పార్టీ నేత, దేశాధ్యక్షుడు డోనా ల్డ్ ట్రంప్‌కు పెద్ద శరాఘాతంగా మారింది. దిగువసభలో అధికార–ప్రతిపక్షాలమధ్య సంఖ్యాబలం అతిస్వల్పతేడాకు చేరుకుంది. ప్రస్తుతం ట్రంప్‌కు ఉన్న ప్రతికూల పరిస్థితుల్లో ఇంకా ఖాళీగా ఉన్న రెండు స్థానాలను చాలా గెలుచుకునే అవకాశాలున్నాయి. ఇలా రెండుస్థానాలను డెమోక్రాట్లు గెలుచుకోగలిగితే సంఖ్యాబలాబాలు 219–216 స్థాయికి చేరుకునే అవకాశాలున్నాయి. ఈ విధమైన డెమోక్రాట్ల ఆధిపత్యం రిపబ్లికన్‌పార్టీకి ప్రాణాంతకంగా మారుతుంది. ట్రంప్‌కు దేశంలో 60 శాతం ప్రజలు వ్యతిరేకంగా ఉన్నట్లు తాజా సర్వేలో వెల్లడైంది. దీంతో డెమోక్రాట్లు సభపై పట్టుబిగించేందుకు అవకాశాలు గణనీయంగా పెరిగాయి. ఊహించడానికి ఇది మరొక ఉదాహరణగా మారింది. అమెరికా దిగువసభలో అధికార,ప్రతిపక్షాలమధ్య బలాబలాల్లో స్వల్పతేడా ఉంది. రిపబ్లికన్లు పరిపాలిస్తారా? డెమోక్రాట్లు గట్టిగా వారిని అడ్డుకుంటారా అనే విషయంలో ఈ సీట్లే కీలకం. మొన్నటిదాకా వర్జీనియా 11 కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన గ్యారీ కన్నోలీ ఈ ఏడాది మే 21న మరణించడంతో దిగువసభలో ఖాళీ ఏర్పడింది. ఈ స్థానాన్ని భర్తీచేసేందుకు ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఎన్నికల్లో డెమోక్రాట్లు తిరిగి తమ ఆధిపత్యం నిలబెట్టుకున్నారు.



గడచిన ఏడునెలలుగా దేశంలో ట్రంప్ అనుసరించిన విధానాలవల్ల ప్రజల్లో ఆయనకు పలుకుబడి గణనీయంగా తగ్గిందని చెప్పడానికి ఈ ఉప ఎన్నిక మరో ఉదాహరణగా నిలిచింది. ఈ ఎన్నికను రిపబ్లికన్‌పార్టీ సవాలుగా తీసుకుంది. వాల్కిన్షా విజయంతో దిగువసభలో ఈ రెండు పార్టీల బలాబలాలు నువ్వా నేనా అనే రీతిలో పదునైన కత్తి అంచుకు రెండువైపులుగా మారాయి. ఈ విజయంతో డెమోక్రాట్లకు 214 స్థానాలు, రిపబ్లికన్లకు 219 స్థానాలు సభలో ఉన్నట్లయింది. దిగువసభలో ఇంకా రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. దేశంలో డోనాల్డ్ ట్రంప్ గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో డెమోక్రాట్లు మిగిలిన రెండు స్థానాలను కూడా చాలా సునాయాసంగా గెలుచుకునే అవకాశాలు ఉన్నాయి.

## ప్రభుత్వాన్ని కూల్చేందుకు యత్నిస్తున్నామంటూ దుష్ప్రచారం

### బిజెపి ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తమ వైఫల్యాలు, అసమర్థత, ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు తమపై అనధికారిక సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నాయని బిజెపి ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్ బాబు ఆరోపించారు. వేర్వేరుగా గురువారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. తాము ప్రభుత్వాన్ని కూల్చేందుకు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి గోవా, ఢిల్లీలలో రహస్య మంతనాలు జరుపుతున్నట్లు తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రోత్సాహంతోనే బిఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం ఈ తప్పుడు ప్రచారానికి తెరలేపిందని హరీష్‌బాబు ఆరోపించారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆడుతున్న నాటకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇది కేవలం బిజెపిని బద్నాం చేయడానికి పన్నిన పన్నాగం అని ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి హేయమైన చర్యల ద్వారా ప్రజల్లో బిజెపికి వస్తున్న ఆదరణను అడ్డుకోలేరన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ అవినీతి, కుటుంబ పార్టీలని, వాటిని ప్ర జ లు అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా ఇలాంటి నీతిమాలిన చర్యలు మానుకోవాలని వారు హెచ్చరించారు.

## హైదరాబాద్‌లో కుండపోత

(మొదటి పేజీ తరువాయి)

వర్షంతో రహదారులపై నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వరద నీరు చేరడంతో చెరువులని తలిపించాయి. ఒక్కసారిగా కురిసిన వాన వరదలా మారడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హయత్ నగర్‌లో అత్యధికంగా 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. హయత్‌నగర్‌లో కుండపోత వర్షం పడటంతో హయత్‌నగర్ విజయవాడ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు చేరింది. మోకాళ్ల లోతు వరకు నీళ్లు రావడంతో వనస్థలిపురం ఆటోనగర్ నుంచి హయత్‌నగర్ వరకు భారీగా ట్రాఫిక్ స్తంభించింది. కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. హయత్ నగర్ కోర్టు ప్రాంగణాన్ని వరద నీరు చుట్టుముట్టింది. హయత్‌నగర్ ఆర్‌టిసి డిపో ప్రాంగణంలో భారీగా వరద నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోడ్లపై వరద నీరు నిలవడంతో ఆటోనగర్, పెద్ద అంబర్ పేట్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వనస్థలిపురంలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

## వేగవంతంగా పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు. కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్‌మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిందన్నారు. దానికి అనుగుణంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని, రైల్వే విభాగం పరిశీలనలో ఉన్న అలైన్‌మెంట్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్‌మెంట్‌ను పరిశీలించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. హైవే వెంట రైలు మార్గం ఉండాలని, హైవేకు ఇరువైపులా కిలోమీటర్‌న్నర దూరం వరకు ఇండస్ట్రియల్ కారిడార్‌ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయని చెప్పారు. కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్ – చెన్నై, హైదరాబాద్ – బెంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్‌మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు. హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు చేయటంతో హైదరాబాద్ మహానగరం భవిష్యత్తు స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సిఎం సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ ఉండాలని సిఎం అభిప్రాయపడ్డారు. వికారాబాద్ కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో పాటు గద్వాల – డోర్నకల్ రైల్వే లైన్ పనుల డిపిఆర్‌ను పూర్తి చేసి వేగంగా చేపట్టాలన్నారు. వరంగల్‌లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలని, భూపాలపల్లి నుంచి వరంగల్‌కు కొత్త మార్గాన్ని పరిశీలించాలని సూచించారు. కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తో పాటు వరంగల్ ను అభివృద్ధి చేయాలని, అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు.

## మెదక్‌లో క్లౌడ్ బరస్ట్ (మొదటి పేజీ తరువాయి)

టేడిపల్లి, పెద్ద శంకరంపేట్, కొల్చారం, నార్సింగ్ మండలాల్లో వర్షం దంచికొట్టింది. మెదక్ పట్టణంలో కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ చెరువులను తలపించాయి. దీంతో వాహనదారులు,పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోకాల్లోతు నీరు రావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.దాదాపు నాలుగు గంటలు పడిన వర్షానికి లోతట్టు ప్రాంతాలలో వరద నీరు చేరింది. పట్టణంలోని గాంధీనగర్, బృందావన్ కాలనీ, ఆటోనగర్, వెంకట్రావు నగర్ కాలనీ, సాయినగర్ కాలనీ,పతే నగర్,జెయన్ రోడ్, మున్సిపల్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా చేరడంతో మున్సిపల్,రెవిన్యూ అధికారులు జెసిబిల సహాయంతో మాన్యువల్స్ ఓపెన్ చేసి వరద నీరును తొలగించారు.మెదక్ పట్టణంలోని గాంధీ నగర్ కాలనీలో వరద ముంచెత్తడంతో ఇండ్లలోకి చేరిన వర్షపు నీరు చేరి ప్రజలు అవస్థలు పడ్డారు.రాందాస్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు రోడ్డుపై వరద భారీగా పారింది. మెదక్ హైదరాబాద్ హైవేపై భారీగా వరద నీరు చేరడంతో జేసీబీతో అధికారులు డివైడర్ ని తొలగించారు. మెదక్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలోకి వరద నీరు చేరుకోగా విద్యార్థినులు సురక్షితంగా బయట పడ్డారు. మెదక్ జిల్లా కేంద్రంలో అత్యధికంగా 17 సెంటీమీటర్లు, రాజపేట 9 సెంటీమీటర్లు, పాతూరు 8 సెంటీమీటర్లు వర్షపాతం నమోదయింది. భారీ వర్షం కారణంగా మెదక్ మండలం కొంటూరు చెరువు అలుగు ఉధృతంగా పారడంతో వెంకటాపూర్, శివ్వాయిపల్లి, గుటకింది పల్లి మక్త భూపతిపూర్, తిమ్మానగర్ గ్రామాలకు వెళ్లే దారిని నీటి పారుదల శాఖ, పోలీసులు, రెవిన్యూ శాఖ అధికారులు మూసివేశారు. దీంతో గ్రామాల ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

**రాష్ట్రంలో మరో ఐదురోజులు భారీవర్షాలు ...** రాష్ట్రంలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని తెలిపారు. గురువారం నిర్మల్, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో, ఆదివారం నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ నారాయణపేట, వపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయన్నారు. సోమవారం కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు.

## జాతీయ మహాసభలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అమర్‌జిత్ కౌర్ ప్రకటించారు. ఆమెతో పాటు సిపిఐ పంజాబ్ నాయకులు, రిసెప్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి బంత్ సింగ్ బ్రార్, చైర్మన్ స్వరాజ్‌బీర్ సింగ్ పాల్గొన్నారు. దేశ నలుమూల నుంచి 800 మందికిపైగా ప్రతినిధులు మహాసభలకు హాజరు కానున్నారు. మహాసభల్లో భాగంగా గాజాలో ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఖండించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. అదే సందర్భంగా క్యూబా ప్రజలకు సంఘీభావం తెలుపుతారు. క్యూబా, పాలస్తీనా దౌత్యాధికారులు ఈ సమావేశాలకు హాజరు కానున్నారు. అలాగే, సిపిఐఎం, ఆర్ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్, సీపీఐ(ఎంఎల్) నాయకులు ప్రారంభ సభకు విచ్చేస్తారు. జాతీయ మహాసభను పురస్కరించుకొని జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ప్రతినిధులు చర్చిస్తారు. ప్రజాస్వామ్యానికి ముప్పు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, కార్మిక హక్కుల హరణ, ఆరోగ్యం, విద్య వ్యాపారీకరణ తదితర అంశాలపై తీర్మానాలు చేస్తారు. మహాసభల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, విప్లవ గీతాలాపనలు, నాటికలు, జానపద గేయాలతో ప్రముఖ కళాకారులు ఇచ్చే ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతున్నాయి. మహాసభలకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని, విజయవంతం చేయాలని సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు.

## చార్లీ కిర్క్ హత్య

(మొదటి పేజీ తరువాయి)

కూడా అందరూ విద్యార్థిగానే భావించారు. హంతకులకోసం దేశమంతటా తీవ్ర గాలింపు జరుగుతోంది. ''సత్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరుడు ఛార్లీ కిర్క్ అని డోనాల్డ్ ట్రంప్ నివాళులు అర్పించారు. కిర్క్‌ను యూత్ లెజండరీగా అభివర్ణించారు. అమెరికా రాజకీయాలపై తనదైన ముద్ర వేసి గతించారని కొనియాడారు. ఆయన యువకుల హృదయాల్లో మిగిలిపోతారని, ఆయనకు మించిన గొప్ప నాయకుడు లేరని ట్రూత్ సోషల్ మీడియా ద్వారా చెప్పారు. లెఫ్ట్ ఉగ్రవాదులో ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఆయన విమర్శించారు. హంతకుడు విద్యార్థుల్లో ఒకడుగా గుర్తుపట్టడానికి వీల్లేకుండా కలిసిపోయాడన్నారు. అధికారులు తాజా వీడియో ఫూటేజీలను సమీక్షించారని చెప్పారు. ఇది రాజకీయహత్య అని ఉతాహ్ ప్రభుత్వం ప్రటించింది. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్, అధ్యక్ష పదవికి పోటీ చేసిన మాజీ ఉపాధ్యక్షురాలు కమలాహ్యారిస్ సహా పలువురు నాయకులు ఈ హత్యను తీవ్రంగా ఖండించారు. అమెరికాలో రాజకీయ హత్యలకు అవకాశం లేదని వారు అన్నారు. హంతకుణ్ణి పట్టుకునేందుకు ఎఫ్‌బిఐ రంగంలోకి దిగింది. తమ పూర్తి వనరులను ఉపయోగించి హంతకులను పట్టుకుంటామని ఎఫ్‌బిఐ అధికారులు ప్రకటించారు. గడచిన పది సంవత్సరాలుగా అమెరికాలో కన్జర్వేటివ్ భావజాలాన్ని యువకులు, విద్యార్థుల్లో విస్తారంగా ప్రచారం చేస్తున్న ఛార్లీ కర్క్‌కు ట్రంప్‌కు మధ్య గాఢమైన స్నేహం ఉంది. ఆయన తరచు వైట్‌హౌస్‌కు వచ్చి ట్రంప్‌ను కలిసి వెళుతూ ఉంటారు. 2012లో విద్యార్థుల్లో ఛాందస భావాలను ప్రోత్సహించడంద్వారా ఛార్లీ కిర్క్ ప్రస్థానం ప్రారంభమైంది. 2016లో ట్రంప్‌తో కలిసి రిపబ్లికన్‌పార్టీ జాతీయ సదస్సులో ప్రసంగించి ఆయన అభిమానం సంపాదించడంతో పాపులర్ అయ్యారు. 2019లో రాజకీయ ప్రచార విభాగం ప్రారంభించడంతో చార్లీ కిర్క్ కెరీర్ మలుపు తిరిగింది. 2020లో ట్రంప్ అనుకూల ప్రచారం చేయడంతో ఇక కన్జర్వేటివ్ నాయకుడుగా ఆయన వేళ్ళూనుకున్నారు.

**ఛార్లీ కిర్క్‌కు 'ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'**

ఉతాహ్ విశ్వవిద్యాలయంలో ప్రసంగిస్తుండగా హత్యకు గురైన కన్జర్వేటివ్ యువ నాయకుడు ఛార్లీ కిర్క్ (31)కు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ''ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'' ప్రకటించారు. ఛార్లీ కిర్క్ దేశంలో లక్షల లక్షలమంది యువతీయువకులకు, ప్రజలకు గొప్ప స్ఫూర్తి ప్రదాతగా ఆయన పేర్కొన్నారు. ఛార్లీ సేవలకు గుర్తుగా మరణానంతరం ఆయనకకు ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'' ఇస్తున్నట్లు ప్రకటించారు. అమెరికా ట్విన్ టవర్స్‌పై అల్‌ఖైదా ఉగ్రవాదులు దాడులు చేసి సెప్టెంబరు 11వ తేదీన నాటికి 24 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పెంటగాన్‌లోని అమెరికా రక్షణశాఖ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఉదయం ట్రంప్ ప్రసంగిస్తూ, ఛార్లీ కిర్క్‌కు ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను ప్రకటించారు. ఛార్లీ స్ఫూర్తి దేశంలో అసంఖ్యాక ప్రజల హృదయాల్లో పదిలంగా ఉండిపోతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన భార్యా,పిల్లలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ప్రధానిపై తర్జనభర్జన

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదించగా ఇద్దరుపేర్లు కూడా చర్చకు వచ్చాయి.

రాచరికపు వాసనలతో కూడిన పరిపాలన పునరుద్ధరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అంతర్జాతీయ మీడియా వ్యాఖ్యలు చేస్తున్న తరుణంలో ఆ దేశంలో తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు రెండోరోజు గురువారం కూడా చర్చలు కొనసాగాయి. ఖాట్మండు మెట్రోపాలిటన్ సిటీ మేయర్ బాలెన్ షా, విద్యుత్ బోర్డు మాజీ ఎండి కుల్మన్ ఘీసింగ్ పేర్లు కూడా పరిశీలనకు వచ్చాయి. ఐతే మేయర్ బాలెన్ షా మాత్రం సుశీల కర్కికి మద్దతు తెలియజేశారు.కొత్త ప్రభుత్వ నేతలుగా సుశీల కర్కితోపాటు మేయర్ షా, సున్సారీజిల్లా జిల్లా ప్రధాన నగరం ధారణ్ మేయర్ హర్కా సంపంగ్ పేర్లు కూడా పరిశీలనకు వచ్చాయి. ఐతే జనరేషన్ జెడ్‌లో కొన్ని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నప్పటికీ సుశీల కర్కి ఏకగ్రీవ అభ్యర్థిగా మారేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి.

దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్‌తో అధ్యక్ష కార్యాలయంలో జనరేషన్ జెడ్ నాయకత్వంతో గురువారం జరిగిన చర్చల్లో నేపాల్ సర్వసైన్యాధిపతి జనరల్ అశోక్‌రాజ్ సిగ్డల్ కూడా పాల్గొన్నారు. తొలుత సిగ్డల్‌తో ప్రదర్శకుల తరపున నాయకులు చర్చలు జరిపి అందరూకలిసి భద్రకాళిలోని ప్రధాన ప్రభుత్వ కార్యాలయానికి వెళ్ళి చర్చలు జరిపారు. ఆమె పేరును లాంఛనంగా ధృవీకరించాల్సి ఉంది. తాత్కాలిక ప్రభుత్వాధినేత ఎంపికపై సంబంధిత వర్గాలకు చెందిన అనేకమందితో ముమ్మరంగా చర్చలు జరిపినట్లు ఆర్మీ ఉన్నతాధికార ప్రతినిధులు చెప్పారు. ఐతే ఎవరెవరితో చర్చలు జరిపారన్న విషయం ఆయన చెప్పలేదు. చర్చల సమయంలో ఆర్మీ కేంద్ర కార్యాలయం వెలుపల డజన్లసంఖ్యలో యువకులు ఎంతో ఆతృతగా తుది నిర్ణయంకోసం ఎదురుచూశారు.

ముందుగా ఆర్మీ నాయకులకు, సుశీల కర్కి సహాయకులకు మధ్య చర్చలు జరిగాయి. తాత్కాక ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు సుశీల కర్కి సంసిద్ధత వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలతో యువకులు ఎవ్వరూ చర్చలు జరిపేందుకు సిద్ధంగా లేరని, కర్కీ ఒక తటస్థమైన వ్యక్తిగా, మచ్చలేని వ్యక్తిగా పేరుపడినందువల్ల ఆమెను తాత్కాలిక ప్రధానమంత్రిగా నియమిస్తే దేశాభివృద్ధికి, శాంతి సాధనకు ప్రయోజనకరంగా ఉంటుందని జనరేషన్ జెడ్ విజ్ఞప్తి చేసింది. మంచి సైద్ధాంతిక ఆలోచనలు ఉన్న నాయకుల చేతిలో దేశ భవిష్యత్తు ఉండాలని తాము కోరుకుంటున్నామని ప్రదర్శకుల తరపున నాయకులు ఆర్మీ చీఫ్‌కు చెప్పారు. దేశక్షేమంతోపాటు నిరుద్యోగ సమస్య పరిష్కారం, యువకులకు మంచి భవిష్యత్తును అందించే నాయకులకు దేశాన్ని అప్పగించాలని పలు ఇంటర్వ్యూలలో ప్రదర్శకులు చెబుతున్నారు. అమె తాత్కాలిక ప్రధానమంత్రి స్థానంలో ఉంటే భవిష్యత్‌లో అన్నివర్గాలతో జరిపే చర్చలు ఫలవంతంగా ఉంటాయని తెలియజేసింది.

**ప్రదర్శకుల డిమాండ్లు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాం : అధ్యక్షుడు పౌడెల్**

దేశంలో నిరసన ప్రదర్శకులు కోరినవిధంగా వారి అభివృద్ధికర ఆలోచనలకు అనుగుణంగా ఒక రాజ్యాంగ పరిష్కారం సాధించేందుకు శరవేగంగా ప్రయత్నం చేస్తున్నామని నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ప్రకటించారు. రెండో రోజు పలువురితో చర్చల అనంతరం గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రదర్శకులు, దేశంలో ప్రజలు శాంతిని పాటించాలని, రాజ్యాంగాన్ని రక్షించి అందుకు అనుగుణంగా నడుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. డిమాండ్లు నెరవేర్చేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామని, శాంతిని కాపాడేందుకు సహకరించాలని కోరారు.

**34కు పెరిగిన మృతుల సంఖ్య...** ఈనెల 8,9 తేదీలలో జరిగిన హింసాత్మక ఘటనలలో మరణించిన వారిసంఖ్య 19 నుండి 34కు పెరిగినట్లు నేపాల్ ఆరోగ్య, జనాభా మంత్రిత్వశాఖ గురువారం ఒక ప్రకటనలో తెలియజేసింది. అల్లర్లలో మొత్తం 1,368 మంది గాయపడ్డారు. వీరిలో 949 మందికి చికిత్సలుచేసి వివిధ ఆసుపత్రులనుండి విడుదల చేశారు. మొత్తం ఎనిమిది ఆసుపత్రులలో వీరు చికిత్స పొందుతున్నారు. త్రిభువన్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న కాలేజీలలో దేశవ్యాప్తంగా తరగతులను, పరీక్షలను అధికారులు పరిస్థితులు చక్కబడేవరకూ రద్దుచేశారు. ఇంకోవైపు దేశంలోని అనేక ప్రాంతాలలో కర్ఫ్యూ, నిషేధాజ్ఞలను పొడిగించారు. దీంతో రాజధాని ఖాట్మండు, రూపందేహి, మోరాంగ్ సహా అనేక ప్రాంతాలలో పగటిపూట ఉదయం ఆరు నుండి సాయంత్రం ఐదు గంటల వరకూ వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఆర్మీ పెద్దసంఖ్యలో గస్తీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఐతే ఛిత్వాల్‌లో గురువారం ఉదయ కర్ఫ్యూ తొలగించారు. బ్యాంకులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు మధ్యాహ్నం ఒంటిగంటవరకూ పనిచేశాయి.

# జనరల్
STATE & REGIONAL NEWS


## భారత్‌–ఆఫ్రికా సంబంధాల బలోపేతానికి మరింత కృషి
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత్‌–ఆఫ్రికా దేశాల మధ్య వ్యవసాయ రంగంలో సంబంధాల బలోపేతానికి మరింత కృషి చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన ఇండియా–ఆఫ్రికా సీడ్ సమ్మిట్– 2025కు మంత్రి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ సమ్మిట్ కేవలం వాణిజ్యంపై కాకుండా, సీడ్ డిప్లొమసీ ద్వారా విశ్వాసాన్ని పెంపొందించడం, శాస్త్ర పరిజ్ఞానం పంచుకోవడం, సుస్థిరమైన వ్యవసాయానికి భవిష్యత్తులో పరస్పరం కలిసి పనిచేయడం కోసం ఈ వేదిక ఒక వారధిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. భారత దేశం గ్రీన్ రివల్యూషన్ ద్వారా ప్రపంచంలోనే తొలిసారిగా ఆహార ధాన్యాలలో స్వయం సమృద్ధి సాధించిందని, ఆ విజయానికి మూలం నాణ్యమైన విత్తనం అని, నాణ్యమైన విత్తనమే లేకపోతే పంట లేదు. అలాగే రైతు ప్రగతి సాధ్యం కాదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ దేశాల నుండి, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అమరవీరుల స్మృతివనం ఏర్పాటు చేయాలి

### తెలంగాణలో కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర
### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి





**ప్రజాపక్షం/కరీంనగర్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల కోసం హైదరాబాద్‌లో స్మృతివనం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణలో కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర ఉందన్నారు. రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తే బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను కరీంనగర్‌లో గురువారం ప్రారంభించారు. స్థానిక బద్దం ఎల్లారెడ్డి విగ్రహానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం బద్దం ఎల్లారెడ్డి విగ్రహం నుంచి సిపిఐ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కోతిరాంపూర్, కమాన్, తెలంగాణ చౌరస్తా మీదుగా అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం వద్దకు బైక్ ర్యాలీ చేరుకుంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులను స్మరిస్తూ కార్యకర్తలు నినాదాలతో మారుమ్రోగించారు. ఈ సందర్భంగా అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి సిపిఐ నేతలు చాడ, పంజాల శ్రీనివాస్‌లు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆకలి మంటలు, ఆర్తనాదాలు, అణచివేతలకు వ్యతిరేకంగా పుట్టిందే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని పేర్కొన్నారు. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే నిజాం నవాబుల పరిపాలనలో కొనసాగుతున్న హైదరాబాద్ రాష్ట్రానికి (తెలంగాణ)కు స్వాతంత్ర్యం రాలేదన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతోమంది కమ్యూనిస్టులు పోరాటం చేసి అసువులు బాసారని పేర్కొన్నారు. తెలంగాణలో జరిగిన ఆంధ్రమహాసభల్లో హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలిస్తున్న నవాబుల పరిపాలన అంతం కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి బద్దం ఎల్లారెడ్డి, రావినారాయణరెడ్డి, మఖ్దూం మొయినొద్దీన్‌ల పిలుపుతో కమ్యూనిస్టులు వీరోచిత పోరాటాలు చేశారన్నారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. 4500 మంది ప్రాణాలు పోగొట్టుకున్న త్యాగాల చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కరీంనగర్ జిల్లా పాత్ర కీలకంగా ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజల కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అసువులు బాసిన అమరవీరుల ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు సిపిఐ శ్రేణులు కంకణబద్ధులు కావాల్సిన అవసరముందన్నారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనగంటి కేదారి, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, వివిధ మండలాల కార్యదర్శులు బండ రాజిరెడ్డి, గోవిందుల రవి, చొక్కల్ల శ్రీశైలం, లంకదాసరి కళ్యాణ్, ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులున్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవాన్ని
# ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దినోత్సవం పేరుతో సెప్టెంబర్ 17న ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలను నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషాలు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహతో కలిసి వారు మాట్లాడారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరితో పాటు తెలంగాణ ప్రాంత విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మట్టిమనుషులంతా ఏకమై దొరలు, భూస్వాములు, జాగీర్‌దారుల గడీలు బద్దలుకొట్టి వారిని తరిమి కొట్టిన మహోత్తర ఉద్యమం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటామని, అలాంటి వీర తెలంగాణ పోరాట స్ఫూర్తిని నేటి తరాలకు అందించాల్సిన ప్రభుత్వాలు సమైక్య దినోత్సవమంటూ, ప్రజాపాలన దినోత్సమంటూ రకరకాల పేర్లతో వేడుకలు జరపడమేమిటని ప్రశ్నించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పేరుతోనైనా ఉత్సవాలను నిర్వహించాలని, ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచి పేరు, గుర్తింపు వస్తుందని సూచించారు. నాటి సమర యోధుల త్యాగాలతో పాటు వారి చరిత్ర భావితరాలకు అందించేందుకు రాష్ట్ర రాజధాని కేంద్రమైన హైదరాబాద్‌లో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయడంతో పాటు ఈ పోరాటానికి నాయకత్వం వహించిన బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి, అరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి, ధర్మభిక్షం లాంటి మహానేతల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై లేదా ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఓ చరిత్ర అని, ఆ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య ఘర్షణగా వక్రీకరించేందుకు బిజెపి ప్రయత్నం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**తొలిసారి జాతీయ పతాకాన్ని ఎగురవేసింది ఏహెచ్‌ఎస్‌యు నేత రఫీనే**

దేశానికి స్వాతంత్ర్యం లభించిన 1947 అగస్టు 15న నిజాం నిర్భందాలను ఛేధించుకుని హైదరాబాద్‌లోని సిటీ కళాశాలలో జాతీయ పతాకాన్ని మొట్టమొదటిసారిగా ఆవిష్కరించింది ఆల్ హైదరాబాద్ స్టూడెంట్ యూనియన్‌ది నాయకుడు రఫీ అహ్మద్ అని, ఇది చరిత్ర అని, దీనిని ఎవరూ తుడిచివేయలేరని అజీజ్ పాషా స్పష్టం చేశారు. తెలంగాణ విముక్తి కోసం 4 వేల మంది యోధులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన మహత్తర చరిత్ర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానిదని అన్నారు. గ్రామాల నుంచి దొరలను తరిమితరిమి కొట్టి 4వేల గ్రామాలను విముక్తి చేయడంతో పాటు 10 లక్షల ఎకరాలకు పైగా భూములను పేదలకు పంచిందని, అంత ఘనచరిత్ర ఉన్న ఈ పోరాటాన్ని 2011వరకు కనీసం జాతీయ పతాకాన్ని కూడా ఎగురవేయని ఆర్‌ఎస్‌ఎస్ కన్నుసన్నల్లో పురుడుపోసుకున్న బిజెపి ఇప్పుడు వక్రీకరించడం హేయమైన చర్య అన్నారు.

## పారదర్శకతే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్ల
# ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు

### కాల్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి
### టోల్ ఫ్రీ కాల్ సెంటర్ ఫోన్ 1800 599 5991



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణం మొదలు సబ్సిడీ విడుదల వరకు పూర్తి పాదర్శకతే లక్ష్యంగా ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సమస్యలు, సందేహాల నివృత్తి కోసం హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ కాల్ సెంటర్‌ను, హెల్ప్ డెస్క్‌ను గురువారం మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎలాంటి సందేహాలు, సమస్యలు ఉన్నా తక్షణమే కాల్ సెంటర్ ఫోన్ నెం. 1800 599 5991 ఫోన్ చేయవచ్చాన్నారు. ఈ కాల్ సెంటర్ ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9గంటలవరకు పనిచేస్తుందని ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించడంతోపాటు, వాటిని పరిష్కరించడంలో చొరవ చూపడానికి ఈ కాల్‌సెంటర్‌ను వినియోగించుకోవచ్చునన్నారు. లబ్ధిదారుల ఫోన్ నెంబరు, ఆధార్ నెంబరు ఆధారంగా వివరాలను పరిశీలించి సమస్యను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకుంటారని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, పూర్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నామని, ఇప్పటికే ఇందిరమ్మ యాప్ ద్వారా మంచి ఫలితాలు సాధించామని, కృత్రిమ మేధ (ఎఐ)ను కూడా విరివిగా వాడుతున్నామని, ఈ కాల్ సెంటర్ ద్వారా లబ్ధిదారులకు మరింత చేరువ అవుతున్నామని మంత్రి పేర్కొన్నారు.

# సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
### కాజీపేటలో ఘనంగా సాయుధ పోరాట వార్షికోత్సవం



**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ విలీన దినోత్సవంపై కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు కపట నాటకాలు ఆడుతున్నాయని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా హనుమకొండ జిల్లాలో గురువారం సిపిఐ కాజీపేట మండల సమితి ఆధ్వర్యంలో రాంపూర్ లోని అర్శనపల్లి హనుమంతరావు స్థూపం వద్ద వార్షికోత్సవ సభ నిర్వహించారు. సభకు ముందుగా అర్శనపల్లి హన్మంతరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభకు సిపిఐ మండల కార్యదర్శి మాలోతు శంకర్ అధ్యక్షత వహించగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని, ట్యాంక్ బండ్ పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడతామని, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన హామీలను ప్రభుత్వం ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ నైజాం పై పోరాటాన్ని హిందూ, ముస్లింల గొడవగా చిత్రీకరిస్తున్నదని అన్నారు. బిజెపికి తెలంగాణ విలీన దినోత్సవంపై మాట్లాడే హక్కు లేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని, అమరుల జీవిత చరిత్రలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా చేర్చడంతో పాటు తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు మద్దెల ఎల్లేష్, తోట బిక్షపతి, నాయకులు ఎన్ ఎ స్టాలిన్, మునిగాల బిక్షపతి, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, యేషబోయిన శ్రీనివాస్, కొట్టేపాక రవి, వేల్పుల సారంగపాణి, అలువాల రాజు, బొట్టు బిక్షపతి, కొట్టే వెంకటేష్, లకవత్ లక్ష్మి, దండు సుమన్, గోకుల రాజయ్య, మునిగాల ఐలయ్య, రాజరాపు రాజు, పసునూరి సునీల్, మునిగాల రాజు, రీల్ పూర్ణచందర్, బైరపాక అన్నమ్మ, మడికంటి లావణ్య, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉదయించే సూరీడు సురవరం

### ఆయన ఆశయాలకు పునరంకితం అవుదాం
### సురవరం సంస్మరణ సభలో వివిధ పార్టీ నేతలు పిలుపు



**విజయవాడ :** ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేసి, ప్రజల గుండెల్లో ఉదయించే సూరీడుగా భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడు సురవరం సుధాకరరెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని వివిధ రాజకీయ పార్టీల నేతలు కొనియాడారు. అనారోగ్య కారణంగా ఇటీవల మరణించిన సురవరం సుధాకర్‌రెడ్డిని స్మరించుకుంటూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సంసర్మణ సభ విజయవాడలోని దాసరిభవన్‌లో గురువారం ఘనంగా జరిగింది. ఈ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకష్ణ అధ్యక్షత వహించారు.

అనంతరం కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావు, వైసిపి శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ, టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు టిడి జనార్దన్, సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి మధు తదితర నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తొలుత ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన తెలుగు నేలపై...వెలచిన సురవరమా...మరణమైన జననం గల మానవత సురవరమా అనే పాట వింటున్న వీక్షకుల గుండెలు బరువెక్కాయి. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలపై పోరాడి అజాతశత్రువుగా సురవరం సుధాకర్‌రెడ్డి నిలిచిపోయారని స్పష్టం చేశారు. తెలంగాణాలో జన్మించిన ఇరు రాష్ట్రాల ప్రజలతో చెరగని అనుబంధాన్ని కలిగియున్న ఏకైక నాయకుడన్నారు. కమ్యూనిజం సిద్ధాంతాల ఆశయ సాధన కోసం పనిచేసిన కుటుంబ నేపథ్యం నుండి వచ్చిన సురవరం విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాలలో చురుకుగా పాల్గొని తనదైన ముద్ర వేసుకున్నారని అన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు మరింత ఉన్నతంగా ఎదగాలని ఆ దిశగా కృషి చేసేవారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు కెవిపి. రామచంద్రరావు మాట్లాడుతూ 60సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో నిబద్ధతతో అదే సిద్ధాంతాన్ని నమ్ముకుని చివరి వరకు కొనసాగిన నాయకుడు సురవరం అన్నారు. పార్టీ , నాయకులపరంగా ఎన్నో అవమానాలు, కష్టాలు వచ్చినా చెరగని చిరునవ్వుతో ముందుగు సాగేవారని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డితో మంచి సత్సంబంధాలు ఉన్నాయని, బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమంలో ప్రాణాలు సహితం లెక్కచేయకుండా ఉద్యమించారనిగుర్తుచేశారు. యుపిఎ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పుడు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తూ కార్మిక, కర్షకులకు చెందిన అంశాలపై దృష్టిసారించి హక్కులు సాధనకు కారణమయ్యారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనను వ్యతిరేస్తూ సిపిఐ విశాలాంధ్ర కోసం గట్టిగా నిలబడిందని, దీంతో సువరం పోరాడారని తెలిపారు.

వైసిపి శాసనమండలి పక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ సిపిఐ నాయకత్వంతో తనకు అనుబంధం ఉందని, నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పోరాడిన సురవరం గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలు సమాజానికి ఎంతో అవసరం అన్నారు. చిన్న చిన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నా ఉభయ కమ్యూనిస్టు పార్టీల సిద్ధాంతాలు నేటి సమాజానికి అందించాలని పిలుపునిచ్చారు.

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు టిడి జనార్దన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి చివరకు పార్టీ కోసం పనిచేశారని తెలిపారు. జిల్లా స్థాయి నుంచి దేశ స్థాయి వరకు అగ్ర నాయకుడుగా ఎదిగి, ప్రజలు పక్షంగా ఉద్యమాలు చేశారని తెలిపారు. చనిపోయిన తరువాత ప్రజల మనస్సుల్లో ఉన్నవాడే నిజమైన నాయకుడని, ఆ కోవకు చెందినవారే సురవరం అని తెలిపారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ పార్టీలు వేరైనా సురవరంతో ఉన్న అనుబంధం విలువైనదని, నేటి సభకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు హాజరవడం అందుకు నిదర్శనం అన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ఈ స్థాయి గుర్తింపు రావడానికి సురవరం కృషే కారణమని, నిరుపేదలు, దళితులు, బలహీనవర్గాల పక్షంగా ఆయన నిలిచారని చెప్పారు. ఈ సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ, వైసిపి నాయకులు గౌతంరెడ్డి, సిపిఐ న్యూ డెమోక్రసీ నాయకులు ప్రసాద్, సిపిఐ (ఎంఎల్ ) నాయకులు, జనచైతన్య వేదిక వ్యవస్థాపకులు లక్ష్మాణరెడ్డి తదితరులు ప్రసగించారు. సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ వందన సమర్పణ చేశారు. అనంతరం పలు విప్లవ గేయాలతో ఓ బాలిక చేసిన నృత్యం వీక్షకులలో పోరాట స్ఫూర్తిని రగిలించింది. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ హరినాథ్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకులు పి.దుర్గాభవాని, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు తదితర నాయకులతో పాటు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారాం కోసం పరితపించేవారు
**–సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి**

తన రాజకీయ జీవిత ప్రస్థానంలో నిబద్ధతతో ప్రజా సమస్యల పరిష్కారాం కోసం పరితపించేవారని సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి తెలిపారు. ఆ విధంగా జిల్లా స్థాయి నుంచి దేశ స్థాయి రాజకీయాలలో తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించి అన్ని పార్టీలను ఐక్యం చేసి, విద్యుత్ ఫలాలు ప్రజలకు అందడానికి పోరాటం చేశారని తెలిపారు. పార్టీ ఆశయాలు, ప్రజల పట్ల నిబద్ధతతో పోరాటాలు స్ఫూర్తిగా నిలిపిన ఆయన ఆశయాలను అందిపుచ్చుకుని యువతకు పోరాటాల విద్య పట్ల ఆసక్తిని పెంపొందించాలని పిలుపునిచ్చారు.

### సురవరం ఉద్యమ పాఠశాలకు రూ.కోటి విరాళం
**విశ్రాంత ప్రొఫెసర్ నరసింహారావు దంపతులు ప్రకటన**

నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి 55సంవత్సరాలు రాజకీయ ప్రస్థానంతో ప్రజలపక్షంగా పోరాడిన యోధుడు, గొప్ప నాయకుడు సురవరం అని విశ్రాంత ప్రొఫెసర్ నరసింహారావు అన్నారు. ఉన్నతమైన వ్యక్తిత్వంతో సామాన్యమైన జీవితాన్ని గడిపారని గుర్తు చేశారు. దేశంలో మారుతున్న రాజకీయాలు, పరిస్థితులు గందరగోళంగా మారాయని, నాటి ఉద్యమ పోరాట స్ఫూర్తి లేకపోవడం దురదష్టకరమన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి పోరాట స్ఫూర్తితో ఉద్యమ పాఠశాలను నెలకొల్పేందుకు, అందుకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. తొలుత కోటి రూపాయిలు విరాళంగా ఇస్తున్నానని ఈ సభలో ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు అభినందనలు తెలియజేశారు.



# ఉద్యానవన పంటల విస్తీర్ణం పెంచాలి
### రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఉద్యాన వన పంటల విస్తీర్ణం పెంచడంతోపాటు సాంప్రదాయ పంటలను కాపాడుకోవాలని తెలంగాణ వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. సాంప్రదాయ పంటల్లో భాగమైన బత్తాయి రైతుల సమస్యలపై గురువారం రైతు కమిషన్ కార్యాలయంలో ఉద్యానవన, మార్కెటింగ్ శాఖ అధికారులు, హార్టికల్చర్ యూనివర్సిటీ శాస్తవేత్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బత్తాయి సాగులో ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రత్యేక స్థానముందని, గతంలో ఆ జిల్లాలో 4లక్షల ఎకరాల్లో బత్తాయి సాగైతే.. ఇప్పుడు మాత్రం కేవలం 43 వేల ఎకరాలకు పడిపోయిందన్నారు. కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, భూమి సునీల్, గోపాల్ రెడ్డి, రాములు నాయక్, భవాని రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్ తోపాటు కమిషన్ సెక్రెటరీ గోపాల్, మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మహర్షిణి, ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ బాబు, నల్గొండ డిఎస్‌హెచ్‌ఒ సుభాషిణి, ఉద్యానవన శాస్త్ర వేత్తలు రాజా గౌడ్, కమిషన్ అధికారులు హరి వెంకట ప్రసాద్, మహేష్ నాయక్, శ్రావ్య, డాక్టర్ విజయలక్ష్మి , ఇతర అధికారులు పాల్గొన్నారు.


hmda
**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

బహిరంగ ప్రకటన
ప్రణాళిక విభాగం
file No. 004317 /HMDA /01267/ SWBP/SKP1/2025-REV

M/s అభినందన ఇన్‌ఫ్రా రియాలిటీ LLP గతంలో రంగారెడ్డి జిల్లా మణికొండ జాగీర్ గ్రామంలో 2,919.06 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న సర్వేనెంబర్ 264/EEలో రెండు సెల్లార్లు + 1 గ్రౌండ్ + 3పై అంతస్తులు కలిగిన IT ఆఫీస్ భవనం కోసం తేదీ: 31.12.2021 నాటికి దరఖాస్తు చేసుకుంది.

రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం మణికొండ జాగీర్ గ్రామంలో 4929.26 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న Sy.No.s: 264/EE, 264/A/Pలోని ఓపెన్ ల్యాండ్‌లో 2 సెల్లార్లు +1 గ్రౌండ్ + 8 అప్పర్ ఫ్లోర్లతో కూడిన సవరించిన కమర్షియల్ బిల్డింగ్ అనుమతి ఆమోదం కోసం M/s అభినందన ఇన్‌ఫ్రా రియాలిటీ LLP తేదీ:18.07.2025న దరఖాస్తు చేసుకుంది.

అందువల్ల, రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం మణికొండ జాగీర్ గ్రామంలో ఉన్న Sy.No.s: 264/EE, 264/A/P లోని చెప్పబడిన కమర్షియల్ బిల్డింగ్ యొక్క ఫ్లాట్ ఓనర్లు / కొనుగోలుదారులు / అగ్రిమెంట్ హోల్డర్లు ఈ నోటీసు ప్రదర్శించబడిన 15 రోజుల లోపు తమ అభ్యంతరాలు / సూచనలను ఈ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా దాఖలు చేయవచ్చు. పైన పేర్కొన్న వ్యవధిలోపు ఎటువంటి అభ్యంతరాలు / సూచనలు అందకపోతే రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం మణికొండ జాగీర్ గ్రామంలో ఉన్న 4929.26 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న సవరించిన కమర్షియల్ బిల్డింగ్ Sy.No.s: 264/EE, 264/A/P ఆమోదం కోసం పెట్టుకున్న దరఖాస్తు అభ్యర్ధనను ఈ కార్యాలయంలో అందుబాటులో ఉన్న మెటీరియల్ పేపర్ల ఆదారంగా పరిగణిస్తారు.

సం/- మెట్రోపాలిటన్ కమిషనర్
డైరెక్టర్ ప్లానింగ్-II, HMDA కోసం.
DIPR R.O. No. : 7914-PP/CL/ADVT/1/2025-26, Date: 11-09-2025



# జనరల్

STATE & REGIONAL NEWS

## వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. పురాతన ఇళ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సిఎం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో హైడ్రా, జిహెచ్‌ఎంసి, ఎస్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక, ట్రాఫిక్, పోలీసు సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిఎం సూచించారు. వాగులపై ఉన్న లోతట్టు కాజ్‌వేలు, కల్వర్టులపై నుంచి నీటి ప్రవాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిఎం ఆదేశించారు. చెరువులు, కుంటలకు గండి పడే ప్రమాదం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిఎం సూచించారు.

## హెచ్‌సిఏ బ్యాంకు లావాదేవీలకు అనుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో అక్రమాలు జరిగాయంటూ సీఐడీ కేసు నేపథ్యంలో ఫ్రీజ్ అయిన బ్యాంకు ఖాతా నిర్వహణకు అనుమతించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సీఐడీ, కెనెరాల బ్యాంక్‌లకు ఆదేశాలిచ్చింది. హెచ్‌సీఏ బ్యాంక్ అకౌంట్ స్తంభింపజేయడాన్ని అసోసియేషన్ సవాల్ చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు గురువారం ఈఉత్తర్వులను జారీ చేసింది.

## విద్యార్థి సర్టిఫికెట్లు ఇవ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్, మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ తన సర్టిఫికెట్లు ఇవ్వడం లేదంటూ సంజయ్ కుమార్ అనే వ్యక్తి వేసిన పిటిషన్‌లో హైకోర్టు ఉత్తర్వులను జారీ చేసింది. విద్యార్థులు 4 ఏళ్ల ట్యూషన్ ఫీజు చెల్లించమని కాలేజీ పట్టుబట్టకుండా అతని సర్టిఫికెట్లను ఇవ్వాలంది. ఈ మేరకు జస్టిస్ లక్ష్మణ్ ఆదేశించారు.

## బతుకమ్మ తెప్ప నిర్మాణంపై స్టేటస్‌కో

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండలం కొదురుపాక గ్రామంలో బతుకమ్మ తెప్ప నిర్మాణ పనులను నిలిపివేస్తూ హైకోర్టు స్టేటస్‌కో ఆర్డర్ ఇచ్చింది. నిర్మాణాలు చేస్తే కలెక్టర్‌ను కోర్టుకు పిలిచి విచారిస్తామని చెప్పింది. గ్రామ నడిబొడ్డులో బతుకమ్మ తెప్ప నిర్మాణానికిగాను ఆగస్టు 29న కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇవ్వడాన్ని ాతిరుపతి అనే వ్యక్తి పిటిషన్ వేయగా జస్టిస్ మాధవీదేవి ఉత్తర్వులను జారీ చేశారు. గ్రామ సభ గుడి వెనుక నిర్మాణం చేయాలని, గ్రామం మధ్యలో వద్దని తీర్మానం చేస్తే, గ్రామ నడిబొడ్డున నిర్మాణ పనులు ప్రారంభించారని పిటిషన్‌పై విచారణను ఈ నెల 15కి వాయిదా పడింది.

## బిజెపి కక్షపురిత రాజకీయం

### టిపిసిసి ఉపాధ్యక్షురాలు కోట నీలిమ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓట్ చోరీపై కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ సాక్షాధారాలతో పోరాటం చేస్తున్నందునే కాంగ్రెస్ నేతలపై బిజెపి కక్షపురిత రాజకీయం చేస్తున్నదని టిపిసిసి ఉపాధ్యక్షురాలు కోట నీలిమ అన్నారు. తనకు, ఎఐసిసి మీడియా ఇంచార్జ్ పవన్ ఖేరాపై బిజెపి సోషల్ మీడియాలో ఆరోపణలు చేస్తున్నారని, రెండు ఓటర్ ఐడి కార్డులు ఉన్నాయని ఎన్నికల కమిషన్ నోటీసులు ఇచ్చిందన్నారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను 2017లో ఇల్లు మారిన సమయంలో అడ్రస్ మార్చమని ఫామ్ 6 ఈసికి ఇచ్చామని, తమకు ఎక్‌నాలేడ్జ్‌మెంట్ కూడా ఇచ్చారని, ఫామ్ 6 ఇచ్చినా కూడా ఎన్నికల కమిషన్ తన అడ్రస్ మార్చలేదని, స్వతంత్ర సంస్థ అయిన ఎన్నికల కమిషన్ కూడా ఇలా ఎందుకు చేస్తుందని ప్రశ్నించారు. తమను అప్రతిష్ట పాలు చేసిన బిజెపి ఐటి సెల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ నాయకులను ఎంత అప్రతిష్ట పాలు చేసినా సరే 'ఓట్ చోరీ'పై కాంగ్రెస్ పోరాటం ఆగదన్నారు.



## సరూర్‌నగర్ సరస్సులో నీటి నాణ్యతను మెరుగుపరచాలి

### జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సరూర్‌నగర్ సరస్సులో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసి, నీటి నాణ్యతను మెరుగుపరిచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఎల్.బి. నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం) సి.ఎన్. రఘు ప్రసాద్‌లతో కలిసి గురువారం సరూర్‌నగర్ చెరువును సందర్శించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం అనంతరం సరస్సులో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పారిశుద్ధ్య ప్రమాణాలను మెరుగుపరచడం, నీటి నాణ్యతను పెంచడం, సరస్సు జీవావరణాన్ని పరిరక్షించడంపై ప్రధానంగా దృష్టి సారించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిమజ్జనం అనంతరం పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, సరస్సును పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు.




## కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన మనీష్ యాదవ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఎ. మనీష్ యాదవ్ అరుదైన ఘనత సాధించారు. టాంజానియాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి, ఈ ఘనత సాధించిన తొలి తెలుగు వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. దాదాపు 5,895 మీటర్ల (19,341 అడుగుల) ఎత్తైన ఈ పర్వతాన్ని అధిరోహించడం ద్వారా ఆయన తన చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకున్నారు. చిన్ననాటి నుంచే క్రీడలు, పర్వతారోహణపై మక్కువ పెంచుకున్న మనీష్ యాదవ్‌కు తల్లిదండ్రులు మధ్యతరగతి కుటుంబానికి చెందినవారైనప్పటికీ, అతని ఆసక్తిని ఎంతగానో ప్రోత్సహించారు. టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి. సాయిబాబా, మనీష్ యాదవ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఒక తెలుగువాడు కిలిమంజారోను అధిరోహించడం గర్వకారణమని ఆయన అన్నారు. భవిష్యత్తులో మనీష్ మరిన్ని సాహసోపేతమైన పర్వతారోహణలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ విషయాన్ని పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, మరింత ప్రోత్సాహం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలిస్తే, ఎవరెస్ట్ శిఖరాన్ని కూడా అధిరోహించేందుకు మనీష్ సిద్ధంగా ఉన్నాడని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో నల్లెల్ల కిషోర్, పి. బాలరాజ్ గౌడ్, ఎస్. ప్రకాష్, శ్రీనివాస్ గౌడ్, ప్రదీప్ గౌడ్, కిరణ్, శ్రీనివాస్ నాయుడు, సుక్రవేది, యాదగిరి పాల్గొన్నారు.

## గ్రేటర్ హైదరాబాద్ రోడ్లపై..

# ప్రైవేట్ వాహనాలదే హవా..

### కనుమరుగవుతున్న ప్రజా రవాణా ! హెచ్‌ఎండిఏ అధ్యయనంలో కీలక విషయాల వెల్లడి



(మల్లం వెంకటేశ్)

గడిచిన పన్నెండేళ్లలో హైదరాబాద్ నగర రోడ్లపై ప్రైవేట్ వాహనాల సంఖ్య లక్షల్లో పెరిగిపోయింది. ప్రజా రవాణా వ్యవస్థను దాదాపు దిగువకు జారిపోయింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఏ) ఇటీవల నిర్వహించిన ఒక అధ్యయనంలో ఈ ఆందోళనకరమైన విషయం వెల్లడైంది. హెచ్‌ఎండిఏ సమగ్ర రవాణా ప్రణాళిక (సిఎంపి) తయారీలో భాగంగా, సంవత్సరాలుగా రవాణా విధానాలలో వచ్చిన మార్పులను అర్థం చేసుకోవడానికి హెచ్‌ఎండిఏ ఈ అధ్యయనాన్ని చేపట్టింది. 2011 నుంచి 2024 మధ్య కాలంలో ప్రజలు ప్రజా రవాణా నుంచి ప్రైవేట్ వాహనాల వైపు భారీగా మళ్లినట్లు ఈ అధ్యయనం స్పష్టం చేసింది. దీని ప్రభావంగా బస్సుల వినియోగం తగ్గిందని అధ్యయనం స్పష్టం చేస్తోంది. ద్విచక్ర వాహనాలు, కార్ల వినియోగం విపరీతంగా పెరిగిపోయింది.

**అధ్యయనంలో తేలిన ముఖ్యాంశాలు..**

2011లో నగర జనాభాలో 42 శాతం మంది ఆర్‌టిసి బస్సులను వినియోగించగా, 2016 నాటికి ఆ సంఖ్య 33 శాతానికి, 2024 నాటికి కేవలం 25 శాతానికి పడిపోయింది. అయితే రోజువారీ ప్రయాణికుల సంఖ్యలో పెద్దగా మార్పులేదు. 2011లో రోజుకు 37.6 లక్షల ట్రిప్పులు నమోదు కాగా, 2024లో 38 లక్షల ట్రిప్పులు నమోదయ్యాయి. ఇదే కాలంలో కార్ల వినియోగం ఏకంగా నాలుగు రెట్లు పెరిగింది. 2011లో రోజుకు కేవలం 4 లక్షల (4 శాతం) కార్ల ట్రిప్పులు నమోదు కాగా, 2016 నాటికి 7.7 లక్షలకు (7 శాతం), 2024 నాటికి ఊహించని విధంగా 24.3 లక్షల ట్రిప్పులకు (16 శాతం) పెరిగింది.

**పెరిగిన ద్విచక్ర వాహనాలు..**

ద్విచక్ర వాహనాల వినియోగం కూడా గణనీయంగా పెరిగింది. 2011లో 33.4 లక్షలగా ఉన్న రోజువారీ ట్రిప్పులు, 2016 నాటికి 51.7 లక్షలకు, 2024 నాటికి 69.2 లక్షలకు చేరాయి. అయితే, 2024లో ద్విచక్ర వాహనాల వాటాలో రెండు శాతం స్వల్ప తగ్గుదల కనిపించింది. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు పథకం ప్రభావం ఇందుకు కారణంగా నిపుణులు భావిస్తున్నారు. రైడ్ హెయిలింగ్ యాప్‌లు పెరిగినప్పటికీ, ఆటోల వినియోగం 2011లో 7 శాతం నుంచి 2024 నాటికి 5 శాతానికి తగ్గింది. అయితే ట్రిప్పుల సంఖ్య 6.5 లక్షల నుంచి 8.2 లక్షలకు పెరిగింది. ట్యాక్సీల ప్రయాణం 5 శాతం నుంచి 6 శాతానికి స్వల్పంగా పెరిగింది.

**కనుమరుగైన ఎంఎంటిఎస్..**

ఒకప్పుడు నగరవాసులకు అందుబాటులో ఉన్న ఎంఎంటిఎస్ రైళ్ల వినియోగం దాదాపు కనుమరుగైంది. 2011లో రోజుకు 3.5 లక్షల ట్రిప్పులు నమోదు కాగా, 2024 నాటికి కేవలం 30,000 ట్రిప్పులకు పడిపోయింది. 2017 చివర్లో కార్యకలాపాలు ప్రారంభించిన హైదరాబాద్ మెట్రో రైల్, 2024 నాటికి రోజుకు 4.8 లక్షల ట్రిప్పులతో నగర రవాణాలో 3 శాతం వాటాను నమోదు చేస్తోంది. ప్రజల రవాణా అభిరుచుల్లో వచ్చిన ఈ భారీ మార్పు, నగర రవాణా ప్రణాళికల్లో గణనీయమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది. ప్రైవేట్ వాహనాల పెరుగుదల ట్రాఫిక్ సమస్యలతో పాటు వాయు కాలుష్యాన్ని కూడా పెంచే ప్రమాదం ఉన్నందున, ప్రజా రవాణాను మళ్లీ ప్రాధాన్యంలోకి తీసుకొచ్చే విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉంది.

## ఐఐటి, ఐఐఎం, ఎన్‌ఐటిల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు

# 100 శాతం స్కాలర్‌షిప్ ఇవ్వాలి

### కేంద్రానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఐఐటీ, ఐఐఎం, ఎన్‌ఐటీల్లో తెలంగాణలోని ఎస్‌సి,ఎస్‌టి, మైనారిటీల నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు అధికంగా సీట్లు సాధిస్తున్నారని, అలాంటి ప్రతిభావంతులందరికీ 100 శాతం స్కాలర్‌షిప్ ఇవ్వాలని ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ,దివ్యాంగుల సంక్షేమ శాఖా మంత్రిఅడ్లూరి లక్ష్మణ్ కుమార్ కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిక మంత్రి డా. వీరేంద్ర కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. వికసిత్ భారత్–2047 దిశగా సమాజంలోని మార్జినలైజ్డ్ సెక్షన్ల అభివృద్ధి రోడ్ మ్యాప్ రూపకల్పనలో భాగంగా గురువారం అన్ని రాష్ట్రాల సంక్షేమ మంత్రులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిక మంత్రి డా. వీరేంద్ర కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రీ, ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను ఇప్పటి 60 శాతం నుంచి 75 శాతానికి పెంచాలని కేంద్రాన్ని కోరారు. సిఎం ఏ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ విద్యారంగం దేశంలో ప్రత్యేక స్థానం సంపాదించిందని, దీన్ని మరింత బలోపేతం చేయడానికి కేం ద్రం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎస్‌సి హాస్టళ్లు శిధిలావస్థకు చేరుకున్నాయని, ఆధునిక హాస్టళ్ల నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు కేటాయించాలని కోరారు.వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తిచే శారు. ఎస్‌సిలో చాలామందికి ఇల్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులు అధికంగా ఉన్నందున పేదలకు గృహనిర్మాణంలో కేంద్రం ఆర్థిక సహకారం అందించాలన్నారు. వృద్ధాప్య పెన్షన్లకుగాను కేంద్రం 68–79 ఏళ్ల వారికి నెలకు రూ.200, 80 ఏళ్లు పైబడిన వారికి రూ.500 మాత్రమే ఇస్తోందని ఇది వారికి సరిపోదని మానవతా దృక్పథంతో సహాయాన్ని పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి విజ్ఞప్తి చేశారు. వికలాంగులకు తెలంగాణ ప్రభుత్వం నెలకు రూ.4,000 ఇస్తోందని, ఈ దిశగా కేంద్రం కూడా ముందడుగు వేయాలన్నారు. తెలంగాణకు సంబంధించి తమ విజ్ఞప్తులపై కేంద్ర ప్రభుత్వానికి త్వరలో ఒక నివేదిక సమర్పించనునట్టు మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్త్రీ,శిశు సంక్షే మ,దివ్యాంగుల శాఖ, కార్యదర్శి అనితా రామచంద్రన్, ఎస్‌సిడిడి ముఖ్య కార్యదర్శి బుద్ధ ప్రకాష్, , దివ్యాంగుల శాఖ డైరెక్టర్ శైలజ , సీనియర్ ఐ ఎఫ్ ఎస్ అధికారి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో రోడ్డు భద్రతా..

# చర్యలు ప్రశంసనీయం

### సుప్రీంకోర్టు కమిటీ చైర్మన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో రోడ్డు భద్రతను మెరుగుపరచడానికి, ప్రమాదాల నివారణకు జిహెచ్‌ఎంసి చేపడుతున్న చర్యలు ప్రశంసనీయంగా ఉన్నాయని సుప్రీంకోర్టు రోడ్డు భద్రతా కమిటీ (ఎస్‌సిఓఆర్‌ఎస్) చైర్మన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే అన్నారు. జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌తో కలిసి గురువారం ఆయన నగరంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. జూబ్లీహిల్స్‌ను మాదాపూర్‌తో కలిపే రోడ్ నెంబర్ 45 ఫ్లైఓవర్‌తో పాటు, కొండాపూర్‌ను గచ్చిబౌలితో అనుసంధానించే పి. జనార్దన్ రెడ్డి ఫ్లైఓవర్‌పై జిహెచ్‌ఎంసి ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల భద్రత కోసం తీసుకుంటున్న పటిష్టమైన చర్యలను కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జస్టిస్ సప్రేకు వివరించారు. ఫ్లైఓవర్లపై ఏర్పాటు చేసిన హెచ్చరిక సైన్ బోర్డులు, రేడియం స్టిక్కర్లు, సిసి కెమెరాలు, వేగాన్ని అదుపు చేసే రంబుల్ స్ట్రిప్స్, చెవ్రాన్ బోర్డులు, కాంక్రీట్ బ్యారియర్లు, రాత్రి వేళల్లో వెలుతురు కోసం ఏర్పాటు చేసిన వీధి దీపాలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జస్టిస్ సప్రే మాట్లాడుతూ 'ప్రతి జీవితం విలువైనది. నిర్లక్ష్యం కారణంగా అమాయకుల ప్రాణాలు పోకూడదు' అని అన్నారు. అనంతరం నానక్‌రామ్‌గూడలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జిసిఎల్) కార్యాలయాన్ని సందర్శించారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్) పై ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఐటిఎస్), హైవే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (హెచ్‌ఎంఎస్) వంటి ఆధునిక టెక్నాలజీతో ఓఆర్‌ఆర్‌పై రోజుకు 2.5 లక్షలకు పైగా వాహనాల రాకపోకలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ప్రమాదాల నివారణకు పటిష్ట నిఘాతో పాటు, అత్యవసర వైద్య చికిత్స కోసం చేసిన ఏర్పాట్లను కూడా అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండిఏ అర్బన్ ఫారెస్ట్రీ అధికారి వి.ఎస్.ఎన్.వి, జిహెచ్‌ఎంసి చీఫ్ ఇంజనీర్(ప్రాజెక్ట్స్) సానే భాస్కర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ (నిర్వహణ) సహదేవ్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.






## జైళ్లు నిర్బంధ స్థలం కాదు

### కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'జైళ్లు అంటే కేవలం నిర్బంధ స్థలం కాదని, చెదిరిన జీవితాలను పునర్నిర్మించడానికి అవకాశం ఇచ్చే ప్రదేశం అని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. దేశ నిర్మాణంలో జైళ్ళ శాఖ అధికారుల పాత్ర చాలా కీలకమైనది..అయితే వారి పాత్ర బయటికి కనిపించదని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో గురువారం జరిగిన 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్2025 ముగింపు కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిధిగా హాజరై నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ కాలాతీత పదాల నుండి ప్రేరణ పొంది, నేరస్థుడిని కాదు, నేరాన్ని ద్వేషించండి' అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తెలంగాణ హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డిజిపిడాక్టర్ జితేందర్, భారతదేశం అంతటా ఉన్న అనేక మంది సీనియర్ ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 21 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల నుండి 1,200 మందికి పైగా అధికారులు, సిబ్బంది, 140 మందికి పైగా సహాయక సిబ్బంది హాజరయ్యారు.

**తెలంగాణ కు 28 పథకాలు :** అఖిల భారత జైలు డ్యూటీ మీట్ 2025లో తెలంగాణ జైళ్ళ శాఖ సత్తా చాటింది.. తెలంగాణ కు 21 బంగారం, 4 వెండి, 3 రజిత మొత్తం 28 పథకాలు సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.. రెండో స్థానం లో 17 పథకాలతో తమిళనాడు, 6 పథకాలతో మూడో స్థానం మధ్యప్రదేశ్ దాకించుకున్నాయి.

## ఆరుగురు దోషుల మూడేళ్ల

# జైలుశిక్షను నిలిపివేసిన 'సుప్రీం'

**న్యూఢిల్లీ :** హైకోర్టులలో క్రిమినల్ అప్పీళ్ల పెండింగ్ చాలా ఎక్కువగా ఉందని, విచారణలు త్వరలో జరగకపోవడాన్ని గమనించిన సుప్రీంకోర్టు ఆరుగురు దోషులకు విధించిన మూడేళ్ల జైలుశిక్షను నిలిపివేసింది. న్యాయమూర్తులు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ విజయ్ బిష్ణోయ్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో గురువారం ఆరుగురు దోషులు దాఖలు చేసిన అప్పీల్‌ను పరిశీలించింది. కాగా ఈ అంశం పెండింగ్‌లో ఉందని గమనించింది. 'అప్పీల్ చేసుకునే హక్కు చట్టబద్ధమైనది. అప్పీల్‌దారులు కస్టడీలో ఉన్నారు. హైకోర్టులలో క్రిమినల్ అప్పీళ్లు అనేకం పెండింగ్‌లో ఉన్నాయి. అప్పీల్‌దారు దాఖలు చేసిన అప్పీల్ విచారణకు సమయం దొరకడం లేదు' అని ధర్మాసనం సెప్టెంబరు 10న జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొంది. 'శిక్షణను పరిగణనలోనికి తీసుకుంటూ అప్పీల్‌దారులను అప్పీల్ విచారణలకు హాజరుకాకుండానే గడువు ముగిసేలా చేస్తే అది న్యాయానికి విఘాతం అవుతుంది' అని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ అంశంపై హైకోర్టు పరిశీలనలోకి వచ్చేటట్లు కనిపించడం లేదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మేం తీర్పును సస్పెండ్ చేసి అప్పీల్‌దారులను కస్టడీ నుండి విడుదల చేయడానికే మొగ్గు చూపుతున్నాం అని ధర్మాసనం వెల్లడించింది.

## శ్రీ చైతన్య విద్యాసంస్థల ఇన్ఫినిటీ లెర్న్ నుంచి

# 'ఎఐఎన్ఎ' ఆవిష్కరణ

### సిఇఒ, డైరెక్టర్ సుష్మ బొప్పన వెల్లడి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** శ్రీ చైతన్య విద్యాసంస్థలు విద్యారంగంలో వినూత్న ఆవిష్కరణలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు శ్రీకారం చుట్టింది. శ్రీచైతన్య విద్యాసంస్థలలో భాగం అయినటువంటి దేశంలోని అగ్రగామి హైబ్రిడ్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్ ఇన్ఫినిటీ లెర్న్ తన విప్లవాత్మక నూతన ఆవిష్కరణ ( ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నర్చరింగ్ అసిస్టెంట్)ను గురువారం అధికారికంగా విడుదల చేసింది. శ్రీ చైతన్య విద్యాసంస్థల ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సిఈఓ), డైరెక్టర్ సుష్మ బొప్పన ఇక్క డ విలేకరులతో మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నర్చరింగ్ అసిస్టెంట్ అనేది భారతదేశపు మొట్టమొదటి వాయిస్ ఫస్ట్, ఏఐ ఆధారిత మెంటార్ అని తెలియజేశారు. ఏఐఎన్ఏ ద్వారా ప్రతీ విద్యార్థికీ ఒక విశ్వసనీయ మెంటార్ లభిస్తాడని, సమాధానాలు మాత్రమే కాకుండా ఆత్మవిశ్వాసం, ప్రేరణ కూడా అందించబడుతుందని చెప్పారు. విద్యార్థుల అసలైన సామర్థ్యాలను వెలికితీయడమే శ్రీ చైతన్య విద్యాసంస్థల లక్ష్యం అని సుష్మ బొప్పన వివరించారు. ఏఐఎన్ఏ సాధారణ చాట్‌బాట్ కాదని, విద్యార్థులకు తక్షణ సందేహ నివృత్తి, లోతైన కాన్సెప్ట్ క్లారిటీ, టెస్ట్ అనాలిటిక్స్, ప్రోత్సాహక సహకారం, వ్యక్తిగత ప్రణాళికఇవన్నీ ఒకే వేదికలో ఎప్పుడైనా, ఎక్కడైనా అందించే ప్రత్యేక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెంటార్‌గా రూపొందించబడిందని తెలిపారు. ఇన్ఫినిటీ లెర్న్ వ్యవస్థాపక సిఈఓ ఉజ్వల్‌సింగ్ మాట్లాడుతూఏఐఎన్ఏ కేవలం ఒక ఉత్పత్తి కాదన్నారు. ఇది భారతీయ విద్యార్థుల కోసం మేధస్సుతో కూడిన, మానవకేంద్రీకృత మార్గదర్శకత్వంలో కొత్త శకాన్ని ప్రారంభించినందుకు గర్వకారణంగా ఉందన్న ఉజ్వల్‌సింగ్ వెల్లడించారు.గూగుల్ క్లౌడ్, ఐఐటిహైదరాబాద్ సహకారంతో రూపొందిన ఈ టెక్నాలజీ ఇప్పటికే 96.7 శాతం ఖచ్చితత్వంతో సమాధానాలు ఇస్తోందన్నారు. నెలకు 2లక్షలకు పైగా విద్యార్థుల సందేహాలను సగటున 5 సెకన్లలో పరిష్కరిస్తోందని, అదనంగా ఇంగ్లీష్‌తో పాటు 9 భారతీయ భాషల్లో కూడా సహాయం అందిస్తుందని వివరించారు. ప్రస్తుతం ఇన్ఫినిటీ లెర్న్‌కు దేశవ్యాప్తంగా 10,000 స్కూళ్లలో 10లక్షల ప్రీమియం లెర్నర్లు ఉన్నారని, ఏఐఎన్ఏ ఇప్పుడు చెల్లింపు యూజర్లతో పాటు ఉచిత యూజర్లను కూడా అందుబాటులోకి తీసుకు వచ్చిందని తెలిపారు. ఏఐఎన్ఏ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి లింక్ : https//tinyurl.com/ainaprs ఉపకరిస్తుందని వెల్లడించారు.

## హైస్కూల్‌లో విద్యార్థి మృతి


**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** హన్మకొండ నయీంనగర్ లోని తేజస్వి హైస్కూల్లో గురువారం ఉదయం 10వ తరగతి విద్యార్థి జయంత్ వర్ధన్ ఆ కస్మాత్తుగా మరణించాడు. వివరాలలోకి వెళితే నయీం నగర్ లోని మొ దటి బ్రాంచ్ తేజస్వి హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న జయంత్ (15) రోజులాగే గురువారం కూడా స్కూల్ కి వెళ్లాడు. స్కూల్ పరిసర ప్రాంతంలో తోటి విద్యార్థులతో కలిసి గేమ్స్ ఆడుతున్న తరుణంలో విద్యా ర్థి జయంత్ ఆకస్మాత్తుగా కుప్పకూలి మరణించాడు. ఈ సంఘటనపై విద్యార్థి కుటుంబంలో విషాదఛాయలు కమ్ముకున్నాయి. ఈ ఆకస్మిక మరణంతో తోటి విద్యార్థుల, తల్లిదండ్రులు భయాందోళన గురవుతున్నారు. విద్యార్థి అకస్మాత్తుగా ఉదయం 11 గంటల సమయంలో మృతి చెందిన జిల్లా విద్యా శాఖ అధికారులు మాత్రం సాయంత్రం 4 గంటలకు తేజస్వి స్కూల్ కి రావడం పై విద్యార్థి తల్లిదండ్రులు, పలువురు ప్రజా సంఘ నాయకులు విద్యార్థి నాయకులు పలువిధాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి జయంత్ తల్లిదండ్రులను జరిగిన ఘటన పై వివరాలు అడుగగా స్కూల్ స్కూల్ యాజమాన్యం విద్యార్థికి ఫిట్స్ వచ్చి పడిపోయాడు అని నిర్లక్ష్య సమాధానం చెప్పారని ఆవేధంగా వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ సీసీటీవీ ఫుటేజీలో మాత్రం విద్యార్థి స్కూల్ గ్రౌండ్ హాట్ స్ట్రోక్ వచ్చి పడిపోయినట్లు కనబడుతుండగా స్కూల్ యాజమాన్యం మాత్రం ఫిట్స్ వచ్చి పడిపోయాడని అబద్ధం చెబుతున్నారని, స్ట్రోక్ వచ్చి పడిపోయిన సమయంలో వెంటనే పిసిఆర్ చేస్తే తమ బాబు బతికేవాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాగా విద్యార్థులను స్కూల్ గ్రౌండ్ లో కఠినం గా రన్నింగ్ లాంటి వామ్ అప్ చేయడం వల్లనే జయంత్ చనిపోయాడని, తొలుత గుండె పోటు గా గుర్తించి సిపిఆర్ చేస్తే బతికేవాడని, విద్యార్థి మృ తిలో పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యము ఉందని విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు.

## ఆంధ్రాలో ఇంటర్ చదివినా

# లోకల్ కోటాలో సీట్లు ఇవ్వాలి

### సిఎంకు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో 1 నుండి 10 తరగతి వరకు చదివి, ఇంటర్మీడియట్ ఆంధప్రదేశ్‌లో చదివిన విద్యార్థులను తెలంగాణ లోకల్ విద్యార్థులుగా పరిగణిస్తూ, ఎన్‌ఇఇటి (నీట్)2024 అడ్మిషన్‌లో లోకల్‌కోటా కౌన్సిలింగ్‌లో పాల్గొనేలా అర్హత కల్పించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విజ్ఞప్తి చేశారు. గురువారం ఈ మేరకు సిఎంకు ఆయన ఓ లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు జిల్లాలకు చెందిన కొంతమంది విద్యార్థులు 1 నుండి 10వ తరగతి వరకు తెలంగాణ రాష్ట్రంలో చదివి, ఇంటర్మీడియట్ విద్యను ఆంధ్రప్రదేశ్‌లో చదివిన వారికి జిఓ 114 ప్రకారం 7 సంవత్సరాల్లో 4 ఏళ్ళు చదివిన వారికి లోకల్ కోటాలో అవకాశమిచ్చేవారన్నారు. కానీ ఈలాంటి విద్యార్థులను స్థానిక కోటాలో పరిగణించబోమని 2024 జూలై 19న జీవో నెం.33ను ప్రభుత్వం విడుదల చేసిందని, కానీ ఈ విద్యార్థులు మార్చి 2024లోనే ఇంటర్‌మీడియట్ పూర్తిచేసే నాటికి ఈ జీవో, నిబంధనలు రాలేదన్నారు. అయితే ప్రస్తుతం తెచ్చిన జీవో నంబర్ 33 ద్వారా ఈ విద్యార్థులు స్థానికత కోల్పోవడంతో ర్యాంక్ సాధించినా, మెడికల్ సీటు రాని పరిస్థితి ఏర్పడడంతో వీరి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని, దీంతో విద్యార్థులు నిరాశ, నిస్పృహ, మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిశీలించి, ఈ విద్యార్థులను తెలంగాణ లోకల్ విద్యార్థులుగా పరిగణించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డికి జాన్‌వెస్లీ విజ్ఞప్తి చేశారు..



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఓటర్ ఐడి వివాదంలో సోనియాకు ఊరట

**న్యూఢిల్లీ:**కాంగ్రెస్అగ్రనాయకురాలుసోనియాగాంధీకి ఢిల్లీ కోర్టులో ఊరట లభించింది. ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది.కాంగ్రెస్‌మాజీఅధ్యక్షురాలు సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఆ వ్యవహారంలో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలాఆదేశాలు ఇవ్వాలని కోరారు. 1983లో సోనియాకు భారత పౌరసత్వం వచ్చింది. 1980 నాటి ఓటర్ జాబితా అంటూ గత నెల భాజపా నేత అమిత్‌మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. గాంధీ కుటుంబ సభ్యులైన ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు సోనియాపేరును చేర్చారని పేర్కొన్నారు. అప్పటికీ ఆమె ఇంకా ఇటలీ పౌరసత్వం కలిగి ఉన్నారని రాసుకొచ్చారు. అయితే దానిపై విమర్శలు రావడంతో 1982లో ఓటర్ జాబితా నుంచి ఆమె పేరు తొలగించారని, 1983లో మళ్లీ కనిపించిందని వెల్లడించారు. అప్పుడు కూడా పౌరసత్వం రావడానికన్నా ముందే మళ్లీ జాబితాలోకి పేరు వచ్చి చేరిందని విమర్శించారు.



### అసెంబ్లీలు ఆమోదించిన బిల్లుల గడువు విషయంలో రాష్ట్రపతి సూచనపై...

# 'సుప్రీంకోర్టు తీర్పు' రిజర్వ్

**10రోజుల పాటు వాదనలు విన్న సిజెఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం**

**న్యూఢిల్లీ :** రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదం తెలిపేందుకు రాజ్యాంగ న్యాయస్థానం గడువులు విధించవచ్చా అని అడిగిన రాష్ట్రపతి సూచనపై 10రోజులపాటు వాదనలు విన్న సుప్రీంకోర్టు గురువారం తన తీర్పును రిజర్వ్ చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ నేతృత్వంలోని న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, విక్రమ్ నాథ్, పిఎస్.నర్సింహ, ఎఎస్.చందుర్కర్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును రిజర్వ్ చేసింది. అత్యున్నత న్యాయస్థానం రాష్ట్రపతి సూచనపై ఆగస్టు 19న విచారణ ప్రారంభించింది. దేశంలోని అత్యున్నత న్యాయ అధికారి, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి వాదనలు ముగిసిన నేపథ్యంలో రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశంపై తీర్పును రిజర్వ్ చేసింది. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలను ముగించారు. ప్రతిపక్ష పాలిత తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, కర్ణాటక, తెలంగాణ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌ల సమర్పణలను సవాల్ చేస్తూ తన వాదనలను ముగించారు. సీనియర్ న్యాయవాదులు కె.కె.వేణుగోపాల్, కపిల్ సిబల్ కేరళ, తమిళనాడు ప్రభుత్వాల తరపున హాజరై ధర్మాసనం ముందు తమ వాదనలు వినిపిస్తూ రాష్ట్రపతి సూచనను వ్యతిరేకించారు. ఏప్రిల్ 8 తీర్పుతో సహా రాష్ట్రపతి లేవనెత్తిన అంశాలు సుప్రీంకోర్టు తీర్పుల శ్రేణిలో ఉన్నాయని సీనియర్ న్యాయవాదులు కె.కె.వేణుగోపాల్, కపిల్ సిబల్ రాజ్యాంగ ధర్మాసనం ముందు తమ వాదనలు వినిపించారు. రాష్ట్రపతి ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు ఆమోదం తెలిపే గడువులను నిర్ణయించిన సుప్రీంకోర్టు ఏప్రిల్ 8న ఇచ్చిన తీర్పు తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులకు అనుమతి ఇవ్వకుండా ఉండటంపై తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి మరియు ప్రభుత్వం మధ్య జరిగిన సుదీర్ఘ పోరాటంలో ఈ తీర్పు వెలువడింది.రాష్ట్రఅసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై చర్య తీసుకోవడానికి గవర్నర్లు, ఆమెపై నిర్ణీత కాలపరిమితి విధించవచ్చా అనే దానిపై రాష్ట్రపతి స్వయంగా సూచనల ద్వారా అభిప్రాయం కోరితే తప్పేమిటని అత్యున్నత న్యాయస్థానంప్రశ్నించింది.రాష్ట్రపతి ఆమె స్వయంగా సూచన కోరితే సమస్య ఏమిటి ?. మీరు దీనిపై పోటీ చేయడం గురించి నిజంగా సీరియస్‌గా ఉన్నారా?' అని ఈ సూచనపై కీలకమైన విచారణను ప్రారంభిస్తూ ధర్మాసనం అడిగింది. మన ం సలహా న్యాయవ్యవస్థ పరిధిలో ఉన్నామని చాలా స్పష్టం గా ఉంది' అని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ అన్నారు.సుప్రీంకోర్టు అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్, సీనియర్ న్యాయవాదులు కె.కె.వేణుగోపాల్, కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ, అర్వింద్ దాతర్, గోపాల్ సుబ్రమణియన్. మనీందర్ సింగ్, ఎ.కె.కౌల్, ఆనంద్‌శర్మ, పి.విల్సన్, గోపాల్ శంకర్ నారాయణన్‌లను రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద సంక్రమించిన గవర్నర్ల అధికారాలపై 10రోజులపాటు అత్యున్నత న్యాయస్థానం విచారణ జరిపింది. బిజెపి పాలిత రాష్ట్రాలైన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిషా, గోవా, ఛత్తీస్‌గఢ్‌లు గవర్నర్ల క్రియాత్మక స్వయం ప్రతిపత్తిని, రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలపడాన్ని సమర్థించాయి. ఆర్టికల్ 200 రాష్ట్ర శాసనసభ ద్వారా బిల్లు ఆమోదానికి సంబంధించి గర్నర్ అధికారాలను నియంత్రిస్తుంది, బిల్లు ఆమోదానికి వారు అంగీకరించడానికి పున: పరిశీలన కోసం తిరిగి ఇవ్వడానికి లేదా బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు రిజర్వ్ చేయడానికి వీలు కల్పిస్తుంది.

**రాష్ట్రపతి14 ప్రశ్నలపై లోతైన విచారణ తదుపరి 'తీర్పు రిజర్వ్'**

గవర్నర్లకు కాలపరిమితిని విధించడం, రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులపై కోర్టులు చర్యలు తీసుకోవచ్చా అనే దానిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంధించిన 14 ప్రశ్నలపై సుప్రీంకోర్టు విచారణ ఇప్పటి వరకూ కొనసాగింది. కాగాఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం విచారణకు స్వీకరించి 10 రోజుల పాటు వాదనలు పూర్తిగా విన్న అనంతరం గురువారం తన తీర్పును రిజర్వ్ చేసింది.గవర్నర్ల అధికారాలు, విధులు, నిర్ణయాధికారాలపై కేంద్రం మరియు వివిధ రాష్ట్రాల వాదనలను ధర్మాసనం పరిగణనలోనికి తీసుకుంది. రాష్ట్రపతి సూచనపై అటార్నీ జనరల్ వ్యక్తిగత సామర్థ్యంపై వాదనలు విన్న ధర్మాసనం, వ్యక్తిగత కేసులను పరిశీలించడానికి ఇష్టపడటంలేదని, రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవడానికి ఇష్టపడుతున్నామని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఏప్రిల్ 8న ఇచ్చిన తీర్పు రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులపై చర్య తీసుకోవడానికి ఒక కాలపరిమితిని నిర్దేశించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద సమర్పించబడిన ఏదైనాబిల్లుకు సంబంధించి విధులను నిర్వర్తించడంలో పాలక గవర్నర్లకు ఎటువంటి ఆటంకాలు ఉండవు. అయితే మంత్రి మండలి ఇచ్చే సలహాను తప్పనిసరిగా పాటించాలి.

# మోహన్ భాగవత్‌కు మోదీ 'అతినివాళి'

**ఆర్ఎస్ఎస్ చీఫ్‌పై వ్యాసం రాయడంపై కాంగ్రెస్ మండిపాటు**



**న్యూఢిల్లీ :**ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌పై ప్రధాని నరేంద్రమోదీ వ్యాసం రాయడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శించింది. మోహన్ భగవత్ 75వ పుట్టినరోజున ఆయనకు ఇచ్చిన 'అతి నివాళి' అని అభివర్ణించింది. సంఘ్ నాయకత్వంతో అనుకూలంగా ఉండటానికి తీవ్ర ప్రయత్నమేనని పేర్కొంది. భాగవత్ మేధోపరమైన సుదీర్ఘ, సానుభూతిగల నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, 2009 నుండి ఆర్ఎస్ఎస్ అధిపతిగా ఆయన పదవీకాలం ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల ప్రయాణంలో అత్యంత పరివర్తన కాలంగా పరిగణించబడుతుందని ప్రధాని మోదీ అన్నారు. భాగవత్ 75వ పుట్టినరోజు సందర్భంగా గురువారం అనేక వార్తాపత్రికలలో ప్రచురితమైన వ్యాసంలో భాగవత్ 'వసుధైవ కుటుంబకం' సజీవ ఉదాహరణ అని, సామాజిక పరివర్తన, సామరస్యం, సోదరభావం స్ఫూర్తిని బలోపేతం చేయడానికి తన మొత్తం జీవితాన్ని అంకితం చేశారని మోదీ అన్నారు. మోదీ వ్యాసంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ స్పందించారు. ఆర్ఎస్ఎస్ నాయకత్వంతో అనుకూలంగా ఉండటానికి ప్రధానమంత్రి తీవ్రంగా కృషి చేస్తూ, మోహన్ భాగవత్ 75వ పుట్టినరోజున ఆయనకు అతి నివాళి అర్పించారని ఎద్దేవా చేశారు. 'సెప్టెంబర్ 11, 1893న స్వామి వివేకానంద చికాగోలో తన అమర ప్రసంగం చేశారని ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు. అమెరికాలో అల్ ఖైదా ఉగ్రవాద దాడులు సెప్టెంబర్ 11, 2001న జరిగాయని కూడా ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు' అని రమేష్ అన్నారు. ఆశ్చర్యమేమిటంటే మహాత్మా గాంధీ మొదట సెప్టెంబర్ 11, 1906న జోహన్నెస్‌బర్గ్‌లో సత్యాగ్రహానికి పిలుపునివ్వడాన్ని ప్రధాని ప్రస్తావించలేదన్నారు. అప్పుడే ప్రపంచం ఈ విప్లవాత్మక ఆలోచన గురించి మొదటిసారి విన్నదని కాంగ్రెస్ నాయకుడు ఎక్స్‌లో పేర్కొన్నారు. సత్య అనే పదం ఆయనకు పరాయిది కాబట్టి సత్యాగ్రహం మూలాన్ని ప్రధాని గుర్తుంచుకుంటారని ఆశించడం చాలా ఎక్కువ అని రమేష్ అన్నారు. భాగవత్ 75వ పుట్టినరోజు సందర్భంగా ప్రధానిపై ప్రతిపక్ష పార్టీ విమర్శనాత్మక వ్యాఖ్యలు చేసింది. లోక్‌సభలో కాంగ్రెస్ విప్ మాణికం ఠాగూర్ కూడా ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు.



# మణిపూర్‌కు మోదీ... కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**ఇంఫాల్ :** ప్రధాని నరేంద్ర మోదీ శనివారం కల్లోలిత మణిపూర్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఇంఫాల్, చురచందాపూర్ జిల్లా హెడ్‌క్వార్టర్స్ పట్టణంలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. ఇంఫాల్‌లోని దాదాపు 237 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాంగ్లా కోట, చురచంద్‌పూర్‌లోని పీస్ గ్రౌండ్‌లో, చుట్టుపక్కల రాష్ట్ర, కేంద్ర దళాల సిబ్బందిని పెద్ద సంఖ్యలో మోహరించారు. ప్రధాని కార్యక్రమం కోసం భారీ వేదికను నిర్మిస్తున్నారు. మోదీ మిజోరం నుండి మణిపూర్‌కు వచ్చే అవకాశం ఉంది. కానీ న్యూఢిల్లీ లేదా ఇంఫాల్ నుండి దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలవడలేదు. ఈ పర్యటన దృష్ట్యా రాష్ట్రంలో అనేక సన్నాహక సమావేశాలు జరిగాయి. మే 2023లో కుకిస్, మెయితీల మధ్య జాతి హింస చెలరేగిన తర్వాత మోదీ మణిపూర్ పర్యటించనుండడం ఇదే తొలిసారి. హింస ఫలితంగా 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. మోదీ రాక నేపథ్యంలో కాంగ్లా కోటకు దారితీసే సంజెంతోంగ్, మినుతోంగ్, మోయిరాంగ్ఖోమ్ ప్రాంతాలలో గాలింపు, తనిఖీలను ముమ్మరం చేశారు. రాష్ట్ర సిబ్బందితో కలిసి కేంద్ర భద్రతా బృందాలు కాంగ్లా కోటను 24 గంటలూ తనిఖీ చేస్తున్నాయి. కోట చుట్టూ ఉన్న కందకాలలో గస్తీ కోసం రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం పడవలను నియమించారు. 1891లో రాచరిక రాజ్యం విలీనం కావడానికి ముందు కాంగ్లా కోట అప్పటిమణిపురిపాలకులకుపురాతన అధికార కేంద్రంగా పనిచేసింది. మూడు వైపులా కందకాలు, తూర్పు వైపున ఇంఫాల్ నదితో చుట్టుముట్టబడిన ఈ కోట, ఒక పెద్ద పోలో మైదానం,ఒక చిన్నఅడవి, దేవాలయాల శిథిలాలు, రాష్ట్ర పురావస్తు కార్యాలయాలను కలిగి ఉంది. ఏవైనా అవాంఛిత వస్తువులను గుర్తించడానికి స్నిఫర్ డాగ్‌లు, అధునాతన సాధనాలను ఉపయోగిస్తున్నారు. ఏవైనా అవాంఛిత సంకేతాల కోసం స్కాన్ చేయడానికి భద్రతా సిబ్బంది కోట అంచు, ప్రాంగణంలో కాలినడకన గస్తీ తిరుగుతున్నారు. కోటలోకి ప్రవేశించే వారందరినీ నమోదు చేసి తనిఖీ చేస్తున్నారు. కోటలోకి పర్యాటకుల ప్రవేశాన్ని పరిమితం చేశారు. భారీ హెచ్చరికలు జారీ చేశామని, ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో కసరత్తు జరుగుతున్నట్లు మరొక అధికారి తెలిపారు. పరిస్థితిని పర్యవేక్షించడానికి భద్రతా అధికారుల రోజువారీ సమావేశాలు కూడా జరుగుతున్నాయని అధికారి తెలిపారు. కాగా, కేంద్రభద్రతా అధికారుల ముందస్తు బృందం కూడా చురాచంద్‌పూర్‌లో దిగింది. ప్రధాని బహిరంగ సభలో ప్రసంగించనున్న పీస్ గ్రౌండ్‌కు వెళ్లే మార్గంలో పోలీసులు, పారామిలిటరీదళాలను మోహరించారు. వెదురు బారికేడ్లు నిర్మించారు. రాష్ట్రంలోని ఇత ర చోట్ల, భద్రతా దళాలుశోధనకార్యకలాపాలను,ప్రాంతఆధిపత్యాన్ని కూడాముమ్మరంచేశాయి.రాష్ట్రదళాలు,సిఆర్‌పిఎఫ్ కొండలు, లోయ జిల్లాల్లో సామాజిక వ్యతిరేక శక్తుల కదలికలను తనిఖీ చేయడానికి తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి.

## ఆ మూడు రోజులు గార్డుల మార్పు రద్దు

**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి భవన్ ముందు ప్రాంగణంలో ఈనెల 13, 20, 27 తేదీల్లో గార్డుల మార్పు కార్యక్రమం ఉండదని రాష్ట్రపతి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రపతి బాడీగార్డుల కొత్త బృందం బాధ్యతలు స్వీకరించడానికి వీలుగా ప్రతి వారం సైనిక సంప్రదాయంగా గార్డుల మార్పు కార్యక్రమం నిర్వహిస్తారు. 1773లో స్థాపించిన ప్రెసిడెంట్స్ బాడీగార్డ్ (పిబిజి) భారత సైన్యంలో అత్యంత సీనియర్ రెజిమెంట్. ఇది భారత రాష్ట్రపతికి ఉత్సవ విధులను నిర్వర్తించే రెజిమెంట్. పిబిజి సిబ్బందిలో అద్భుతమైన గుర్రపు సైనికులు, సమర్థవంతమైన ట్యాంక్ మెన్, పారాట్రూపర్లు ఉన్నారు. అయితే సెరిమోనియల్ బెటాలియన్ వజ్రోత్సవ సిల్వర్ ట్రంపెట్, ట్రంపెట్ బ్యానర్‌ను రాష్ట్రపతి బాడీగార్డుకు అందించడానికి రిహార్సల్స్‌లో నిమగ్నమై ఉంటున్నందున రాష్ట్రపతి భవన్ ముందు ప్రాంగణంలో ఈనెల 13, 20, 27 తేదీల్లో గార్డుల మార్పు కార్యక్రమం నిర్వహించబడదని రాష్ట్రపతి కార్యాలయం ప్రకటనలో తెలిపింది. 'ప్రెసిడెంట్స్ సిల్వర్ ట్రంపెట్ అండ్ ట్రంపెట్ బ్యానర్'ను మోసుకెళ్లే ఏకైక రెజిమెంట్‌గా ప్రెసిడెంట్స్ బాడీగార్డ్ ప్రత్యేకతను కలిగి ఉంది. ప్రెసిడెంట్స్ సిల్వర్ ట్రంపెట్ అండ్ ట్రంపెట్ బ్యానర్‌ను మొదటిసారిగా 1953లో భారతదేశ మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ 'బాడీగార్డ్స్'కు ప్రదానం చేశారు.

## బిహార్‌లో ఆర్‌జెడి నేత దారుణహత్య

**పాట్నా :** బిహార్‌లో ఓ రాజకీయ నేత దారుణ హత్యకు గురయ్యాడు. ఆర్‌జెడికి చెందిన రాజ్‌కుమార్ రాయ్ అలియాస్ అల్లా రాయ్‌ని గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఈ హత్య రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఎస్‌పి పరిచయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రగుప్త నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని మున్నా చక్ ప్రాంతంలో ఈ హత్య జరిగింది. బుధవారం రాత్రి బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు రాయ్‌పై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దాడిలో రాయ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. రాయ్‌ని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. హత్య జరిగిన ప్రదేశంలో ఆరు బుల్లెట్ షెల్స్ లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.భూ వివాదమే హత్యకు కారణమని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.త్వరలోజరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పాట్నాలోని రాఘోపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు రాజ్‌కుమార్ రాయ్ సిద్ధమయ్యారు.

## మరింత పారదర్శకంగా, సరళంగా 'ఎస్ఐఆర్'

**ఆర్‌జెడి ప్రతినిధులతో భేటీలో ఇసి**

**న్యూదిల్లీ:** రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ) నాయకుల బృందం గురువారం కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఫుల్ బెంచ్‌తో భేటీ అయింది. బీహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌పై చర్చించింది. అనంతరం ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ ఝా విలేకరులతో మాట్లాడుతూ 'ఎస్ఐఆర్‌పై సమగ్రంగా చర్చించాం. ఈ ప్రక్రియను సరళీకరిస్తామని, మరింత పారదర్శకంగా నిర్వహిస్తామని ఎన్నికల సంఘం హామీనిచ్చింది. ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని అంశాలు, ఓటర్ల పేర్లు తొలగించడం, అభ్యంతరాలు, పోస్టల్ బ్యాలెట్ తదితరాలపై రెండు గంటలకుపైగా చర్చ జరిగింది. అన్ని అంశాల్లోనూ ఎన్నికల సంఘం సానుకూలంగా ముందుకు వెళుతుందని నమ్ముతున్నాం' అని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఈసీలు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషితో జరిగిన చర్చల్లో ఆర్‌జేడీ నాయకులు సుధాకర్ సింగ్, చితరంజన్ గగన్ పాల్గొన్నారు. ఈ సమావేశం తర్వాత ఎన్నికల సంఘం ఒక ప్రకటన చేసింది. వివిధ జాతీయ, ప్రాంతీయ పార్టీలతో నిర్వహిస్తున్న సంప్రదింపుల్లో భాగంగానే తాజా భేటీ జరిగిందని తెలిపింది. గత ఆరు నెలల్లో 4,719 అఖిలపక్ష సమావేశాలు నిర్వహించినట్లు వెల్లడించింది. అందులో 40 సీఈఓలతో సమావేశాలు కాగా 800 డీఈఓలతో, 3,879 ఈఆర్ఓలతో భేటీలని పేర్కొంది. ఇప్పటివరకు 28వేల మందికిపైగా నాయకులతో సంప్రదింపులు జరిపినట్లు ఈసీ తెలిపింది.

### సానుకూల వాతావరణంలో

# పురోగమిస్తున్న భారత్—అమెరికా వాణిజ్య చర్చలు



**కేంద్రమంత్రి పీయూశ్ గోయల్ ప్రకటన**

పాట్నా: భారత్—అమెరికా మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై సంప్రదింపులు సానుకూల వాతావరణం మధ్య పురోగతి సాధిస్తున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాకామంత్రి పీయూశ్ గోయల్ గురువారం పాట్నాలో పాత్రికేయులకు చెప్పారు. రెండు దేశాల మధ్యా ఈ ఏడాది మార్చినెలలో చర్చలు ప్రారంభమయ్యాయి. రెండు దేశాలూ ఈ ప్రతిపాదిత ఒప్పందంపై జరుగుతున్న సంప్రదింపుల పురోగతిపట్ల సంతృప్తి వ్యక్తం చేశాయని చెప్పారు. ఈ ఏడాది నవంబరు ముగిసేనాటికి ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై మొదటిదశ చర్చలు ముగించాలని గడచిన ఫిబ్రవరినెలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌వారి వారి వాణిజ్యశాఖామంత్రులకు ఆదేశించిన విషయాన్ని గోయల్ గుర్తుచేశారు. ఈ ఆదేశాల ప్రకారం గత మార్చినెల నుండీ చర్చలు సానుకూలమార్గంలో పురోగమిస్తున్నాయని చెప్పారు. రెండు దేశాల మధ్యా చర్చలు క్రియాశీలంగా కొనసాగుతున్నాయని గడచిన బుధవారం కూడా గోయల్ చెప్పారు. భారత్—అమెరికా దేశాలమధ్య వాణిజ్య సంప్రదింపుల్లో సమస్యలను, ఆటంకాలను తొలగించుకోవడం పెద్ద కష్టమైన పనేమీ కాదని ట్రంప్ బుధవారంనాడు తన సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన తర్వాత ఈ సమస్య ఒక కొలిక్కి వచ్చినట్లయింది. రెండు దేశాలు చాలా విజయవంతంగా ఈ చర్చలను ముగించగలవని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేయడంతో మోదీ కూడా ఎక్స్ వేదికగా స్పందిస్తూ, రెండు దేశాలు ఒప్పందాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేసేంకు కలిసి కృషి చేస్తున్నాయన్నారు. ట్రంప్ తన సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, మోదీని ''ప్రియమైన నేస్తం''గా అభివర్ణించారు. రాబోయేవారాల్లో భారత ప్రధానమంత్రిని కలుసుకుని మాట్లాడేందుకు తానెంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నానని కూడా ట్రంప్ తన పోస్టింగ్‌లో రాశారు. ''భారత్—అమెరికా రెండు దేశాలు వాణిజ్య సంప్రతింపులను కొనసాగిస్తున్నాయని ప్రకటించడానికి నేనెంతో సంతోషిస్తున్నాను'' అని ట్రూత్ సోషల్ ద్వారా ట్రంప్ తెలియజేయడంతో కొంతమేరకు సానుకూల వాతావరణం నెలకున్నట్లయింది. రెండు దేశాల ప్రభుత్వాలూ మార్చి నెల నుండి ఇప్పటివరకూ ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఐదు విడతల సంప్రదింపులు పూర్తిచేశాయి. ఆరో విడత చర్చలు జరిపేందుకు గతనెలలో భారత్‌కు వచ్చిన అమెరికా వాణిజ్యమంత్రిత్వశాఖ ప్రతినిధుల బృందం తన పర్యటనను వాయిదా వేసుకుంది. రష్యా నుండి భారతదేశం ముడి చమురు కొనుగోలు చేస్తూ ఉక్రేన్‌లో యుద్ధం కొనసాగించడానికి పరోక్షంగా ఆజ్యం పోస్తోందని ట్రంప్ ఆరోపించారు. రష్యాతో వాణిజ్యం ఆపకుండా కొనసాగిస్తున్నందుకుగాను భారత్‌పై 25 శాతం పెనాల్టీ సుంకాలు విధించారు. దీంతో అమెరికా ప్రతినిధులబృందం పర్యటన వాయిదా పడింది. భారత్—అమెరికా మధ్య ప్రస్తుతం ఉన్న 500 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని రెట్టింపు చేసి 2030 నాటికి 191 బిలియన్ డాలర్లకు తీసుకువెళ్ళాలన్న బృహత్ సంకల్పంతో ప్రతిపాదిత ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయి. కానీ భారత్‌పై అతిభారీగా 50 శాతం మేరకు సుంకాలు ట్రంప్ విధించడంతో రెండు దేశాలమధ్యా వాణిజ్య సంబంధాలు ఇటీవల తీవ్ర ఒత్తిళ్ళకు గురయ్యాయి. ఇక ఆరో దశ ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు కొనసాగించడానికి మరో కొత్త తేదీని నిర్ణయించాల్సి ఉంది.

# హరితవిప్లవ పితామహుడు నార్మన్ బోర్లాగ్


**నేడు నార్మన్ బోర్లాగ్ వర్ధంతి**



ప్రపంచ వ్యాప్తంగా వందలాది కోట్ల మందిని ఆకలి బాధలనుండి, పస్తుల నుండి రక్షించిన గొప్ప శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడు, నోబెల్ బహుమతి గ్రహీత నార్మన్ ఎర్నెస్ట్ బోర్లాగ్. బోర్లాగ్ 1914, మార్చి 25న అమెరికా లోనిఅయోవాలోఒక వ్యవసాయ కుటుంబములో జన్మించాడు. బోర్లాగ్ నార్వే దేశము నుండి 1854 లో అమెరికాకు వలస వెళ్ళిన కుటుంబములో మూడవ తరము వాడు.తండ్రి హెన్రీ ఆలివర్ బోర్లాగ్. తల్లి క్లారా.106 ఎకరముల పొలముపై ఏడేళ్ళ నుంచి పందొమ్మిదేళ్ళ వయసు వరకూ పొలం పని, చేపలు పట్టడం, వేటాడ్డం,కోళ్ళు,పశువులతో కాలక్షేపం,ఆటపాటలతో గడిపాడు.తాత ప్రోత్సాహము వల్ల మిన్నిసోటా విశ్వవిద్యాలయంలో చేరి అటవీశాస్త్రంలో పట్టాపొంది ఉద్యోగంలో చేరినాడు. తిరిగి అదే విశ్వవిద్యాలయం నుంచి ప్లాంట్ పాథాలజీ, జన్యు శాస్త్రంలో పీహెచ్‌డీ చేశాడు.పరిశోధనల్లో ఆయన దృష్టి గోధుమ పంట మీద పడడం ప్రపంచానికి గొప్ప మేలు చేసింది. చీడపీడలను తట్టుకుంటూ అధిక దిగుబడినిచ్చే పొట్టిరకం గోధుమ వంగడాలను కనిపెట్టడం ద్వారా సంచలనం సృష్టించాడు.1960 ప్రాంతంలో కరువుకాటకాలతో అల్లాడుతున్న ఇండియా, పాకిస్థాన్ దేశాల్లో ఆ వంగడాలను పరిచయం చేశాడు. 1963లో ఆయన ఇండియా కూడా సందర్శించాడు.20వశతాబ్ది ద్వితీయార్థంలో ప్రపంచాన్ని తీవ్ర కరవునుంచి బయటపడేసి వంద కోట్ల మంది ప్రాణాలను కాపాడేందుకు ఆయన ఆవిష్కరణలు తోడ్పడ్డాయి. ఆయన ఆవిష్కరణల వల్ల 1960, 1990మధ్య కాలంలో వ్యవసాయ దిగుబడులురెండింతలకు మిం చి జరిగాయి. అది హరిత విప్లవంగా మారింది. ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల్లో సైతం కోట్లాదిమంది రైతులు లబ్ధి పొందారు. ప్రస్తుతం ప్రపంచం మొత్తం మీద 18.7 కోట్ల ఎకరాల్లో బోర్లాగ్ కనిపెట్టిన గోధుమ వంగడాలను వాడుతున్నారు. బోర్లాగ్‌పై 2006లో 'ది మ్యాన్ హూ ఫెడ్ ద వరల్డ్ అనే పుస్తకం వచ్చింది.డాక్టర్ బోర్లాగ్ ఎల్లప్పుడూ తనను తాను ఒక ఉపాధ్యాయుడిగానే కాకుండా శాస్త్రవేత్తగా కూడా భావించుకునేవాడు. నేడు 50 కి పైగా దేశాల నుండి అనేక వేల మంది పురుష మరియుమహిళావ్యవసాయ శాస్త్రవేత్తలు తాము నార్మన్‌బోర్లాగ్ 'విద్యార్థులు'అని గర్వంగా చెప్పుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా చిన్నకారు వ్యవసాయ అభివృద్ధిని ప్రోత్సహించడానికి బోర్లాగ్ తన కీర్తి, ప్రభావాన్ని ఉపయోగించాడు. 63 సంవత్సరాల కెరీర్‌లో, అతను 100 కి పైగా దేశాలకుఅవిశ్రాంతంగా ప్రయాణించాడు, రైతులను మరియు వ్యవసాయ శాస్త్రవేత్తలను వారి రంగాలలో సందర్శించాడు. తన జీవితకాలంలో అతను ఎందరో విద్యార్థులు మరియు సాధారణ పౌరులతో వ్యక్తిగతంగా మాట్లాడి, ప్రపంచ ఆహార ఉత్పత్తి యొక్క సవాళ్లు మరియు సంక్లిష్టతలను వివరించాడు. ఆహార పంటల కొరతను తీర్చినందుకు1970లో బోర్లాగ్‌కు నోబెల్ శాంతి బహుమతి లభించింది. బోర్లాగ్ 2009, సెప్టెంబరు 12న తన 95వ ఏట మరణించాడు.

# నేడు ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం

**గవర్నర్ పదవి నుంచి వైదొలగిన బిజెపి నేత**



**న్యూఢిల్లీ :** ఉపరాష్ట్రపతిగా సి.పి. రాధాకృష్ణన్ నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాధాకృష్ణన్‌తో ప్రమాణం చేయించనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రపతి భవన్‌లో ఉదయం 10 గంటలకు జరగనున్న కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ రాధాకృష్ణన్ తదుపరి ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేస్తారని వారు తెలిపారు. 67 ఏళ్ల రాధాకృష్ణన్ మంగళవారం జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఉమ్మడి ప్రతిపక్ష అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డిని 152 ఓట్ల తేడాతో ఓడించి విజయం సాధించారు. జులై 21న అప్పటి ఉపాధ్యక్షుడు జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మికంగా రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. కాగా, మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి సి.పి.రాధాకృష్ణన్ వైదొలిగారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల నూతన ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన నేపథ్యంలో.. గవర్నర్ పదవికి ఆయన రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అదనపు బాధ్యతలు అప్పగించారు. మహారాష్ట్ర రాజ్‌భవన్‌లో బుధవారం సి.పి.రాధాకృష్ణన్‌కు సత్కారం నిర్వహించారు. ఆయన ప్రసంగిస్తూ.. తాను రాజీపడని జాతీయవాదినని చెప్పారు. గవర్నర్‌గా ఇక్కడ కొనసాగిన 13 నెలలు.. ప్రజాజీవితంలో సంతోషకరమైన సమయమని, పరిపాలన పరంగా, రాజకీయంగా నాకెంతో నేర్పిన రాష్ట్రమిది అని పేర్కొన్నారు. జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాతో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలోనే ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో ఎన్‌డిఎ అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. విపక్ష ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి బుధవారం నూతన ఉపరాష్ట్రపతిని కలిసి అభినందించారు.

## రాహుల్‌గాంధీ భద్రతా ప్రోటోకాల్ పాటించడం లేదు

**న్యూఢిల్లీ :** విదేశీ పర్యటనల సందర్భంగా భద్రతా ప్రోటోకాల్స్ ను ఉల్లంఘించారని ఆరోపిస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, ఎంపి రాహుల్ గాంధీకి సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ లేఖ రాసింది. అలాగే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకూ సిఆర్‌పిఎఫ్ లేఖ రాసింది. లేఖలో రాహుల్ గాంధీ తన భద్రతను సీరియస్‌గా తీసుకోవడం లేదని సిఆర్‌పిఎఫ్ వివిఐపి సెక్యూరిటీ చీఫ్ సునీల్ జూన్ ఆరోపించారు. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా విదేశాలకు ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల రాహుల్ గాంధీ చేసిన విదేశీ పర్యటనల గురించీ సునీల్ జూన్ లేఖలో ప్రస్తావించారు. ఇటలీ (డిసెంబర్ 30 నుంచి జనవరి 9 వరకు), వియత్నాం (మార్చి 12నుంచి17వరకు),దుబాయ్(ఏప్రిల్17నుంచి 23 వరకు), ఖతార్ (జూన్ 11 నుంచి 18 వరకు), లండన్ (జూన్ 25 నుంచి జులై 6 వరకు), మలేషియా (సెప్టెంబర్ 4 నుంచి 8 వరకు)వంటి దేశాల్లో ప్రోటోకాల్‌కు విరుద్ధంగా ఆయన పర్యటించారని పేర్కొన్నారు. సిఆర్‌పిఎఫ్ బుక్కులోని ప్రోటోకాల్స్‌ను రాహుల్ ఉల్లంఘిస్తున్నారని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం రాహుల్ గాంధీకి అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ (ఎఎస్ఎల్)తో జెడ్+ కేటగిరీ భద్రతను కల్పిస్తున్నట్లు సిఆర్‌పిఎఫ్ అధికారి తెలిపారు. జెడ్+ ఎఎస్ఎల్ అనేది ఎక్కువ ప్రమాదం పొంచి ఉన్న వ్యక్తులకు అందించే అత్యున్నత స్థాయి రక్షణల్లో ఒకటిగా పేర్కొన్నారు. నేషనల్ సెక్యూరిటీ గార్డ్ కమాండోలతో సహాదాదాపు 55 మంది భద్రతా సిబ్బందిని రాహుల్ గాంధీ కలిగి ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎఎస్ఎల్ కింద భద్రతా సిబ్బంది, స్థానిక పోలీసులు, నిఘా అధికారుల సమన్వయంతో వీఐపీలు సందర్శించే ప్రదేశాల్లో ముందస్తు నిఘా నిర్వహిస్తారని వెల్లడించారు.

# నేపాలీలకు ప్రజాస్వామ్యమే రక్ష

సోషల్ మీడియాపై నిషేధం విధింపునకు నిరసనగా రాజధాని ఖత్మండూలో రోడ్డెక్కిన నేపాల్ జెన్ జెడ్ (1997 నుంచి 2012 మధ్య జన్మించిన తరం) యువతపై పోలీసుల కాల్పుల్లో 19 మంది అకాల మరణంతో ఆ దేశం ఒక్కసారిగా భగ్గుమంది. యువతరం ఆగ్రహజ్వాలలకు పార్లమెంటు, సుప్రీం కోర్టు భవనాలు, పత్రికా కార్యాలయాలు, ప్రభుత్వాధినేతల అధికార నివాసాలు ఆహుతయ్యాయి. ప్రధానమంత్రి కె.పి.ఓలీ రాజీనామా చేసినా శాంతించక మంత్రులు, మాజీ ప్రధానులు, ఎంపిల ఇళ్ళపై బడి ప్రత్యక్ష దాడులకు పాల్పడడం ఆందోళన అరాచక శక్తుల చేతిలోకి వెళ్లినట్లు విదితం చేసింది. కేంద్ర మంత్రులను రోడ్లపై చితక్కొట్టడం, మాజీ ప్రధాని జాలానాథ్ ఖనాల్ సతీమణి రాజ్యలక్ష్మి చిత్రకార్ దాడులలో ప్రాణాలు కోల్పోవడంతో పరిస్థితులు చేయి దాటాయి. భీతిల్లిన పాలకపక్ష నాయక గణం హెలికాప్టర్‌లలో సైనిక స్థావరాలకు పారిపోయిన దృశ్యాలు రాజధాని ఖత్మంటూ గగన తలంలో మంగళవారం కనిపించాయి. నేపాల్ దేశాధ్యక్షుడు రామచంద్ర పౌదెల్ సైన్యం హింసను నిలిపివేయాలని, ప్రభుత్వం చర్చలకు సిద్ధమని చేసిన విజ్ఞప్తితో యువత కాస్త చల్లబడింది.

యువత ఆగ్రహానికి భావప్రకటనా స్వేచ్ఛను కాలరాస్తూ సోషల్ మీడియాపై నిషేధం ప్రకటించడమే కారణమా? అది ఒక కారణం తప్ప అదే కారణం కాదు. అది గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పెద్దల అవినీతి, అక్రమాలు, అక్రమ సంపాదనపై కడుపు మండిన యువత తిరుగుబాటు. నిరుద్యోగం, ఎదుగుబొదుగు లేకపోవడం, చదువులు చదివినా ఉద్యోగాలు రాకపోవడంతో నేపాల్ యువతలో తీవ్ర అసహనం పెరిగింది. మరో వైపు రాచరికాన్ని కూలదోసి 2005లో ప్రజాస్వామ్య వ్యవస్థలోకి వచ్చిన తరువాత కూడా తమ జీవితాలలో ఎదుగుబొదుగు లేదని సగటు నేపాలీలు భావిస్తున్నారు. ఈ రెండు దశాబ్దాలలో ప్రభుత్వం, ప్రధాన మంత్రి పదవి మ్యూజికల్ చెయిర్ లాగా కె.పి.ఓలి, షేర్ బహదూర్ దేవ్‌బా, ప్రచండల మధ్యే మారుతుండడం, కొత్త వారిని రాకుండా వారే పరస్పరం రాజీపడుతూ పదవులు ఉండేలా జాగ్రత్తపడుతున్నారు. వరుస ప్రభుత్వాలు, ప్రధానమంత్రులు, మంత్రుల సంపద అమాంతం పెరిగి, వారి సంతానం భోగలాలసలో మునిగిపోవడంతో నేపాలీ యువతలో ఆగ్రహం గూడుకట్టుకున్నది. దీనినే సామాజిక మాధ్యమాలలో అభివ్యక్తీకరించారు. నెపోకిడ్స్ హ్యాష్‌ట్యాగ్‌తో నేపాల్ ప్రధానులు, వారి సతీమణులు, పిల్లల ఖరీదైన దుస్తులు, వాచ్‌లు, బడా హోటల్‌లలో పార్టీలు, ఆస్తుల ఫోటోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ఓలి ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేయించుకోవాలని ఆదేశించింది. దీనిని పాటించని వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ సహా 29 యాప్‌లను నేపాల్ ప్రభుత్వం నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. ఇది యువతలో గూడుకట్టుకున్న ఆగ్రహం బద్ధలయ్యేందుకు ట్రిగ్గర్ పాయింట్‌గా మారింది.

ప్రజాపక్షం

12-09-2025, శుక్రవారం

అయితే, పాలకుల అవినీతి, అక్రమాలు, అధికార లాలసపై వ్యతిరేకత ఏకంగా రాజకీయ, ప్రజాస్వామ్య వ్యవస్థలపైనే అపనమ్మకాన్ని కలగచేయడం ఆందోళన కలిగించే అంశం. ఎంతో కష్టపడి రాచరిక వ్యవస్థపై పోరాడి, కూలదోసి ప్రజాస్వామ్యం తెచ్చుకొని, లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని రూపొందించుకున్న నేపాలీల విశ్వాసం వమ్ముకావడం దురదృష్టకరం. కమ్యూనిస్టులలో చీలికలు కూడా సంక్షోభానికి ఇందుకు ఒక కారణం అని చెప్పవచ్చు. పలు మార్లు కమ్యూనిస్టులకు అనుకూలంగా ప్రజలు తీర్పునిచ్చినప్పటికీ, సద్వినియోగం చేసుకోకుండా సంకుచిత ఎజెండాతో అధికారం కోసం రాజీపడడం ప్రజలకు నచ్చలేదని విశ్లేషణలు వస్తున్నాయి.

యువత ఆక్రోశం న్యాయమైనదే. అయితే, వారు ఎంచుకున్న హింసా మార్గం, వ్యవస్థల విధ్వంస నినాదం అపరిపక్వతను చాటుతున్నాయి. ఇది మితవాద శక్తులకు గ్రాసంగా మారి పూర్వపు రోజులకు నెట్టేసే ప్రమాదం ఉన్నది. రెండు రోజుల క్రితం రణరంగంగా మారిన ఖత్మండూ వీధులను గురువారం యువత శుభ్రం చేయడానికి పూనుకోవడం, ప్రభుత్వంతో చర్చలకు సంసిద్ధమవడం సుపరిణామం. తమ ఆగ్రహావేదనలను నిర్మాణాత్మక రూపంలోకి మార్చుకొని, ప్రజాస్వామ్య పరిధిలోనే ప్రత్యామ్నాయ పరిష్కారాలు వెతకడంపైనే నేపాల్ భవిష్యత్తు ఆధారపడి ఉంది. నేపాల్‌లో అస్థిర పరిస్థితుల వెనుక సామ్రాజ్యవాద దేశాల హస్తాన్ని కొట్టిపారేయలేమనే విశ్లేషణలు వస్తున్నాయి. ఇప్పటికే పొరుగుదేశం బంగ్లాదేశ్‌తో ఉద్రిక్తత దౌత్య సంబంధాలను ఎదుర్కొంటున్న భారతదేశానికి నేపాల్ తాజా సంక్షోభం కూడా ఆందోళన కలిగించేదే. అక్కడ జరుగుతున్న పరిణామాలపై మన పౌరులు ఇష్టానుసారం సోషల్ మీడియాలో చేస్తున్న వ్యాఖ్యలు సంబంధాలను మసకబార్చే అవకాశం లేకపోలేదు. సున్నితమైన అంశాలపై సంయమనం పాటించడం ఉభయకుశలోపరి.

దక్షిణాసియా దేశాలలో స్థాపిత ఆశ్రిత పక్షపాత రాజకీయ వ్యవస్థపై యువత ఆగ్రహావేశాలు చూసిన మూడవ దేశం నేపాల్. అంతకు ముందు శ్రీలంక, బంగ్లాదేశ్‌లో ఇలాంటి సంఘటనలే కనిపించాయి. శ్రీలంకలో అతివాద పార్టీగా పుట్టిన జనతా విముక్త పెరుమాను (జెవిపి) పార్టీ అధినేత అనురకుమార దిస్సానాయకే ప్రజాస్వామ్య బాటలో బాలెట్ ద్వారా పాతుకుపోయిన పార్టీలను పెకలించి రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. ఆ దేశానికి నూతన దిశను చూపేందుకు శతథా ప్రయత్నిస్తున్నారు. మరోదేశం బంగ్లాదేశ్ మితవాద శక్తుల చేతుల్లో విలవిలలాడుతున్నది. పదే పదే ఎన్నికలను వాయిదా వేసుకుంటూ పోతూ అగమ్యగోచరిగా మారింది. ఈ రెండింట్లో సరైన మార్గం ఎంచుకోవడంలో నేపాల్ పౌరులు విజ్ఞత ప్రదర్శించాలి. బర్మాలో సైనిక పాలన. పాకిస్థాన్‌లో సైనిక పెత్తనం. దక్షిణాసియా తీవ్రమైన రాజకీయ సంక్షోభంలో ఉన్నట్లు ఈ పరిస్థితులు సూచిస్తున్నాయి. అతి పెద్ద దేశమైన భారత్ ఈ దేశాలపై ప్రభావం చూపగల స్థితిలో లేకపోవటం విచారకరం.

సాయుధ పోరాట

# చరిత్రను వక్రీకరిస్తే సూర్యుడిపై ఉమ్మి వేసినట్లే

## బిజెపి పాలకులారా 'చరిత్ర క్షమించదు' ఖబడ్దార్...



చాడ వెంకట్ రెడ్డి
సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

తెలంగాణలో నిజాం పరిపాలన పూర్తిగా రాచరిక పద్ధతిలో జరిగేది. ఆ రోజుల్లో తెలంగాణ సంస్థానం అంటే 8 జిల్లాలు తెలంగాణ, ఐదు జిల్లాలు మహారాష్ట్ర, మూడు జిల్లాలు కర్ణాటక కలుపుకొని మొత్తం 16 జిల్లాలుగా ఉండేది. నిజాంకు ప్రత్యేక సిక్కా ఉండేది. సిక్కా అంటే ప్రత్యేకమైన నాణాలు, చట్టాలు లాంటివి. పోలీసులు, న్యాయవ్యవస్థ తదితర విభాగాలు నిజాం ప్రభువు ఏర్పరచుకున్నాడు. దేశవ్యాప్తంగా బ్రిటిష్ పరిపాలన సాగుతున్నా 550 సంస్థానాలలో పరిపాలన చిన్న చిన్న రాజులు, సామంతుల ఆధీనంలో ఉండేది. సంస్థానాధీసులు వారివారి ప్రాంతాలను స్వతంత్రంగా పాలించుకున్నారు. నిజాం రాచరిక పాలనలో గ్రామాలలో సామాజిక అణిచివేతలు బాగా ఉండేవి. ఎస్సీలను ఊరి బయట అంటరాని వారిగా ఉంచేవారు. బిసిలని వారికి సంబంధించిన కులవృత్తి పనులను తమ ఇంట్లో వెట్టి చాకిరి చేయించుకునేవారు. బాంచన్ జమీందార్లు జాగీర్దారులు క్రూరంగా ప్రజలను చిత్రహింసలకు గురిచేసేవారు. ఎవరిని పిలిచినా అయ్యా కాల్మొక్త బాంచన్ దొర అని పిలిచే రోజులవి. ప్రజలను అణచివేయడమే దొరల లక్ష్యంగా ఉండేది.

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కావాలి అని మార్క్సిజం, లెనినిజం పునాదుల మీద ప్రపంచవ్యాప్తంగా స్వాతంత్ర్యంకోసం ఉద్యమాలకై పోరాటాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా రష్యాలో 1917లో అక్కడ తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడడం, దాని వెలుతురులోనే అనేక దేశాలలో స్వాతంత్ర్య ఉద్యమాలు ఉద్భవించాయి. ఆ ప్రభావం భారతదేశం మీద కూడా పడింది. మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, జవహర్ లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్ తదితరులు పెద్ద ఎత్తున స్వాతంత్ర్యోద్యమాలు చేస్తున్న తరుణంలో 1930లో మహాత్మాగాంధీ కాకినాడలో చేపట్టిన ఉప్పు సత్యాగ్రహంకు తెలంగాణ నుండి కూడా బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మగ్దమ్ మొహియుద్దీన్ పాల్గొని స్వాతంత్ర్య ఉద్యమంలో పాలుపంచుకున్నారు.

### దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణకు ఏదీ?

దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. అయితే నిజాం రాచరిక పాలనలో ఉన్న తెలంగాణలో స్వాతంత్ర్యం రాలేదు. అప్పటికే ఈ ప్రాంతంలో అణచివేతలు విపరీతంగా ఉన్నాయి. వెట్టిచాకిరి బానిసత్వం తో పాటు ఉర్దూ భాష అధికార భాషగా అమలు చేశారు. భాష మీద, మనుషుల మీద పెత్తనం చేశారు. ఇలాంటి తప్పనిసరి పరిస్థితులలో తిరుగుబాటు ఆరంభమైంది. 1935లో జోగిపేటలో ఆంధ్ర మహాసభ ప్రారంభమై ఆ తరువాత 1945లో భువనగిరిలో ఆంధ్ర మహాసభ లో దున్నేవాడికే భూమి కావాలి, వెట్టిచాకిరీ రద్దు కావాలని పోరాటాలకు పిలుపునివ్వడం జరిగింది. బండెనక బండి గట్టీ 16 బండ్లు కట్టి అని పాటలు పాడుకుంటూ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తూ పల్లె పల్లెకు సంఘాలు పెట్టాలని నిర్ణయించుకున్నారు. ఆ నేపథ్యంలోనే పల్లెలలో ప్రజలు సంఘాలు పెట్టుకుని దొరలను ఎదిరించారు. 1946 జూలై 4న కడివెండిలో విసునూరి రామచంద్రారెడ్డి ఆగడాలను ఎదిరించిన దొడ్డి కొమరయ్య తొలి అమరుడయ్యారు. షేక్ బందగి లాంటి అనేకమందిని పొట్టన పెట్టుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా నైజాం రాజుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు పెల్లుబికాయి. ఇప్పుడు ఉన్న ఆంధ్రప్రదేశ్ తమిళనాడు రాష్ట్రంలో ఉండేది. వారు కూడా తెలుగు ప్రజలు కాబట్టి తెలంగాణలో జరుగుతున్న సాయుధ పోరాటానికి పూర్తి సహకారం అందించారు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినా అప్పటికి తెలంగాణలో నిజాం రాచరిక పాలనలో ఉండడం మూలంగా యువకులు, నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు జాతీయ జెండాను ఎగురవేస్తే కేసులు పెట్టి జైళ్లలో నిర్బంధించారు. చిత్రహింసలకు గురిచేశారు. ఈ నేపథ్యంలో నైజాంను ఎదిరించడానికి బందూకులు పట్టాలనే నిర్ణయానికి వచ్చారు. నాగపూర్ లోని చాందాలో క్యాంపు ఏర్పాటు చేసి శిక్షణను ఇచ్చారు. పూర్తిస్థాయిలో కాకున్నా కాంగ్రెస్ పార్టీ కూడా తెలంగాణ పోరాటంలో పాల్గొన్నది. సెప్టెంబర్ 11, 1947లో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దుం మొహియుద్దీన్ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు.

ఆ పిలుపు ఉధృతమై ఊరు వాడ ఉప్పెనై కత్తులు, ఒడిశలు, కారం పొడి, రోకలి బండలతో దొరల మెడలు ఉంచడానికి పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయి. దొరల పెత్తనంలో ఉన్న 3000 గ్రామాలు విముక్తి చేయబడ్డాయి. వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ సాయుధ పోరాటానికి తలొగ్గిన జాగిర్దారులు, జమీందారులు, దొరలు నిజాం కు మొరపెట్టుకోవడంతో ఆయన కేంద్రంతో ఒడంబడిక చేసుకొని 1948 సెప్టెంబర్ 13న యూనియన్ సైన్యాలు హైదరాబాద్‌కు రావడం జరిగింది. 1948 సెప్టెంబర్ 17న నిజాం రాజు తన సొంత రేడియోలో దేశంలో తెలంగాణ ప్రాంతాన్ని విలీనం చేస్తామని ప్రకటించాడు. కమ్యూనిస్టులకు పేరు రాకుండా కేంద్రం సైన్యాలను పిలిపించుకొని తెలంగాణలో ఉన్న తమ ఆస్తులను కాపాడుకుంటూ విలీన ప్రక్రియ ప్రారంభించారు. పోరాటాలు కమ్యూనిస్టులు చేస్తే భోగాలు మాత్రం బూర్జువా పార్టీలవి అనేది అర్థమవుతుంది.

### సాయుధ పోరాటం నాటికి పుట్టని బిజెపి

ప్రస్తుతం దేశంలో అధికారంలో ఉన్న బిజెపి, ప్రధాని నరేంద్ర మోడీ విమోచన దినోత్సవం పేరుతో హిందూ ముస్లింల మధ్యన జరిగిన పోరాటంగా చిత్రీకరించి చరిత్రను వక్రీకరిస్తున్నారు. నిజంగా చెప్పాలంటే నిజాం వ్యతిరేక పోరాటంలో కూడా అనేకమంది ముస్లింలు పాల్గొన్న విషయం అందరికీ విదితమే. కానీ బిజెపి తన మతతత్వ రాజకీయాలు చేస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నది. ఎలాంటి సంబంధం లేని బిజెపి నేడు తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకస్తున్నది. అంటే చరిత్రను తప్పుదోవ పట్టించడమే అవుతుంది. భావితరాలకు వాస్తవిక చరిత్రను కనుమరుగు చేసే కుట్ర బిజెపి పన్నుతుంది. ఇది బిజెపి అరాచకానికి నిలువుటద్దం. అయితే గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో 2021లో 'సమైక్య దినం' పేరుతో ఉత్సవాలు జరిపినా, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజా పాలన' పేరుతో సెప్టెంబర్ 17న ఉత్సవాలు జరిపినా అది కమ్యూనిస్టుల త్యాగఫలితం వలనే తెలంగాణ రాష్ట్రానికి ఆనాడు స్వాతంత్రం సిద్ధించిన ఫలితమే. ఎవరు ఏ పేరు చెప్పినా విలీనం జరిగిన మాట వాస్తవం, కమ్యూనిస్టుల పోరాటం, త్యాగాలు చరిత్రాత్మకం. కొన్ని సందర్భాలలో ముఖ్యమంత్రి సాయుధ పోరాటం భూమి చుట్టే జరిగిందని, కమ్యూనిస్టుల వలన వచ్చిందని చెప్పడం మంచి పరిణామం. ఆనాటి సాయుధ పోరాట చిహ్నాలు, స్మృతులు ఇప్పటికీ పోరాట కేంద్రాలలో కనిపిస్తూనే ఉన్నాయి. ఎక్కడ ఏ పుట్టని అడిగినా చెట్టుని అడిగినా ఆనాటి రక్త తర్పణం కనిపిస్తూనే ఉన్నది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి వల్లాలనే గ్రామంలో పదిమంది విద్యార్థులు త్రివర్ణ పతాకాన్ని ఎగరవేస్తే రజాకార్లు గుర్రాలతో తొక్కించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఆ ప్రాంతంలో స్థూపాన్ని కూడా సెప్టెంబర్ 12వ తేదీన ఆవిష్కరించబోతున్నారు. సాయుధ పోరాటం చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగినది. అలాంటి పోరాటాన్ని దురుద్దేశంతో తొక్కి పట్టారు. బిజెపి చేస్తున్న దుష్ప్రచారం విడ్డూరంగా ఉన్నది. ఇది వారి ఆత్మహత్యాసదృశమే. బిజెపి వక్రబుద్ధిని ఖండిస్తున్నాం. కమ్యూనిస్టుల త్యాగ ఫలితం వలనే భారతదేశంలో తెలంగాణ విలీనమైనందున విలీన దినం అధికారికంగా జరపాలని కోరుతున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు సాయుధ పోరాటాన్ని గుర్తించి ఆనాటి పోరాట స్మృతులను ఈనాటి తరానికి తెలియజేయడానికి గొప్ప ప్రయత్నం చేయాలి. ఎందుకంటే ఆ పోరాటం తెలంగాణ వారసత్వ సంపద.

# యాగాలతో 'అధికార యోగం' సంభవమా?



ఎస్.కె. జకీర్

మంత్రాలతో చింతకాయలు రాలవు. యజ్ఞాలు, యాగాలతో రాజ్యాధికారం రాదు. నలభై ఐదేండ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కెసిఆర్ ఒక్క 'ఓటమి'తో చతికిలబడడం అనూహ్యం. ప్రజలకన్నా ఆయనకు దేవుళ్ళపైనే నమ్మకం అధికం. కాలం ఎప్పుడూ ఒకే విధంగా ఉండదు. చీకటి తర్వాత వెలుతురూ వస్తుంది. ఓటమి తర్వాత గెలుపు కూడా ఉంటుంది. అయితే ఇదంతా ప్రజలను నమ్మినప్పుడే. ప్రజాతీర్పును గౌరవించకుండా, ప్రజల్ని కాంగ్రెస్ పార్టీ మోసగించిందనో, ప్రజలు మోసపోయి తప్పు చేశారనో, తమ తప్పును ఇప్పుడు తెలుసుకొని బాధ పడుతున్నారనో.... వ్యాఖ్యానిస్తూ బిఆర్ఎస్ నాయకులు తమను తాము మోసగించుకుంటున్నారు.

ప్రజలు తమను ఎందుకు తిరస్కరించారో వాళ్ళు తెలుసుకోవాలనుకోవడం లేదు.ఆత్మ పరిశీలన చేసుకోవాలని అనుకోవడం లేదు.తప్పులు దిద్దుకొని ముందుకు వెళ్లాలని అనుకోవడం లేదు. 'అసలు మేము ఎలాంటి తప్పు చేయలేదు' అని కెసిఆర్, కెటిఆర్, హరీశ్ రావు బల్లగుద్ది వాదిస్తున్నారు. ప్రజలతో డిస్కనెక్టు కావడాన్ని సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలకేమి కావాలో తామే నెరవేర్చినందున, ఇక ప్రజలతో తమకేమి సంబంధమని ఆ పార్టీ నాయకులు ప్రశ్నించడం విచిత్రంగా ఉంది. "సామాన్య ప్రజలతో ముఖ్యమంత్రి కలవవలసిన అవసరం ఏమిటి?" అని ఒక సందర్భంలో కెటిఆర్ అన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నవేళ సెక్రెటేరియట్‌కు రాకపోయినా, ఎమ్మెల్యేలను కూడా కలవకపోయినా, ప్రజల్ని కలుసుకోవడం అవసరం లేదని భావించినా అధికారం ఉన్నప్పుడు చెల్లుబాటు అయ్యింది. ఆ అధికారం నీడలో చాలా విమర్శలు కనుమరుగయిపోయాయి.

కెసిఆర్ కు భక్తి ఎక్కువ. భయమూ ఎక్కువే. ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత అనేక హిందూ దేవాలయాలకు మొక్కులు తీర్చుకున్నా రు. కొరివి వీరభద్రుని దగ్గర నుంచి తిరుమల వేంకటేశ్వరుని వరకూ ఖరీదైన ఆభరణాలు ఇచ్చారు. తెలంగాణ వచ్చినందుకు మొక్కు తీర్చుకుంటున్నానని కెసిఆర్ తెలిపారు. అజ్మీరు దర్గాకు కూడా కానుకలు పంపారు. లౌకిక ప్రభుత్వం కదా, ప్రజాధనంతో మొక్కులు ఎలా చెల్లిస్తారని ఎవరూ ఆయన్ను ప్రశ్నించలేదు. తెలంగాణ ఏర్పడ్డాక 2014–2018 మధ్య ఒక్క రోజు కూడా సచివాలయంలో కెసిఆర్ అడుగు పెట్టలేదు. రెండోసారి గెలిచి ముఖ్యమంత్రి అయిన తరువాత, హుస్సేన్ సాగర్ తీరంలో దాదాపు 25 ఎకరాల్లో ఉన్న సచివాలయాన్ని కూల్చివేశారు. ఆ భవనాలేమీ శిథిలావస్థకు చేరుకున్నవి కాదు. కానీ, వాటిని కూల్చి వాటి స్థానంలో కొత్త సచివాలయం కట్టారు. అందుకు కారణం అది కెసిఆర్‌కు నచ్చకపోవడమే. ఆయన సచివాల యం కూల్చడం పరిపాలన సౌలభ్యం మాత్రమే కాదనీ, ఒక ఐకానిక్ భవనం కావాలనే ఆకాంక్ష అని, అలాగే వాస్తు నమ్మకం అనేవి బహిరంగ రహస్యం.

తరచూ వందల మంది పండితులతో భారీ యాగాలు చేసే కెసిఆర్ కు నమ్మకాలు కూడా ఎక్కువ. గతంలో తన ఫామ్ హౌస్‌లో రాజశ్యామల యాగం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గుజరాత్‌లో నిర్మించిన సోమ్‌నాథ్ ఆలయం నుంచి, తాజాగా అయోధ్యలో నిర్మించిన రామాలయం వరకూ ఏదీ ప్రభుత్వ ఖర్చుతో చేయలేదు. విరాళాలతోనే చేశారు. కానీ కెసిఆర్ మాత్రం ప్రభుత్వ డబ్బుతో మొక్కులు తీర్చడం, గుళ్ల కట్టడం చేశారు. తెలంగాణలోని హైదరాబాద్ శివార్లలో యాదగిరి గుట్ట దేవాలయాన్ని ప్రభుత్వ సొమ్ముతో పునరుద్ధరించారు. అందుకు వెయ్యి కోట్ల రూపాయలతో గుడి కట్టేశారు. ప్రభుత్వ సొమ్ముతో ఇలా చేయడం సబబేనా అని కెసిఆర్‌ను ఎవరూ ప్రశ్నించలేదు. కెసిఆర్ వ్యక్తిగత వ్యవహార శైలి, ప్రభుత్వాన్ని, పార్టీని ఆయన నడిపే విధానం, తన నమ్మకాలను బట్టి, అభిరుచులను బట్టి వివిధ ప్రభుత్వ విధాన నిర్ణయాలను తీసుకునే పద్ధతి మిగతా ప్రాంతీయ పార్టీల అధినేతలకు భిన్నమైనది.

కెసిఆర్ ప్రభుత్వంలో కుటుంబ సభ్యుల పాత్ర 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనే కాదు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రత్యర్థి పార్టీలకు ప్రధాన అస్త్రాలుగా మారనున్నవి. పైగా గడచిన కొన్ని నెలలుగా పార్టీలో, కుటుంబంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారు. ఇందుకోసమేనా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకున్నదని ఏవగించుకుంటున్నారు. బిఆర్ఎస్ పార్టీ తాము చేశామని చెబుతున్న 'అద్భుతాల్లో' కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒకటి.ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ లో వారి హయాంలోనే పిల్లర్లు దెబ్బతిన్నాయి. బరాజ్ కూడా కుంగింది.ఈ ప్రాజెక్టు దెబ్బతినడంపై చర్చ అంతా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కేంద్రంగానే నడిచింది. ఇప్పటికీ నడుస్తున్నది. జస్టిస్ పిసి. ఘోష్ కమిషన్ నివేదికలోనూ కెసిఆర్ ను 'ప్రధాన బాధ్యుని'గా పేర్కొన్నారు. ఆ నివేదిక బహిర్గతం చేయకుండా చూడాలని, బహిర్గతం చేసి అసెంబ్లీలో పెట్టి చర్చించినా తదుపరి చర్యలకు పూనుకోరాదని,ఘోష్ నివేదిక ఆధారంగా సిబిఐ విచారణ జరగకుండా చూడాలని కెసిఆర్, హరీశ్ రావు హైకోర్టులో వరుస పిటిషన్లు వేసి ఊరట లభించకపోవడంతో తమ పరువు తామే పోగొట్టుకున్నట్లయ్యింది.

కాళేశ్వరం ప్రాజెక్టు ఒక ఒడువని ముచ్చట. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కెసిఆర్ స్వయంగా జోక్యం చేసుకుని పెద్ద పెద్ద ఇంజినీర్లకే సలహాలిచ్చారని బిఆర్ఎస్ నాయకులు గతంలో ఎంతో గొప్పగా చెప్పుకున్నారు. కొందరు ఇంజినీర్లతోనూ అలాగే ప్రచారం చేయించారు. లిటరేచర్ చదువుకున్న కెసిఆర్ ఇరిగేషన్ ప్రాజెక్టును రీడిజైన్ ఎలా చేస్తారు? సివిల్ ఇంజినీర్లకు సలహాలు ఇవ్వడం ఎలా సాధ్యం? అని ఎవరూ ప్రశ్నించకపోవడం విశేషం. కెసిఆర్ కు సలహా ఇవ్వడానికే వణికిపోయే అధికారులు, పార్టీ నాయకులు ఇక 'ప్రశ్నించడం' అనేది ఊహించని సన్నివేశం.

కాగా బిటి బ్యాచ్, యూటీ బ్యాచ్ అంశం బిఆర్ఎస్ ను ఇంటా, బయటా వెంటాడుతూనే ఉన్నది. ఇది 11 ఏండ్లుగా రగులుతున్న సమస్య. కెటిఆర్ కంటే తెలంగాణ ఉద్యమంలో ఎక్కువగా పోరాడిన నాయిని నరసింహారెడ్డికి రెండోసారి మంత్రి పదవి ఇవ్వలేదు. మరొక ఉద్యమకారుడు ఈటల రాజేందర్‌ను పార్టీ నుంచి అవమానకరంగా తరిమేశారు. మాట వినడం లేదని మాజీ ఎంపి. ఎపి.జితేందర్ రెడ్డి, వివేక్ వంటి వారికి ఎంపి టికెట్ ఇవ్వలేదు. ఉపముఖ్యమంత్రి, దళితుడు, డాక్టర్ రాజయ్యను ఆ పదవి నుంచి ఎందుకు తొలగించారో ఇప్పటికీ సస్పెన్స్. తనను ఎందుకు తొలగించారని ఆయన ప్రశ్నించలేరు. ఫలానా కారణంగా తాము ఉద్వాసన పలికినట్లు కెసిఆర్ చెప్పరు. అదొక మిస్టరీ. తెలంగాణ కోసం కృషి చేసిన వారికి పదవులు కాకుండా కుటుంబసభ్యులకు పదవులివ్వడానికి కెసిఆర్ ప్రాధాన్యం ఇచ్చి విమర్శలపాలయ్యారు.

"కెసిఆర్ అవినీతి, కుటుంబ పాలన అంటూ విమర్శిస్తుంటారు. కెటిఆర్, హరీశ్ రాజకీయాల్లో తమ ప్రతిభను నిరూపించుకున్నారు. కవిత తెలంగాణ సాంస్కృతిక ఉద్యమానికి చేసిన సేవను అందరూ చూశారు. కుటుంబ పాలన ఏమీ లేదు. ఒక రాజకీయ పార్టీగా బిఆర్ఎస్ పార్టీ ఒక వ్యూహం ప్రకారం ఉద్యమంలో లేని వారికి కూడా పదవులు ఇవ్వాల్సి వస్తుంది. అదేమీ తప్పు కాదు" అని కెసిఆర్ 'భక్తమండలి' సభ్యులు ఇంతకుముందు వాదిస్తూ ఉండేవారు. కవిత 'తిరుగుబాటు', సస్పెన్షన్, ఆమె పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా వంటి ఘటనలతో కవితను విచ్ఛిన్నకర' శక్తిగా కెసిఆర్, కెటిఆర్ 'భక్త మండలి' సభ్యులు అభివర్ణిస్తున్నారు. తెలంగాణ ద్రోహులు, కెసిఆర్ వ్యతిరేకులతో 'ఆమె' చేతులు కలిపినట్లుగా ఆరోపిస్తున్నారు. కవిత ఇమేజ్ దెబ్బతీయడానికి సోషల్ మీడియా వేదికల ద్వారా 'భక్తమండలి' గట్టిగా ప్రయత్నిస్తోంది. ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు అంశాలను తెరపైకి తీసుకు వచ్చి ఆమె 'వ్యక్తిత్వ హననాని'కి పాల్పడుతున్నా కెసిఆర్, కెటిఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారో, ఇదేమి రాజనీతో ఎవరికీ అర్థం కావడం లేదు. రాజకీయ కుటుంబాల్లో కలహాలు సహజం. బిఆర్ఎస్ అధినేత క్రూరమైన రాజకీయ క్రీడకు కవిత బలయినట్టు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

సాధారణంగా దైవభక్తి ఉన్నవాళ్లకు పాపభీతి కూడా మెండుగా ఉంటుందన్న నానుడి ఉన్నది.తన కూతురు వ్యవహారంలో కేసీఆర్ ఇలా ప్రవర్తించడం వెనుక 'పురుషాధిక్య' భావజాలం ఎంత బలంగా పనిచేస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. ఒక రాజకీయ పార్టీ అధ్యక్షునిగా డిస్టింక్షన్ మార్కులు సంపాదించినా, కుటుంబం విషయంలో ఆయన ఫెయిలు అయినట్లుగానే పరిశీలకులు భావిస్తున్నారు.




## చైర్మన్ పదవి పునరుద్ధరణ

# మలి చైర్మన్ ఎస్.ఎ.డాంగే

పార్టీ సంస్థాపక మహాసభ (1925 కాన్పూర్)లో ఎం.సింగారవేలు చెట్టియార్ పార్టీ నిబంధనావళి ప్రకారం సిపిఐ తొలి చైర్మన్‌గా పరిగణించబడగా, 1962లో జాతీయ సమతి సమావేశం చైర్మన్ పదవిని నిబంధనావళిలో చేర్చి ఆ పదవిలోకి సీనియర్ నాయకుడు శ్రీపాద అమృత్ డాంగేను, ప్రధాన కార్యదర్శిగా ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్‌ను ఎన్నుకుంది. అది పార్టీ ఐక్యతను పరిరక్షించే ప్రయత్నం. పార్టీ లోపల చర్చనీయాంశాలుగా ఉన్న రెండు భిన్నమైన రాజకీయ పంథాలకు వారు ప్రతినిధులు.

### డాంగే జీవిత సంగ్రహం



డాంగే 1899 అక్టోబర్ 10న మహారాష్ట్రలోని నాసిక్‌లో జన్మించారు. 1917లో బొంబాయిలోని విల్సన్ కాలేజీలో చేరారు. జాతీయోద్యమనాయకులు బాలగంగాధర్ తిలక్, మహాత్మాగాంధీ ప్రభావంలోకి వచ్చారు. చివరకు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని విశ్వసించారు. భారతదేశంలో తొలి మార్క్సిస్టు గ్రంథం "గాంధీ VS లెనిన్" రచించారు; తొలి మార్క్సిస్టు పత్రిక 'సోషలిస్టు' (1922) ఎడిట్ చేశారు. 1925 నుంచి సిపిఐ కేంద్ర కార్యవర్గ కమిటీలో ఉన్నారు. కాన్పూర్ కుట్ర కేసు (1924–28)లో అరెస్టు అయినారు. 1928లో గిర్నికాంగార్ యూనియన్ నాయకునిగా జౌళి కార్మికుల సుదీర్ఘ సమ్మెకు నాయకత్వం వహించారు. మీరట్ కుట్ర కేసు (1929–33)లో మళ్లీ అరెస్టు చేశారు. 1940–42లో బ్రిటీష్ సామ్రాజ్యవాద పోలీసులు దియోలీ నిర్బంధ శిబిరంలో బంధించారు. సిపిఐ రాజకీయ పంథాను సరిదిద్దటానికి 1950లో అజ్ఞాతం నుంచి ముగ్గురు రాసిన ప్రసిద్ధ '3–పి' లేఖకుల్లో డాంగే ఒకరు. మిగతా ఇద్దరు అజయ్ ఘోష్, ఘాటే. 1950లో మాస్కోలో స్టాలిన్‌ను కలుసుకున్న నలుగురు సభ్యుల్లో డాంగే ఒకరు. మిగతా ముగ్గురు అజయ్‌ఘోష్, చంద్ర రాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్య. ఆ తర్వాత తెలంగాణ సాయుధ పోరాట ఉపసంహరణ నిర్ణయం జరిగింది. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శిగా డాంగే చాలాకాలం పనిచేశారు. 1963 సెప్టెంబర్ 13న సిపిఐ పార్లమెంటుకు నిర్వహించిన తొలి గ్రేట్ మార్చ్‌కి సూత్రధారి ఆయన. బంద్, ఘొరావో వంటి నూతన పోరాట రూపాలను రూపొందించారు. 1962 నుంచి 1982 దాకా పార్టీ చైర్మన్.

డాంగే 1946లో బొంబాయి ప్రొవిన్షియల్ అసెంబ్లీ సభ్యునిగా ఎన్నికైనారు. 1957, 1967లలో లోక్‌సభకు ఎన్నికైనారు. గోవా విముక్తి పోరాటం, సంయుక్త మహారాష్ట్ర ఉద్యమాల్లో ప్రముఖ వ్యక్తి. పార్టీతో విభేదాలతో పార్టీకి దూరమై,ఆయన కుమార్తె రోజా దేశ్‌పాండే ఏర్పాటు చేసిన ఎఐసిపిలో చేరారు. తర్వాత యుసిపిఐగా అది కొంతకాలం పని చేసి అంతర్థానమైంది. 'ఆదిమ కమ్యూనిజం నుంచి బానిస వ్యవస్థ వరకు' డాంగే ప్రసిద్ధ రచన. ఆయన 1991 మే 22న మరణించారు.



కేరళలో తొలి కమ్యూనిస్టు ముఖ్యమంత్రి

### ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్

ఈలంకుళం మనక్కళ్ శంకర్ (ఇఎంఎస్) నంబూద్రిపాద్ 1909 జూన్ 13న ఎర్నాకుళంలో ఒక సనాతనవాద కుటుంబంలో నాల్గవ సంతానంగా జన్మించారు. ఇ.ఎం.ఎస్ సంస్కరణవాద ప్రభావంలోకి వచ్చారు. 1925లో స్కూలులో చేరారు. 1929లో ఎస్ఎస్‌సి పాసైనారు. సంస్కృతం, ఇంగ్లీషులో నిష్ణాతుడు; 1927లో మద్రాసులో ఎఐసిసి సమావేశాలకు హాజరైనారు. 1931 నవంబర్ 1న ప్రారంభమైన గురవయ్యూర్ ఆలయ ప్రవేశ సత్యాగ్రహంలో చురుకుగా పాల్గొన్నారు. 1932 జనవరి 4న కాలేజీ విద్యకు స్వస్తి చెప్పి పౌర శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. అరెస్టు చేసి కాలికట్, కన్ననూర్, వెల్లూరు తదితర జైళ్లు తిప్పారు. కృష్ణ పిళ్లయ్, ఎ.కె.గోపాలన్, కిరణ్‌దాస్, ఆర్‌సి ఆచార్య, ఎన్‌జి రంగా తదితరులను కలుసుకున్నారు. త్వరలోనే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో చేరారు. 1934 మే నెలలో పట్నాలో సిఎస్‌సి తొలి అఖిలభారత సదస్సులో ఇఎంఎస్ పాల్గొన్నారు. 1955లో మద్రాసులో కృష్ణ పిళ్లయ్, ఎస్.వి.ఘాటే, పుచ్చలపల్లి సుందరయ్యను కలుసుకున్నారు.1936 జనవరిలో సిపిఐ సభ్యత్వం తీసుకున్నారు.


మలబార్ నుంచి 1939 ఫిబ్రవరిలో ఇఎంఎస్ మద్రాసు అసెంబ్లీకి ఏకగ్రీవంగా ఎన్నికైనారు.1942లో సిపిఐపై నిషేధం ఎత్తివేయబడింది. సిపిఐ తొలి కాంగ్రెస్‌లో (బొంబాయి 1943) ఇఎంఎస్ పార్టీ కేంద్ర కమిటీలోకి తీసుకోబడ్డారు.1951లో పోలిట్ బ్యూరో సభ్యుడైనారు. మధురై (1953), పాల్ఘాట్ ( (1956), అమృతసర్ (1958), విజయవాడ (1961) పార్టీ మహాసభల్లో పోలిట్‌బ్యూరోలో కొనసాగారు.

1957 సార్వత్రిక ఎన్నికల్లో కేరళ అసెంబ్లీలో కమ్యూనిస్టుపార్టీ మెజారిటీ సాధించి చరిత్ర సృష్టించగా, పార్టీ ఇఎంఎస్‌ను ముఖ్యమంత్రిగా నిర్ణయించింది. ఆ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ, విద్యా సంస్కరణల బిల్లులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు వ్యతిరేకులంతా ఏకమై 'విముక్తి ఉద్యమం' లేవదీయటంతో ఆ ప్రభుత్వాన్ని 1959లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించింది.

1962లో అజయ్ ఘోష్ మరణించాక పార్టీ చైర్మన్‌గా ఎస్.ఎ.డాంగే, ప్రధాన కార్యదర్శిగా ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఎన్నికైనారు. 1964లో, పార్టీలో చీలికకు సంకేతంగా పార్టీ జాతీయసమితి నుంచి వాకౌట్ చేసిన 32 మందిలో నంబూద్రిపాద్ ఒకరు. అటు తర్వాత వారు ఏర్పరుచుకున్న సిపిఐ(ఎం)లో పోలిట్‌బ్యూరో సభ్యునిగా ఉన్నారు. 1967 నుంచి 1969 వరకు మరో పర్యాయం 7 పార్టీల సంకీర్ణ ప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1977లో పి.సుందరయ్య పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేశాక ఆ పదవిలోకి ఇఎంఎస్ ఎన్నుకోబడ్డారు. 1992 వరకు ఆ పదవిలో ఉన్నారు. ఇఎంఎస్ 1998 మార్చి 19న కన్నుమూశారు.

### చంద్ర రాజేశ్వరరావు

సుదీర్ఘకాలం ప్రధాన కార్యదర్శి



చంద్ర రాజేశ్వరరావు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా మంగళాపురంలో 1914 జూన్ 6వ తేదీన సంపన్న రైతు కుటుంబంలో జన్మించారు. 'సిఆర్'గా ఆయన ప్రసిద్ధులు. బెనారస్ హిందూ యూనివర్శిటీలో, ఆ తర్వాత విశాఖపట్నం మెడికల్ కాలేజీలో విద్యనభ్యసించారు. 1934లో బిహెచ్‌యులో ఉండగానే సిపిఐ సభ్యత్వం స్వీకరించారు. అక్కడ సోషలిస్టు స్టడీ సర్కిల్‌లో మార్క్సిజం అధ్యయనం చేశారు.

ఆంధ్రా యూనివర్శిటీలో ఉండగా, సిఆర్ కార్మికులను, ట్రేడ్ యూనియన్‌లను ఆర్గనైజ్ చేశారు. 1937 జులై 3న ఇచ్ఛాపురం నుంచి మద్రాసుకు ప్రారంభమైన రైతు రక్షణ యాత్రలో సిఆర్ చురుకుగా పాల్గొన్నారు. 1500 మైళ్లు కాలినడకన, 525 మైళ్లు బస్సు ప్రయాణంతో సాగిన ఆ చరిత్రాత్మక రైతు యాత్ర 1938 మార్చి 27న రాష్ట్ర రాజధాని మద్రాసులో ముగిసింది. 1940 ప్రారంభంలో చల్లపల్లి రాజాకు వ్యతిరేకంగా పోరాటంలో సిఆర్ అరెస్టు అయినారు. సిపిఐ ఆంధ్ర రాష్ట్ర రెండవ మహాసభ (1938)లో ఏడుగురు సభ్యులతో కూడిన రాష్ట్ర కమిటీకి ఎన్నికైనారు. 1943లో ఆంధ్ర రాష్ట్ర సిపిఐ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. 1948 బుద్ధవరం, 1956 రేవేంద్రపాడు మహాసభలో తిరిగి కార్యదర్శి అయినారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం 1956 జులై 2న హైదరాబాద్‌లో ఆంధ్ర, తెలంగాణ సిపిఐ రాష్ట్ర కమిటీల విలీనంతో జరిగిన ఐక్య మహాసభలో రాజేశ్వరరావు కార్యదర్శిగా ఎన్నికైనారు.

1939లో కృష్ణాజిల్లా తునికిపాడులో రాజేశ్వరరావు నిర్వహించిన రాజకీయ పాఠశాలకు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి హాజరైనారు. 1940ల్లో ఎ.గురవారెడ్డి సహాయంతో రామిరెడ్డి అనే మారుపేరుతో రెడ్డి హాస్టల్‌లో చేరిన సిఆర్ తెలంగాణాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పునాదులు వేశారు. 1952 తర్వాత మద్రాసు రాష్ట్ర శాసనమండలికి ఎన్నికైనా, ఇది మనకు సరిపడేదికాదని కొద్దికాలంలోనే రాజీనామా చేశారు. 1946–50 తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నిర్వాహకుల్లో ఒకరిగా ముఖ్యభూమిక వహించారు.

రాజేశ్వరరావు 1950లో తొలిసారి సిపిఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనారు. బిటిఆర్‌ను తొలగించిన పార్టీ నాయకత్వం రాజేశ్వరరావును తాత్కాలికంగా ఎన్నుకుంది. అయితే బిటిఆర్ 'సాయుధ తిరుగుబాటు' బదులు 'గెరిల్లా సాయుధ పోరాటం' పంథా ముందుకు తెచ్చారు. 'ఆంధ్రా లైన్' అని దానికి పేరు. తెలంగాణ పోరాటంపై స్టాలిన్‌ను కలిసిన నలుగురులో ఆయన ఒకరు. 1958 నుంచి 1964 వరకు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్నారు. పార్టీ చీలిక అనంతరం 1964లో 7వ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై 1990 వరకు ఆ బాధ్యతల్లో కొనసాగారు. చైనా, పాకిస్థాన్ దురాక్రమణ యుద్ధాలను ఖండించారు. అనేక ప్రజా ఉద్యమాలు నిర్మించారు. ఆర్డర్ ఆఫ్ లెనిన్ సహా అనేక అవార్డులు పొందారు. 1994 ఏప్రిల్ 9న హైదరాబాద్‌లో అస్తమించారు.

## 14 వరకు శంకర్‌పల్లిలో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

ప్రజాపక్షం/శంకర్‌పల్లి: ఈనెల 14వ తేదీ వరకు శంకర్‌పల్లి మండలంలో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ చేవెళ్ల సబ్ డివిజన్ ఇఇ చల్మారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని కామ్మదానం నుండి కడ్తాల్ మధ్యలో గేట్‌వాల్స్, పైప్లైన్ల మరమ్మతు పనులు జరుగుతున్నాయని, అందువల్ల చేవెళ్ల సెగ్మెంట్‌లోని షాబాద్, చేవెళ్ల,మొయినాబాద్, శంకర్ పల్లి,మండలాలకు సరఫరా సెప్టెంబర్ 12 నుండి 14వ తేదీ వరకు ఉండదని ఆయన తెలిపారు. ఈ విషయం ప్రతి గ్రామపంచాయతీ కార్యదర్శుల తోపాటు చేవెళ్ల, శంకర్ పల్లి, మొయినాబాద్ మునిసిపాలిటీల కమిషనర్‌కు తెలియజేయడం జరిగిందన్నారు. ఆదివారం వరకు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని, అందుకు తాము చింతిస్తున్నామని తెలిపారు. అన్ని గ్రామాల ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఇఇ చల్మా రెడ్డి సూచించారు.

## సిబ్బంది కొరతతోనే విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఎఇ రవికుమార్

ప్రజాపక్షం/కొందుర్గు: విద్యుత్ సిబ్బంది కొరత కారణంగానే సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని కొందుర్గు ట్రాన్స్‌కో ఎఇ రవికుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని వివిధ విద్యుత్ సబ్‌స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఇ రవికుమార్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని 23/11విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 22గ్రామ పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మూడు గ్రామాలకు ఒక లైన్‌మెన్ ఉండాలని, కానీ మండలంలో ఇద్దరు మాత్రమే ఉన్నారని, అసిస్టెంట్ లైన్‌మెన్లు 8మందికి ఇద్దరు ఉన్నట్లు, హెల్పర్లు 8మందికి ఒకరు మాత్రమే ఉన్నారన్నారు. వర్షాల నేపథ్యంలో విద్యుత్ తీగలు తెగి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, రైతులు చెబుతున్నా, తాను ఏమి చేయలేకపోతున్నానని వివరించారు. ఎమ్మెల్యే స్పందించి అవసరం ఉన్న మేరకు విద్యుత్ సిబ్బందిని తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

## భూదాన్ భూములు స్వాధీనం చేసుకోవాలి : సిపిఐ డిమాండ్



ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ : రాష్ట్రంలో భూదాన భూములను స్వాధీనం చేసుకోవాలని సిపిఐ రాష్ట్ర నాయకులు అందోజు రవీంద్రచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూదాన ఉద్యమాల పితామహుడు ఆచార్య వినోభ భావే జయంతి వేడుకలను సిపిఐ మండల కమిటీ అధ్వర్యంలో గురువారం భూ పోరాట కేంద్రం రావినారాయణరెడ్డి నగర్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రవీంద్రచారి మాట్లాడుతూ ఆచ్యార వినోబా భావే చేసిన పోరాటంతో భూస్యాములు తమ వద్ద అదనంగా ఉన్నా భూములను దానం చేశారని, ఈ రోజు ఆ భూములు కబ్జాలకు గురవుతున్నాయని అవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం భూదాన భూములను కబ్జాలకు గురి కాకుండా చూడాలని, లేనిపక్షంలో గుడిసెల పోరాటం చేసి పేద ప్రజలకు పంపిణీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ముత్యాల యాదిరెడ్డి, పబ్బతి లక్షణ్, మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్, కేతరాజు నర్సింహ్మా, దాసరి ప్రసాద్, వేణుగోపాల్, గోపి పాల్గొన్నారు.

## యూరియా కొరత నివారించాలి

రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి




ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : యూరియా కొరత నివారించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొంతం మాధవరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం మంచాల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతులు యూరియా కోసం వ్యవసాయ సహకార సంఘాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. రైతులకు సకాలంలో యూరియా అందించటంలో పాలకులు విఫలం చెందారని విమర్శించారు. వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, పండించే పంటలకు గిట్టు బాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. యూరియాపై ప్రభుత్వాలు స్పందించి రైతుల సమస్య పరిష్కరించకుంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నారాయణరెడ్డి, సిపిఐ నాయకులు ఎండి అలిమొద్దిన్, అనంతరెడ్డి, పి.నీలమ్మ, బాలయ్య, నిర్మల, జయలక్ష్మి పాల్గొన్నారు.

## కోర్టుకు హాజరైన సిపిఐ నాయకులు



ప్రజాపక్షం/షాబాద్ : భూ పోరాటం వర్ధిల్లాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలోని కోర్టుకు సిపిఐ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఐ కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ చేవెళ్ల మండల కేంద్రంలోని సర్వే నెం. 75లో ఇండ్లు లేని నిరు పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని మూడు సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న ప్రభుత్వం కనికరించడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంమై భూ పోరాటం చేస్తే పోలీస్ అధికారులు అరెస్టు చేసి కేసులు పెట్టి కోర్టుకు లాగుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు సిపిఐ పేదల పక్షాణ నిరంతరం భూ పోరాటం చేస్తుందని చెప్పారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి సర్వే నెం. 75లో పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజక వర్గ ఇంచార్జ్ రామస్వామి, వివిధ మండలాల కార్యదర్శులు సత్తిరెడ్డి, శ్రీనివాస్, సీనియర్ నాయకులు సుధాకర్ గౌడ్, నరేష్, కృష్ణగౌడ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రలో నిలిచేలా అమరవీరుల స్థూపం నిర్మిద్దాం

ప్రొఫెసర్ కోదండరామ్




ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ : చరిత్రలో నిలిచేలా అమరవీరుల స్థూపం నిర్మించేందుకు కృషి చేద్దామని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. గురువారం షాద్‌నగర్ జెఎసి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించడానికి తొలిదశ, మలిదశ ఉద్యయంలో ఆసువులు బాసిన అమరులను ఎల్లప్పుడు స్మరించుకునే విధంగా అమరవీరుల స్థూపం షాద్‌నగర్‌లో నిర్మించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో షాద్ నగక్ జెఎసి వైస్ చైర్మెన్, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, కన్వీనర్ నక్క బాల్‌రాజ్ యాదవ్, గొర్ల రాము, అర్జునప్ప తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవం వేగవంతం

ప్రజాపక్షం/శంకర్‌పల్లి: వర్షాలు కురుస్తున్నందున గ్రామాలలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని శంకర్‌పల్లి ఇన్చార్జి ఎంపిడిఒ గోపాల కృష్ణ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు సిబ్బంది గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని సమీక్షిస్తూ వెంటనే బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు బంద్ అయిన సందర్భంగా గ్రామాలలో మంచినీటి సమస్య లేకుండా చూడాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ నాగభూషణం పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లుపాల్గొన్నారు.

# ఐదేండ్ల పిల్లలందరికీ పోలియో చుక్కలు

రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు




ప్రజాపక్షం/రంగారెడ్డి: ఐదేండ్లలోపు వయసు గల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి వెంకటేశ్వరరావు అన్నారు. సబ్ నేషనల్ ఇమ్యునైజేషన్ పోలియో కార్యక్రమంలో అక్టోబర్ 12న జరగనున్న సబ్ నేషనల్ ఇమినైజేషన్ దినోత్సవంలో పోలియో కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా జిల్లా ఉప వైద్యాధికారులకు, వైద్యాధికారులకు, సూపర్వైజర్లకు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బందికి శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అక్టోబర్ 12న జరగనున్న సబ్మినేషనల్ ఇమ్యునైజేషన్ దినోత్సవం, పోలియో కార్యక్రమంలో ఐదు ఏళ్ల లోపు వయసు గల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. నవజాత శిశువులకు కూడా వేయాలని కోరారు. అక్టోబర్ 12న పోలియో బూతులలో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు గృహ సందర్శన చేసి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఐదు సంవత్సర వయస్సు లోపల ఉన్న ప్రతి ఒక్క శిశువుకు కూడా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. కార్యక్రమలలో అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య,ఆశా కార్యకర్తలను, మహిళా గ్రూపులను భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంఒ డాక్టర్ మురారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శిభ హయత్, జిల్లా ఉపవైద్యాధికారులు డాక్టర్ విజయ పూర్ణిమ డాక్టర్ గీత, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ నాగేంద్రబాబు డాక్టర్ సుధ, పోగ్రామ్ అధికారులు డాక్టర్ వినోద్, డాక్టర్ రాధిక, డాక్టర్ రాకేష్, డాక్టర్ పూనమ్, డెమో కె శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఐక్యతతోనే కాలనీలు అభివృద్ధి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : కాలనీ వాసుల ఐక్యతతోనే కాలనీలు అభివృద్ధి చెందుతాయని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి అన్నారు. గురువారం వనస్థలిపురంలోని ఓంకార్ నగర్ కాలనీ రెండవ ఆర్చిని కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తన సహకారం ఉంటుందన్నారు. కాలనీల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమం లో జిట్టా రాజశేఖర్‌రెడ్డి, చింత రవికుమార్ గుప్తా, లగ్గొని శ్రీధర్ గౌడ్, మధు గౌడ్, పీవీ రావు, అజయ్, పద్మ, యాదగిరి సాగర్, రామస్వామి, వీరయ్య పాల్గొన్నారు.



## సమాజ సేవలు అభినందనీయం

ప్రజాపక్షం/సరూర్‌నగర్ : సమాజాభివృద్ధికి చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయం అని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కెఎల్ఆర్) అన్నారు. ఆర్‌కెపురం డివిజన్ మార్గదర్శికాలనీ, టెలిఫోన్‌కాలనీ పార్కులో వాకర్స్, సీనియర్ సిటిజన్స్ అవసరాలను దృష్టిలో పెట్టుకోని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి తమ సొంత నిధులతో కట్టించిన వాష్ రూమ్స్‌ను కెఎల్ఆర్ ముఖ్యఅతిథిగా హాజరై నియోజకవర్గం సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కెఎల్ఆర్ మాట్లాడుతూప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకోని ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కంచేవాడు నాయకుడు అవుతాడన్నారు. రాబోయే రోజుల్లో మరింత విస్తృత స్థాయిలో సేవ చేయడానికి ఉపేందర్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని కోరారు.



# భూ సమస్యల పరిష్కారానికి భూభారతిచట్టం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


ప్రజాపక్షం/షాద్‌నగర్: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ధరణి పోర్టల్ తీసుకువచ్చి భూ వ్యవస్థను సర్వనాశనం చేశారని, దాంతో రైతులు ఏళ్ల తరబడి రెవిన్యూ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారని వివరించారు. రైతులు పడుతున్న ఇబ్బందులను, భూ సమస్యలను దూరం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూ భారతి చట్టాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తూ రైతులకు ఎంతో మేలు చేయడం జరుగుతుందని వివరించారు. అనేక రోజులుగా పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాలకు ప్రభుత్వం మార్గదర్శకత్వం చూపిందని, వాటిని పరిష్కరించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రావద్దనే లక్ష్యంతోనే పెండింగ్‌లో ఉన్న 9లక్షల సాదా బైనామాల ధరఖాస్తులను పరిష్కరించేందుకు మార్గం చూపించడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. స్థానిక మున్సిపాలిటి పరిధిలోని నాలుగు పార్కులకుగాను రూ.4కోట్లు, వివిధ మండలాల్లోని తండాలకు రూ.2.20కోట్ల నిధులు,



ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు, జహంగీర్ ఫీర్ దర్గా, తండాల్లో రోడ్లకు పెద్ద ఎత్తున నిధులు తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఫరూఖ్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రూ.40లక్షల నిధులు ఖర్చు చేస్తున్నామని, విద్య, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. వార్డులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు, 7,9వార్డులతోపాటు మరో రెండు వార్డుల్లో పార్కులను నిర్మించేందుకు నాలుగు కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కృష్ణారెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, వీరేశం, హరినాథ్‌రెడ్డి, సుదర్శన్ గౌడ్, బాల్‌రాజ్ గౌడ్, రఘునాయక్, మహ్మద్ ఇబ్రహీం, నర్సింహ్మా యాదవ్, లింగారెడ్డిగూడ అశోక్, ముబారక్ అలీఖాన్ ఉన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



ప్రజాపక్షం/గండిపేట: దేశంలోనే ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైనదని రాజేంద్రనగర్ ఎంఎల్ఏ టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవన్ని పురస్కరించుకుని బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిటీ హాల్లో గురువారం ఘనంగా ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎంఇఒ సునీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గండిపేట మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 12మందిని శాలువాతో ఘనంగా సన్మానించి, మెమొంటోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి దేశంలోనే ఉత్తమమైనదని, సమాజంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ , నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శివరాం, శ్రీనివాస్‌రెడ్డి, మజీద్, రత్నారెడ్డి, ఉపాధ్యాయుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాగ్నిజెంట్ భాగస్వామ్యంతో కళాశాల విద్యార్థులకు శిక్షణ

ప్రజాపక్షం/గండిపేట: కాగ్నిజెంట్, సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జిసిసి) భాగస్వామ్యంతో తెలంగాణలోని గ్రామీణ కళాశాల విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించడానికి తమ ఫ్లాగ్‌షిప్ ఔట్రీచ్ కార్యక్రమాన్ని గురువారం కోకాపేట గర్ మీటింగ్ హాల్లో ప్రారంభించాయని సిటిజన్స్ ఫైనాన్స్ గ్రూప్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ ఎంటర్ప్రైజెస్ టెక్నాలజీ అండ్ సెక్యూరిటీ ఎడ్ మైకెల్ రట్లెడ్జ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలో ఇప్పటికే 4,000 మందికి పైగా విద్యార్థులు లబ్ధి పొందరని తెలిపారు. కాగ్నిజెంట్‌లో టెక్నాలజీ విభాగంలో ఉద్యోగాలు పొందిన 478 మందిలో 92 మంది మహిళలే కావడం విశేషం. అనంతరం కాగ్నిజెంట్ అమెరికా ప్రెసిడెంట్ సూర్య గుమ్మడి మాట్లాడుతూ" మా ఉద్యోగులు తమ మార్గదర్శకత్వ నైపుణ్యాలతో సమాజాలను ఉన్నత స్థితికి చేర్చడానికి,అవకాశాల మార్గాలను సృష్టించేందుకు కాగ్నిజెంట్ ఔట్రీచ్ కార్యక్రమం ఒక శక్తివంతమైనదని పేర్కొన్నారు.హైదరాబాద్‌లోని సిటిజన్స్ జీసీసీతో మాభాగస్వామ్యం ఈలక్ష్యాన్ని మరింత బలపరుస్తుంధన్నారు.



## దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుని, దోమలను అరికట్టడానికి చెరువుల చుట్టు డ్రోన్ సమాయంతో పిచికారి చేయిస్తున్నట్లు బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. గురువారం డివిజన్‌లోని హరిహరాపురం కాలనీ కాప్రాయి చెరువు పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా పిచికారి చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్ శివారు కాలనీలకు వర్షాల వలన పిచ్చిచేట్లు భారీ పెరిగిపోవడంతో దోమలు బెడద ఎక్కువగా ఉందన్నారు. దీంతో ప్రజలకు విషజ్వారాల వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకుని దోమలను అరికట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ రవీందర్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం ఏఈ కార్తీక్, కాలనీ అధ్యక్షులు శంకరయ్య గౌడ్, మురళీకృష్ణ, ఆలయ ట్రస్ట్ ఈ నారాయణరెడ్డి, ట్రెజరర్ రవీందర్ కుమార్, కాలనీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పృధ్వీ, పార్టీ నాయకులు సత్యనారాయణ, రాములు, లక్ష్మ ణ్‌రెడ్డి, రంగనాథ్ జిహెచ్‌ఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ వర్కర్స్‌కు పెండింగ్ వేతనాలు సకాలంలో చెల్లించాలి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

ప్రజాపక్షం/షాద్‌నగర్: గ్రామ పంచాయతీ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న వేతనాలను సకాలంలో చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహ్మారెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. గురువారం జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం ముందు పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ ధర్నా నిర్వహించారు. ఎంపివో హన్మంత్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టి.నర్సింహ్మారెడ్డి, బుద్దుల జంగయ్యలు మాట్లాడుతూ పండుల సీజన్ వచ్చేస్తుంది కాబట్టి పెండింగ్‌లో ఉన్న వేతనాలు సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.వీరేష్, జి.రమేష్, కారోబార్ రమేష్, యాదగిరి, తిరుమలేష్, రాము, శంకర్, పాపయ్య, జంగయ్య, చిన్నమ్మ, పార్వతమ్మ, బాలమ్మ, రాములమ్మ, సరళ, నర్సమ్మ, వెన్నచట్టి రాములు పాల్గొన్నారు.



## 15 నుంచి కోహినూర్ థియేటర్ ఫెస్టివల్



ప్రజాపక్షం /ఖైరతాబాద్ : ప్రతిష్టాత్మక కోహినూర్ థియేటర్ కార్నివల్ తెలంగాణ, జాతీయ నాటకోత్సవాలు ఈ నెల 15, 16, 17న నిర్వహించనున్నట్టు క్రియేటివ్ థియేటర్ వ్యవస్థాపకులు అజయ్ మంకెనపల్లి తెలిపారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ మూడురోజులు డప్పు, కలరీ, ఒగ్గుడోలు, పేరిణి, యాక్టింగ్ వర్క్‌షాపు, మైమ్ వర్క్‌షాప్, బాడీ మూమెంట్, రైటింగ్, కర్రసాము, లైటింగ్ డిజైనింగ్ వంటి వర్క్‌షాప్‌లు జరుగుతాయని తెలిపారు. కేరళ, కర్నాటక, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఎపి, తెలంగాణ నాటకాలు ప్రదర్శించనున్నట్టు పేర్కొన్నారు.

## విఒఎలకు రూ.20వేల వేతనమివ్వాలి



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్న విఒఎలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.20 వేలు చెల్లించాలని తెలంగాణ ఐకెపి విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ (విఒఎ) జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో కమిటీ రాష్ట్ర అధ్యక్షులు నాగుళ్ల ప్రభాకర్, కార్యదర్శి కేదావత్ శరత్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇప్ప పవన్‌కుమార్, మంత్రి మణెమ్మ, మమత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం విఒఎల సమస్యలను పరిష్కరించాలని సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. తమ డిమాండ్లపై ఈ నెల 25లోపు ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో తాజుద్దీన్, రాజేందర్, ప్రభాకర్, నారాయణ, శ్యామ్‌రావు, రజితమణి పాల్గొన్నారు.

# దొంగాటతో ప్రజలను మోసం చేస్తున్నారు

కాంగ్రెస్, బిజెపిపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శ




ప్రజాపక్షం/షాబాద్ : కాంగ్రెస్, బిజెపిలు దొంగాటలు అడుతూ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ హోంమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలోని స్టార్ గార్డెన్‌లో బిఆర్ఎస్ విస్తృతా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ హోంమత్రి సబితా ఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. షాబాద్‌లో వారికి మాజీ జడ్పిటిసి పట్నం అవినాష్‌రెడ్డి స్వాగతం పలికారు. స్టార్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ విసృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ బడుగు బలహీన వార్గాలకు బిఆర్ఎస్‌తోనే న్యాయం జరుగుతుందన్నారు. వర్షాకాల పంటలకు సరైన సమయంలో ఎరువులు పంపిణీ చేయకుండా కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు ప్రజల సొమ్మును మిగుతున్నారని వివరించారు. షాబాద్ మండలంలో బిఆర్ఎస్ హయంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేసీఆర్, కేటీఆర్‌లు నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌశిక్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ప్రభాకర్, మద్దూర్ పాండు, జడల రాజేందర్ గౌడ్, వెంకటయ్య, నక్క శ్రీనివాస్ గౌడ్, దర్శన్, దేవేందర్‌రెడ్డి. ఖాన్‌పాష, రాజు, రాజేందర్ రెడ్డి, శ్రీరాంరెడ్డి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## అటవీ శాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



**ప్రజాపక్షం/వికారాబాద్:** అటవీ శాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో అమరవీరులను స్మరించుకుంటూ వికారాబాద్ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ జిల్లాలోని ఐదు రేంజ్ ఆఫీసర్స్, సెక్షన్ ఆఫీసర్స్, బీట్ ఆఫీసర్స్ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన వివిధ సర్కిల్‌లలో మిగిలి ఉన్నటువంటి మొక్కలను కాపాడడం మనందరి బాధ్యతని, వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ రేంజ్ అధికారి శ్యాంకుమార్, ధారూర్ రేంజ్ అధికారి, తాండూర్ రేంజ్ అధికారి, పరిగి రేంజ్ అధికారి సవిత, తదితరులు పాల్గొన్నారు.

## సెల్ టవర్ నిర్మాణం వద్దు



**ప్రజాపక్షం/ఉప్పల్:** సెల్‌టవర్ల వల్ల కాలనీవాసులు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఉప్పల్‌లోని పద్మావతి కాలనీ వాసులు నూతన సెల్ టవర్ నిర్మిస్తున్న ప్రాంతంలో ధర్నా నిర్వహించారు. వివరాలలోకి వెళితే ఉప్పల్ డివిజన్‌లోని పద్మావతి కాలనీలో హైకోర్టు నుండి అను మతు లు తీసుకుని ఒక ఇంటిపై సెల్ టవర్ నిర్మాణం చేస్తున్నారని కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. ఇప్పటికే చుట్టుపక్కల రెండు సెల్ టవర్లు ఉన్నాయని, మరొకటి నిర్మాణం చేస్తున్నారని, దీని వలన చుట్టు పక్క ప్రాంతాల వారికి అధిక రేడియేషన్ వలన క్యాన్సర్ బారిన పడుతున్నారని, పలువురు అనేక రోగాలతో మృత్యువాత పడ్డారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా సెల్ టవర్‌ని తొలగించాలని డిమాండ్ చేశారు.



## రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని వినతి

### ఎసిపితో ఫోన్‌లో మాట్లాడిన ఎంపి ఈటల

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుకుండా తగిన చర్యలు తీసుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పేట్ బషీరాబాద్ ఎసిపికి మొబైల్ ఫోన్‌లో సూచించారు. గురువారం శామీర్‌పేట బిజెపి నాయకులు, కార్యకర్తలు మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో కలిసి రాజీవ్ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై వివరించారు. ఈ సందర్భంగా ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ శామీర్‌పేటలోని ప్రధాన చౌరస్తాలైన నల్సార్ యూనివర్శిటి చౌరస్తా, ఆరెంజ్ బౌల్, అలియాబాద్ చౌరస్తాల్లో ప్రమాదాలు జరుగకుండా అవసరమైన ఏర్పాట్లను చేయాలని ఎసిపికి వివరించారు. కావాల్సిన నిధులను మంజూరు చేస్తానని శామీర్‌పేట బిజెపి నాయకులకు, గ్రామస్థులకు భరోసానిచ్చారు. అలాగే తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతిని కలిసిన బిజెపి నాయకులు రాజీవ్ రహదారిలోని మూలమలుపుల్లో ప్రమాదాలు జరుగకుండా రేడియం స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్స్, బారీకేడ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శివ, పవన్‌కుమార్‌గౌడ్, శ్రీకాంత్, విష్ణు, కిరన్, తదితరులు పాల్గొన్నారు.



## నవసమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు మూలస్తంభం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** నవసమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు మూల స్తంభం లాంటి వారని జిల్లా ఆర్‌టిఎ మెంబర్, తూంకుంట మున్సిపాలిటి కాంగ్రెస్ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం తూంకుంట మున్సిపాలిటి దేవరయాంజాల్‌లోని ప్రభుత్వ ప్రాధమిక పాఠశాలలో గురు పూజోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉపాధ్యాయులను గౌరవించి సన్మానాలు చేయడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. విద్యార్థులను సన్మార్గంలో తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని చెప్పారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు, ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు ఉపాధ్యాయులు బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నాలుక లక్ష్మీనారాయణ, శ్రీ సీతారామస్వామి దేవస్థానం చైర్మన్ పెండెం లక్ష్మీనారాయణ,(నాని), మాజీ ధర్మకర్త పట్నం నర్సింహారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్యాణి, ఉపాధ్యాయులు రవీందర్, లలిత, తదితరులు పాల్గొన్నారు.



## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించొద్దు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** రాష్ట్ర ప్రభుత్వం సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పేరిట జిల్లాలోని కాప్రా, ఉప్పల్, నారపల్లి, మల్కాజిగిరి, ఘట్‌కేసర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మల్కాజిగిరి దస్తావేజు లేఖకుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. తమ వినతిని ప్రభుత్వ దృష్టికి తీసుకొని వెళ్లే లక్ష్యంగా తామంతా శుక్రవారం స్వచ్ఛంధంగా దస్తావేజు దుకాణాలను మూసివేయనున్నామని సంఘం మల్కాజిగిరి అధ్యక్షుడు వి.లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నరేష్ బాబులు తెలిపారు. వేర్వేరు ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఒకే కార్యాలయంలో కొనసాగించటం వల్ల ఇతర ప్రాంతాల వారికి దూరాభారం, అనవసర వ్యయప్రయాసలకు గురవుతారన్నారు. మల్కాజిగిరి ప్రాంతంలో ఇప్పటికే సొంత భవనంలో గత ఎనిమిదేళ్ల నుండి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కొనసాగుతోందని, దీన్ని మరో ప్రాంతానికి తరలించటం సరైన నిర్ణయం కాదన్నారు.



## రాష్ట్ర మార్కెట్ కమిటీ చైర్మన్‌ల ఫోరం ప్రధాన కార్యదర్శి నర్సింహయాదవ్‌కు సన్మానం

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహ యాదవ్ రాష్ట్ర మార్కెట్ కమిటి చైర్మన్‌ల ఫోరం ప్రధాన కార్యదర్శి పదవి వరించడంతో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి కేశవరం అంబేద్కర్ సంఘం గ్రామశాఖ అద్యక్షుడు సాయికుమార్ సంఘం సభ్యులతో కలిసి మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మార్కెట్ కమిటి చైర్మన్‌ల ఫోరానికి ప్రధాన కార్యదర్శిగా బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ ఎన్నిక కావడం గొప్ప విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మధు, రాజు, బొగ్గుల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# మ్యాన్‌హోల్‌లో పడిన బాలిక

### స్థానికుల చాకచక్యంతో తప్పిన ప్రాణాపాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చార్మినార్ జోన్ పరిధిలోని రైన్ బజార్ డివిజన్‌లో ఉదయం 8 గంటల ప్రాంతంలో ఓ ఐదేళ్ల బాలిక ఓపెన్ మ్యాన్‌హోల్‌లో పడిపోయిన ఘటన కలకలం రేపింది. మూలాకా చిల్లాలో నివసిస్తున్న ఈ బాలిక పాఠశాలకు వెళ్తుండగా, ఓపెన్ మ్యాన్‌హోల్‌లో పడిపోయింది. అయితే, సమీపంలోని స్థానికులు, వెళ్లిపోయే పాదచారులు వెంటనే స్పందించి, బాలికను బయటకు తీశారు. ఈ ఘటనలో బాలిక ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడింది.

ఈ విషయం తెలుసుకున్న వెంటనే జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ (సర్కిల్7 సంతోష్ నగర్), డివిజన్ 7కు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంఘటనా స్థలానికి చేరుకుని, బాలిక ఇంటిని సందర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విచారణలో భాగంగా హైడ్రా బృందం మ్యాన్‌హోల్‌ను శుభ్రపరిచే పనుల నిమిత్తం కవర్ తీసినట్లు, అయితే తిరిగి కవర్ పెట్టకుండా అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు గుర్తించారు.

**శాఖల మధ్య వివాదంగా సంఘటన..**

పాతబస్తీలో మ్యాన్‌హోల్ మూతలో చిన్నారి పడిపోయిన ఘటన శాఖల మధ్య వివాదస్పందంగా మారింది. మ్యాన్‌హోల్ తెరవడం వివాదస్పందమైంది. హైడ్రా సిబ్బంది మ్యాన్‌హోల్ శుభ్రం చేసేందుకు కవర్ తీసినట్లు గుర్తించారు. హైడ్రా, జిహెచ్ఎంసి, జలమండలిలు మ్యాన్‌హోల్ తమ సిబ్బంది తెరవలేదని ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటున్నారు. దీంతో ఈ సంఘటనపై మున్సిపల్ శాఖ స్పందించింది.

సంభవించిన లోపంపై బాధ్యతను ఒకరిపై మరొకరు నెట్టకుండా, స్పష్టం గా ఎవరి తప్పో వారిపైనే బాధ్యత నిర్ధారించాలంటూ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మునిసిపల్ పరిపాలన శాఖ ఆధ్వర్యంలోని అన్ని విభాగాలు తమ తమ పాత్రపై స్పష్టత తో ఉండాలని అధికారులకు సూచనలు అందా యి. జిహెచ్ఎంసి కమిషనర్ శుక్రవారం ఫీల్డ్ సిబ్బందితో కలిసి సమవేశం నిర్వహించాలని కోరగా, కమిషనర్ వెంటనే అంగీకరించారు. ఈ సమావేశంలో అన్ని సంబంధిత విభాగాలు పాల్గొననున్నాయి. ఎలాంటి లోపం జరిగిందో స్పష్టం గా గుర్తించి, దానికి బాధ్యులైన అధికారుల పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**పాతబస్తీ ఘటనను తీవ్రంగా పరిగణించిన హైడ్రా**

పాతబస్తీలో మ్యాన్ హోల్‌లో పడిపోయిన చిన్నారికి ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో హైడ్రా ఊపిరి పీల్చుకుంది. కాని ఈ ఘటనను తీవ్రంగా పరిగణించింది. ఇందుకు గల కారణాలను తెలుసుకునే పనిలో నిమగ్నమైంది. బాధ్యులు ఎవరనే దానిపై ప్రాథమికంగా వెంటనే దర్యాప్తు చేసింది.

చిన్నారి పడిపోయిన దృశ్యాన్ని అక్కడి సిసిటివి ఫుటేజీను తెప్పించుకుని పరిశీలిస్తోంది. స్థానికంగా పని చేస్తున్న హైడ్రా, జలమండలి, జిహెచ్ఎంసి విభాగాలతో శుక్రవారం సమావేశాన్ని కూడా ఏర్పాటు చేసింది.

## పలు భవనాలు సీజ్

### ఫిర్యాదులు వస్తేనే చర్యలు





**ప్రజాపక్షం/ఉప్పల్ :** పలు అక్రమ నిర్మాణాలపై పలువురు పలుమార్లు కోర్టును ఆశ్రయించి అక్రమ నిర్మాణాలపై పిటిషన్‌లు వేయడంతో కోర్టు ఆదేశాలతో ఉప్పల్ సర్కిల్ మున్సిపల్ అధికారులు పలు భవన నిర్మణాలను, షెడ్లను సీజ్ చేశారు. వివరాలలోకి వెళితే గురువారం ఉప్పల్ సర్కిల్ డీసీ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక ఏసీపీ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళిక సూపర్వైజర్ తుల్జా సింగ్, పట్టణ ప్రణాళిక సిబ్బంది, ఉప్పల్ పోలీస్ సిబ్బందితో కలసి ఉప్పల్ బాగాయత్ లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేసిన భగరా వాల హోటల్, బాలాజీ గ్రానైట్ పేరుతో వెలసిన భారీ షెడ్డు లను సీజ్ చేశారు. రామంతాపూర్ డివిజన్ లోని శారదా నగర్ లో నిర్మాణంలో ఉన్న భవనం అనుమతి లేకుండా అదనపు అంతస్తుల నిర్మాణం చేపడుతున్న సందర్భంగా ఆయా భవనంను కూడా మున్సిపల్ యాక్ట్ కు లోబడి సీజ్ చేసినట్లు అలాగే ఉప్పల్ సర్కిల్‌లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఎవరైనా ఫిర్యాదులు చేస్తేనే ఆయా నిర్మాణాల పై చర్యలు తీసుకుంటున్నారు. తప్ప మున్సిపల్ యాక్ట్ 2019, జిఒ నంబర్ ఎంఎస్ 168 ప్రకా రం నిర్మాణాలు చేపట్టడం లేదు అని ప్రతి నిర్మాణం అదనపు అంతస్తులతో నిర్మాణం చేస్తున్న మున్సిపల్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపణలు చేస్తున్నారు.



## ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులకు హెచ్‌సిఎల్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఐటి/డిపిఓ పోస్టుల భర్తీ కోసం ఈ నెల 13న కూకట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కిషన్, సంస్థ ఇన్‌చార్జి రాఘవేంద్రలు పేర్కొన్నారు. ఎంపిసి, బిపిసి, హెచ్ఇసి, సిఇసి, వొకేషనల్ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు పది, ఇంటర్ విద్యార్థతల సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో పాటు ఒక ఫోటో తీసుకొని హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం హెచ్‌సిఎల్ ప్రతినిధి రాఘవేంద్రను 9063564875, 7981834205, 7674007616 ఫోన్లను సంప్రదించవచ్చన్నారు.

## 17న విరాట్ విశ్వబ్రాహ్మణ సంఘ యజ్ఞ మహోత్సవం

**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమ్యూనిటి హాలులో ఈ నెల 17న శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సంఘం జెఎసి ఆధ్వర్యంలో యజ్ఞ మహోత్సవం జరుగనుందని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శ్రీరాములుచారి, జెఎసి అధ్యక్షుడు సోమాచారి, ప్రధాన కార్యదర్శి కెకె చారి, ఉపాధ్యక్షులు పుల్లయ్యచారి, నరసింహచారి, యజ్ఞ కమిటి అధ్యక్షుడు వెంకటరమణాచారిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి రావాలంటూ మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నలను ఆహ్వానించారు.

## మహిళలు అన్ని రంగాలలో స్వశక్తితో ఎదగాలి

### ఎమ్మెల్యే మాధవరం

**కూకట్‌పల్లి/ప్రజాపక్షం :** మారుతున్న సమాజానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాలలో స్వశక్తితో ఎదగాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం బేగంపేట డివిజన్ మాతాజీ నగర్‌లో వందమంది మహిళలకు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మె ల్సీ సురభి వాణిదేవితో కలిసి కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తమవంతు సహాయంగా శిక్షణ ఇప్పించి, తమ సొంత నిధులతో కుట్టు మిషన్లు అందించడం జరుగుతందన్నారు. నియోజకవర్గంలో ఇప్పిటికే 2వేల మందికిపైగా శిక్షణ ఇప్పించి, కుట్టు మిషన్లు అందించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న ఖార్డ్ సంస్థ అధినేత సుమన్ మంజులత దంపతులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు.



అనంతరం ఎమ్మెల్సీ సురభి వాణిదేవి మాట్లాడుతూ మహిళలు తమ సొంత కాళ్లపై నిలబడి ఆర్థిక అభివృద్ధి సాధించే దిశగా కృషి చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుని, ఖార్డ్ సంస్థ అధినేతలు మంజులత దంపతుల్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, డివిజన్ అధ్యక్షులు సురేష్ యాదవ్, జనరల్ సెక్రటరీ నరేష్, మహిళ ప్రెసిడెంట్ సునీత, సీనియర్ నాయకులు గంగారం లు పాల్గొన్నారు.

## వాగులో గల్లంతైన రైతు

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో వర్షం దంచి కొట్టింది. బుధవారం రాత్రి నుండి గురువారం వరకు కురిసిన భారీ వర్షానికి తాండూరు ప్రాంతంలోని పలు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. తాండూరు పట్టణ శివారులో క్నాగా వాగు నిండు కుండలా పారుతుంది. పొలాలకు వెళ్ళిన రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురైనారు. వాగు దాటేందుకు ప్రయత్నించిన మొగులప్ప అనే రైతు సంగెంకాలన్ వాగులో గల్లంతైనట్లు పలువురు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంఎల్‌ఏ అధికారులను అప్రమత్తం చేసిన గల్లంతైన వ్యక్తి ఆచూకి కోసం గాలింపు చర్యలు మమ్మురం చేయించారు.

## లైసెన్స్‌డ్ సర్వేయర్ల సప్లిమెంటరీ పరీక్ష సజావుగా నిర్వహించాలి

### అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** లైసున్సుడ్ సర్వేయర్ల సప్లిమెంటరీ పరీక్షను సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులను అదేశించిన అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ,ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గురువరం 14న నిర్వహిం చే లైసెన్సూడ్ సర్వేయర్ల సప్లిమెంటరీ పరీక్ష నిర్వహణకు సంబందించి అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. థియరీ పరీక్ష ఉదయం 10గంటల నుండి 1గంట వరకు, ప్లాటింగ్ పరీక్ష మధ్యాహ్నం 2గంటలవరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సర్వేయర్లు పరక్షలో ఉతీర్ణత సాధించిన 76మంది థియరీ అభ్యార్థులు,92మంది ప్లాటింగ్ అభ్యర్థుల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరీక్షలు నిర్వహణలో ఎటువంటి కాపీయింగ్ లేకుండా చూసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రా ల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు,మొబైల్ ఫోన్ల ను అనుమతించకుడదని తెలిపారు. పరీక్ష ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ల్యాండ్ రికార్డ్స్ అధికారి రామిరెడ్డి , సత్తార్ , లలితాకుమారి ,రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆహార భద్రతా చట్టం కచ్చితంగా అమలు

### రాష్ట్ర ఆహార భద్రతా కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి





**ప్రజాపక్షం/వికారాబాద్:** ప్రజల హక్కులను కాపాడవలసిన బాధ్యత మన అందరిపై ఉందని అహర భద్రతా చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర ఆహార భద్రతా కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఆహార భద్రత చట్టం 2013 అమలుపై శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు భారతి, శారద, ఆనంద్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార భద్రతా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ ఆహార భద్రత చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. హక్కుదారులకు ఎలాంటి భంగం కలగకుండా న్యాయం చేకుర్చే విధంగా కమిషన్ పనిచేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల చౌక ధర దుకాణాల ద్వారా అందిస్తున్న సన్నబియ్యం తూనికల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. చౌక ధరల దుకణాల వద్ద ఫిర్యాదుల పట్టిక, అధికారుల ఫోన్ నెంబర్లను, పనిచేసే వేళలను సూచించే విధంగా ప్లెక్సీలు ప్రదర్శించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్వాడీలలో మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని అదేవిధంగా రోజువారి మెను పట్టికను ప్రదర్శింపజేయాలని తెలిపారు. విద్యానిఘా కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. పౌష్టిక ఆహారం తినే హక్కు రాజ్యాంగం కల్పించదని ,అధికారుల క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీలు చేపట్టాని చైర్మన్ సూచించారు. ప్రతి అధికారి అంకిత భావంతో పనిచేసే ఆహార భద్రతను చట్టంపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అంగన్వాడీలలో మాతా శిశువులకు పౌష్టిక ఆహారాన్ని కచ్చితంగా అందించే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కమిషన్ చైర్మన్ తెలిపారు. చిన్నచిన్న పొరపాట్లను సరిదిద్దుకొని అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , సుధీర్ , ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్ చౌదరి , డిఆర్ఓ మంగీలాల్ , ఆర్‌డిఓ వాసుచంద్ర ,డిఆర్‌డిఓ శ్రీనివాస్ , పౌరసరఫరల అధికారితదితరులు పాల్గొన్నారు.



## క్యాబ్ అండ్ స్కూల్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు

### ఎఐటియుసి అధ్యక్షుడు యూసుఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** క్యాబ్ అండ్ స్కూల్ ట్రాన్స్‌ఫోర్ట్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ పేర్కొన్నారు. గురువారం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని పొట్లూరి నాగేశ్వర్‌రావు భవన్ కార్యాలయంలో ట్రాన్స్‌పోర్ట్ రంగా నికి సంబంధించిన స్కూల్, క్యాబ్ డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రవీణ్ అధ్య క్షత వహించగా, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు కామ్రెడ్ యూసుఫ్, సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1920లో ఎఐటియుసిని స్థాపిం చడం జరిగిందని, నాటి నుండి నేటివరకు కార్మికుల పక్షాన కార్మిక హక్కుల సాధనకై నిరంతరం పోరాడే ఏకైక సంఘం ఎఐటియుసి అని అన్నారు. నగరంలో క్యాబ్ డ్రైవర్లు స్కూల్, కాలేజీల పిల్లల రవాణాకి బండ్లు పెట్టి నడుపు తున్న డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారి హక్కుల సాధనకై నిరంతరం అండగా ఎఐటియుసి అండగా ఉంటుందని తెలిపారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు అందరికీ మిగిలిన అసంఘటిత కార్మికులతో కలిపి సంక్షేమ బోర్డు ను ఏర్పాటు చేయాలని, ఆ బోర్డు ద్వారా సంక్షే మ పథకాలైన ఇన్సూరెన్స్, వైద్య సదుపాయాలు, డ్రైవర్ల పిల్లల చదువులకు ఫీజులు, ఇండ్లులేని వారికి ఇంటి సౌకర్యం, 60సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్లు అమలయ్యే విధంగా బోర్డు ఉండాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ల కనీస వేతనం రూ.36000గా జిఒ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ప్రవీణ్, అధ్యక్షునిగా శ్రీరామ్ శ్రీనివాస్ చారి, ఉపాధ్యక్షునిగా మేకల శ్రీనివాస్, కార్యదర్శిగా మురళి, సహాయ కార్యదర్శిగా పెంటా రెడ్డి, కోశాధికారిగా గోవర్ధన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్‌రావు, కమిటీ సభ్యులుగా ఏడుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, మండల అధ్యక్షులు హరినాథ్‌రావు, నాయకులు దుర్గయ్య, బాబు; తదితరులు పాల్గొ న్నారు.



## నాణ్యతలో రాజీపడే ప్రసక్తేలేదు : కార్పొరేటర్

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** స్థానికంగా చేపట్టే కమ్యూనిటీ మరమ్మతు పనులలో నాణ్యతలో రాజీపడే ప్రసక్తేలేదని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. గురువారం శాస్త్రీనగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ మరమ్మతు పనులను రూ.30లక్షల వ్యయంతో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ వాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో కమ్యూనిటీ మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ కమ్యూనిటీ పూర్తి అయితే బస్తీవాసులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏ కార్యక్రమమైనా నిర్వహించుకునేలా, అందరికి అందుబాటులో ఉండే విధంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని బస్తీవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కుతాడి రాములు, శివశంకర్‌గౌడ్, సాగర్‌కృష్ణ, బద్రి శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## తురక కాశల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రాయి కొట్టుకుని జీవించే తుర్క కాశల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం మూడుచింతలపల్లికి చెందిన తుర్క కాశ సంఘం నాయకులు ఎమ్మెల్యే మల్లారెడ్డిని ఆయన నివాసంలో కలిసి తుర్కకాశల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తుర్క కాశ సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు షేక్ మౌలాన మాట్లాడుతూ 45 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడికి కార్మిక పెన్షన్‌తో పాటు కార్మిక బంధు రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు. కార్మికుడికి రాయికొట్టే పనిలో ఏదైన ప్రమాదం జరిగితే మెడికల్ ఖర్చులతో పాటు వారి కుటుంబానికి ఆర్థిక తోడ్పాటునందించాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో ఉన్న రాయి గుట్టలను తుర్క కాశ సంఘం సోసైటికి ఇవ్వాలని వివరించారు. అనంతరం ఎంఎల్ఎ మల్లారెడ్డి మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తుర్క కాశల సమస్యలు, కార్మికుల సమస్యలపై సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ జాం రవి, మాజి వార్డు సభ్యులు బురుగు యాదగిరి, నాయకులు భూపాల్‌రెడ్డి, పాల రాములు, తుర్క కాశ సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## మహిళల అక్షరాస్యతే ఉల్లాస్ లక్ష్యం

**ప్రజాపక్షం/పరిగి:** మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యం అని టాస్ స్టే కోఆర్డినేటర్ అనురాధ అన్నారు. మహిళా సంఘాలలో ఉన్న నిరక్షరాశ్యులయిన 15సంవత్సరాల దాటిన మహిళలు అందరినీ అక్షరాసలుగా మార్చడమే ఉల్లాస లక్ష్యమని టాస్ స్టేట్ కో ఆర్డినేటర్ అనురాధ తెలియజేశారు. వికారాబాద్ జిల్లా అడల్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ బాబు మాట్లాడుతూ మహిళలు అక్షరాసులు ,కుటుంబాలు సామాజికంగా , ఆర్థికంగా చెందుతాయని మహిళల అభివృద్ధి దేశభివృద్ధి అని తెలియ జేశారు. ఉల్లాస్ కార్యక్రమం యొక్క ఆర్పీలుగా వ్యవహరించిన ఎండి ఉస్మాన్ అలీ వెంకట ప్రసాద్ గ్రామాలలో నిరక్షరాస్యులైన మహిళలను ఏ విధంగా చైతన్యవంతులుగా చేయాలి, విద్యాభోదన ఎలా చేయాలి, చదివించడం రాయించడం, అనే విషయాలను చక్కగా వివరించారు,



# క్రీడ



## భారీ స్కోర్ బాదిన హాంకాంగ్

### బంగ్లా బౌలర్లను ఉతికేసిన నిజాకత్, ముర్తాజా..

ఆసియా కప్ రెండో మ్యాచ్‌లో హాంకాంగ్ బ్యాటర్లు చెలరేగారు. తామూ దంచికొట్టగలమని నిరూపిస్తూ బంగ్లాదేశ్ బౌలర్లకు చుక్కలు చూపించి జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించారు. ఓపెనర్ జీషన్ అలీ(30) శుభారంభం ఇవ్వగా.. మిడిల్ ఓవర్లలో యాసీం ముర్తాజా(28), నిజాకత్ ఖాన్(42) దూకుడుగా ఆడారు. డెత్ ఓవర్లలో నిజాకత్ సిక్సర్‌తో జట్టు స్కోర్ 130 దాటించాడు. అతడు ఔటయ్యాక.. వరుసగా వికెట్లు కోల్పోయింది హాంకాంగ్. నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి143 రన్స్ చేసింది. ఆసియా కప్ ఆరంభ పోరులో అఫ్గనిస్థాన్ చేతిలో దారుణ ఓటమి నుంచి తేరుకున్న హాంకాంగ్ బ్యాటర్లు దంచేశారు. బలమైన బంగ్లాదేశ్ బౌలింగ్ దళానికి చుక్కలు చూపించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన జట్టుకు శుభారంభం లభించలేదు. ఓపెనర్ అన్షుమన్ రథ్ (4)ను ఔట్ చేసి తస్కిన్ బ్రేకిచ్చాడు. ఆ తర్వాత జీషన్ అలీ(30), బాబర్ హయత్ (14) రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. దాంతో.. స్కోర్ వేగం అందుకుంది. కానీ.. జీషన్‌ను బౌల్డ్ చేసిన తంజిమ్ రెండో వికెట్ అందించాడు. అనంతరం కెప్టెన్ యసీం ముర్తాజా(28)తో కలిసి నిజాకత్ ఖాన్(42) దూకుడుగా ఆడాడు. బంగ్లా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న ఈ ద్వయం నాలుగో వికెట్‌కు 46 రన్స్ జోడించింది. ప్రమాదకరంగా మారిన ఈ జోడీ రనౌట్ అయ్యాడు. అప్పటికీ స్కోర్.. 117/4. రిషద్ హొసేన్ ఓవర్లో సిక్సర్‌తో జట్టు స్కోర్ 130 దాటించిన నిజాకత్ మరో షాట్‌కు యత్నించి వెనుదిరిగాడు. ఆ తర్వాత బంతికే కించిత్ షా డకౌట్ అయ్యాడు. ఆఖరి ఓవర్లో 9 రన్స్ రావడంతో ప్రత్యర్థికి 143 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది హాంకాంగ్.

## జైపూర్‌లో కబడ్డీ కూత..

### సొంతగడ్డపై చెలరేగనున్న పాంథర్స్..!

ఐపిఎల్ తరహా క్రేజ్‌తో అభిమానులను అలరిస్తున్న ప్రో కబడ్డీ లీగ్ జైపూర్‌కు తరలివెళ్లింది. పన్నెండో సీజన్ తొలి దశ మ్యాచ్‌లకు వైజాగ్ ఆతిథ్యమివ్వగా రెండో దశ మ్యాచ్‌లు 'పింక్ సిటీ'లో జరుగనున్నాయి. రెండుసార్లు ఛాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌కు ఇది హోమ్ గ్రౌండ్ సెప్టెంబర్ 12 నుంచి సెప్టెంబర్ 27వ తేదీ వరకూఅక్కడి కబడ్డీ ఫ్యాన్స్‌కు రైడర్లు, డిఫెండర్లు పూనకాలు తెప్పించనున్నారు. కబడ్డీ అంటే పడిచచ్చే సొంత ప్రేక్షకుల సమక్షంలో చెలరేగి పోవాలని నితిన్ రావల్ సారథ్యంలోని జైపూర్ టీమ్ భావిస్తోంది. ప్రో కబడ్డీ లీగ్‌కు దేశవ్యాప్తంగా ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అందుకే.. పలు నగరాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు నిర్వాహకులు. పికెఎల్ 12వ సీజన్ ఆగస్టు 29న ప్రారంభమైంది. సెప్టెంబర్ 11 వరకూ మ్యాచ్‌లు జరిగాయి. ప్రస్తుతానికి నాలుగింటా రెండు విజయాలతో వెనుకబడిన జైపూర్ పింక్ పాంథర్స్ ఇక సొంతగడ్డపై చెలరేగిపోనుంది. నేడు జరుగబోయే తొలి మ్యాచ్‌లో జైపూర్ జట్టు సమఉజ్జీ అయిన బెంగళూరు బుల్స్‌తో ఆడనుంది. రెండో గేమ్‌లో తమిళ్ తలైవాస్‌ను బెంగాల్ వారియర్స్ ఢీకొట్టనుంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో పుణెరి పల్టన్, దబాంగ్ ఢిల్లీ జట్లు నాలుగేసి విజయాలతో టాప్2లో నిలిచాయి. జైపూర్ విషయానికొస్తే ఆరంభ సీజన్‌లో.. ఆపై తొమ్మిదో సీజన్‌లో పికెఎల్ టైటిల్ కొల్లగొట్టిన విషయం తెలిసిందే. అనంతరం మూడో దశ మ్యాచ్‌లకు చెన్నై వేదిక కానుంది. నాలుగో దఫా కబడ్డీ కూత ఢిల్లీలోని త్యాగరాజ్ ఇండోర్ స్టేడియంలో వినిపించనుంది.



## ప్రపంచకప్‌లో మహిళలకు పట్టం..

### రిఫరీలు, అంపైర్ల బృందంలో అందరూ అతివలే..!

ఐసిసి మహిళల వన్డే వరల్డ్ కప్ టోర్నీ చరిత్రలోనే తొలిసారి పూర్తిస్థాయిలో మహిళలతో ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత మహిళల టీ20 వరల్డ్ కప్, 2022 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ ఇలా మహిళా అంపైర్లు, రిఫరీలను ఐసిసి నియమించింది. అయితే వరల్డ్ కప్‌లో మాత్రం ఇదే మొదటి సారి. ఐసిసి మహిళల వన్డే వరల్డ్ కప్ సెప్టెంబర్ 30 నుంచి భారత్, శ్రీలంక ఉమ్మడి ఆతిథ్యంలో జరగనుంది. ప్యానల్లో 14 మంది అంపైర్లు, నలుగురు మ్యాచ్ రెఫరీలు తమ సేవలందించనున్నారు. మహిళా అంపైర్లలో.. చాలామంది క్రికెట్ అభిమానులకు సుపరిచతమైన వారే ఉన్నారు. క్లైర్ పోలోసాక్, జాక్వెలిన్ విలియమ్స్, స్యూ రెడ్‌ఫెర్న్‌కు ఇది మూడో మహిళల ప్రపంచ కప్. అలాగే.. లారెన్ అగెన్బాగ్, కిమ్ కాటన్‌కు ఇది రెండో టోర్నీ. మ్యాచ్ రెఫరీ ప్యానల్.. అనుభవజ్ఞులు, కొత్తవారితో సమతూకంగా ఉంది. ట్రూడీ ఆండర్సన్, షాంద్రే ఫ్రిట్జ్, జీఎస్ లక్ష్మి, మిచెల్ పెరీరా ఈ ప్యానల్లో సభ్యులుగా ఉన్నారు. పూర్తిగా మహిళా అంపైర్లు, మ్యాచ్ రెఫరీలతో మెగా టోర్నీ నిర్వహించనుండటాన్ని చరిత్రాత్మకమైన మార్పుగా ఐసిసి చైర్మన్ జైషా కొనియాడారు. ' ఇది మహిళల క్రికెట్ ప్రయాణంలో ఒక అద్భుత ఘట్టాన్ని సూచిస్తోంది. ఈ ముందడుగు కొత్త ఒరవడికి మార్గం సుగమం చేస్తుందని మేం ఆశిస్తున్నాం. పూర్తిగా మహిళలతో కూడిన ప్యానెల్ను ఏర్పాటు చేయడం కేవలం మైలురాయి మాత్రమే కాదు. క్రికెట్లో స్త్రీ పురుష సమానత్వాన్ని పెంపొందించడానికి ఐసీసీ చూపుతున్న నిబద్ధతకు ప్రతిబింబం' అని జైషా పేర్కొన్నారు.



## ఫోకస్

## చివరి దశ హక్కులు..



జీవితంలో అన్ని దశలను దాటుకొని, చివరిదైన వృద్ధాప్యంలోకి అడుగుపెట్టిన వారిలో అత్యధిక శాతం మంది ఆత్మనూన్యతతో, అభద్రాభావంతో బతుకుతున్నారన్నది చేదు నిజం. అందుకే, జీవితంలో చివరగా వచ్చే వృద్ధాప్యాన్ని అత్యంత సంక్లిష్టమైనదిగా పేర్కొంటారు. వృద్ధాప్యంలో శారీరక శక్తి, మానసిక స్థితి, ఆర్థిక స్థిరత్వం తగ్గిపోతాయి. ఈ పరిస్థితిలో వృద్ధులు సమాజం నుండి ఎక్కువ మద్దతు, గౌరవం, రక్షణ కోరుకుంటారు. దురదృష్టవశాత్తు ఆధునిక కాలంలో వృద్ధుల హక్కులు చాలా వరకు నిరక్ష్యానికి గురవుతున్నాయి. ఇది కేవలం భారతదేశ సమస్య కాదు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధులు వివిధ రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అందుకే ఐక్యరాజ్యసమితి 1991లోనే వృద్ధుల హక్కులను ప్రత్యేకంగా గుర్తించింది. భారతదేశం కూడా చట్టపరంగా, పథకాల రూపంలో కొన్ని చర్యలు తీసుకుంటున్నా, వాస్తవ జీవితంలో అమలులో సమస్యలు చాలా ఉన్నాయి. భారతీయ సాంప్రదాయంలో వృద్ధులను గౌరవించడమే ముఖ్య ధర్మంగా పేర్కొంటారు. మాతృ దేవోభవ, పితృ దేవోభవ అనే వాక్యం వృద్ధుల స్థానం ఎంత ఉన్నతమో చూపుతుంది. సంస్కృత సాహిత్యంలో వృద్ధులను జ్ఞానభాండాగారంగా కీర్తించారు. కుటుంబ పెద్దల మాటలే ఆఖరి నిర్ణయమని భావించే సంస్కృతి మనకుంది. కానీ, వలసరాజ్యాల కాలంలో పట్టణీకరణ, ఆధునికీకరణ, అణుయుక్త కుటుంబ వ్యవస్థ కారణంగా వృద్ధుల స్థానం క్రమంగా క్షీణించింది. గ్రామీణ సంస్కృతిలో ఇప్పటికీ వృద్ధులకు గౌరవం ఉన్నప్పటికీ, పట్టణాల్లో వారిని భారంగా చూడటం పెరిగింది. కాగా, జనాభా గణాంకాలు: 2021 జనగణన అంచనాల ప్రకారం భారతదేశంలో 60 ఏళ్లు పైబడిన వారు 138 మిలియన్లు. 2050 నాటికి ఇది 300 మిలియన్లకు పైగా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆర్థికపరమైన అంశాలను పరిశీలిస్తే, వృద్ధులలో ఎక్కువ మందికి స్థిరమైన ఆదాయం లేదన్నది స్పష్టమవుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పెన్షన్ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం లేదన్న విమర్శలున్నాయి. డబ్బు సమస్యకు జబ్బు సమస్య కూడా తోడుకావడంతో, వృద్ధుల పరిస్థితి మరింత దారుణంగా మారుతున్నది. షుగర్, రక్తపోటు, గుండె జబ్బులు, అల్జీమర్స్ వంటి వ్యాధులు వృద్ధులలో ఎక్కువ. వైద్య సదుపాయాలు, సౌకర్యాలు చాలా తక్కువ. సామాజిక సమస్యలు కూడా వృద్ధులను పీడిస్తుంటాయి. ముఖ్యంగా ఒంటరితనం, కుటుంబ నిర్లక్ష్యం, మానసిక వేధింపులు విస్తృతంగా కనిపిస్తున్నాయి. ఈ సమస్యల పట్ల సమాజమే స్పందించాలి. వృద్ధాప్యం అనేది జీవితంలో ఒక భాగమేనన్న విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలి. వారి పట్ల గౌరవమర్యాదలతో నడుచుకోవాలి. ఆప్యాయతను ప్రదర్శించాలి. అయితే, సమాజంలో ఇలాంటి వాతావరణం ఎక్కువగా కనిపించడం లేదు కాబట్టే, వృద్ధులకు కొన్ని రకాల హక్కులను కల్పించారు. వాటిలో ప్రధానంగా ఆర్థిక హక్కులను పేర్కోవాలి. వృద్ధాప్యంలో జీవనాధారంగా ఉండేది ఆర్థిక భద్రత. ఇందుకోసం పెన్షన్, వృద్ధాప్య భృతి వంటి సౌకర్యాలు ఉన్నాయి. సామాజిక భద్రత కింద ప్రయాణం, వైద్య సేవల్లో వృద్ధులకు ప్రత్యేక రాయితీలు లభిస్తాయి. చాలా ప్రాంతాల్లో వృద్ధులకు ఉచిత లేదా తక్కువ ధరలో వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. ప్రత్యేక జెరియాట్రిక్ వార్డుల సౌకర్యం లభిస్తుంది. వృద్ధులకు గౌరవంతో జీవించే హక్కు, కుటుంబ సభ్యుల నుండి గౌరవం పొందే హక్కు, ఆస్తి లేదా ఇతరత్రా అంశాలపై వేధింపులు లేకుండా జీవించే హక్కు, సమాజంలో భాగస్వామ్యమయ్యే హక్కు ఉంటాయి. అదే రీతిలో కొన్ని ప్రత్యేక చట్టపరమైన హక్కులు కూడా వృద్ధులకు ఉన్నాయి. ఉదాహరణకు వృద్ధులపై హింస, నిర్లక్ష్యం నివారణ చట్టం. వారసత్వ హక్కుల రక్షణ చట్టం వారికి అన్ని విధాలా రక్షణ కల్పిస్తుంది. 'మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్, 2007' ప్రకారం తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత పిల్లలపై ఉంది. దీనిని నిర్లక్ష్యం చేసిన వారు శిక్షార్హులవుతారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 41 ప్రకారం వృద్ధులకు ప్రజా సహాయం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. పిల్లలు లేదా వారసులు వృద్ధులను పోషించాలి. వృద్ధుల కోసం ప్రభుత్వాలు వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలి. 1999–2011 సంవత్సరాల్లో వృద్ధుల పట్ల వ్యవహరించాల్సిన తీరుపై జాతీయ విధానాలను ప్రకటించారు. ఏదిఏమైనా, జీవితాంతం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, వృద్ధాప్యంలోకి అడుగుపెట్టిన వారికి, చివరి పర్వం ప్రశాంతంగా ముగిస్తే, అదే సమాజం వారికి ఇచ్చే గౌరవం. ఆత్మీయ బహుమానం.

వృద్ధుల కోసం ప్రత్యేక జెరియాట్రిక్ హాస్పిటల్స్ ఏర్పాటు చేయాలి. పెన్షన్ పథకాలు మరింత విస్తృతంగా అమలు చేయాలి. వృద్ధులపై హింసకు కఠిన శిక్షలు ఉండాలి. వృద్ధుల పట్ల కుటుంబ అవగాహన పెరగాలి. వృద్ధుల అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడేలా సామాజిక, విద్యా కార్యక్రమాలు చేపట్టాలి. వాస్తవానికి వృద్ధుల సమస్యలను వెలుగులోకి తేవడం మీడియా బాధ్యత. కానీ వాస్తవానికి మీడియా వృద్ధుల అంశాలను పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నది అందరికీ తెలిసిన విషయమే. కేవలం వృద్ధాశ్రమాల ఫొటోలు చూపించడం సరిపోదు. వృద్ధుల హక్కుల కోసం చట్టాల అమలు, ప్రభుత్వ నిర్లక్ష్యం, కుటుంబాల బాధ్యతలను సవాలు చేయాలి. అంతేగాక భవిష్యత్ సవాళ్లను దృష్టిలో ఉంచుకొని, తగిన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. వృద్ధుల హక్కులు కేవలం చట్టాల గాని, ప్రభుత్వ పథకాల గాని విషయమే కాదు. అది మానవీయతకు సంబంధించిన మూలప్రశ్న. ఒక సమాజం తన వృద్ధులను గౌరవించకపోతే, భవిష్యత్తులో ఆ సమాజం కూడా గౌరవం పొందదు. ప్రతి ఒక్కరూ ఒకరోజు వృద్ధులుగా మారతారు. కాబట్టి వృద్ధుల హక్కులను రక్షించడం అంటే మన భవిష్యత్తును రక్షించడం.

— లక్ష్మీ



జెరియాట్రిక్ వార్డు

## ప్రజల హక్కులు, స్వేచ్ఛ కోసం పోరాడింది కమ్యూనిస్టులే

### గుండ్రాంపల్లిలో సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ సత్యం

### రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు ప్రారంభం

**ప్రజాపక్షం/చిట్యాల :** దొరలు, భూస్వాములు, నైజాం పాలనకు వ్యతిరేకంగా వెట్టి చాకిరి విముక్తి కోసం, ప్రజల హక్కులు, స్వేచ్ఛ కోసం పోరాడింది కమ్యూనిస్టులేనని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో గల అమరవీరుల స్మారక స్తూపం వద్ద గురువారం ప్రారంభించి అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్సీ సత్యం మాట్లాడారు. ప్రపంచ చరిత్రలో మహోజ్వల ఘట్టం రైతాంగ సాయుధ పోరాటమన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బిజెపి మతం రంగు పూయాలని చూడడం శోచనీయమన్నారు. నైజాం పాలకుల నడ్డి విరిచి వారి నుండి ఈ ప్రాంత ప్రజలను కాపాడిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. ఇలాంటి సాయుధ రైతాంగ పోరాట చరిత్రను రాష్ట్రంలో పాఠ్యపుస్తకాలలో చేర్చి భావి తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజా రామచంద్రం, బొల్గూరి నర్సింహా, నల్పరాజు రామలింగయ్య, ఎండి అక్బర్, చాపల శ్రీను, నల్పరాజు సతీష్, గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, జిల్లా సత్యం, కేతారాజు అంజయ్య, సీమ అంజయ్య, బోడిగె బక్కశెట్టి, జిల్లా లక్ష్మయ్య, ముదిగొండ మురళి కృష్ణ, బరిగెల వెంకటేష్ సీమ వెంకటేష్, ఎర్పుల రాములు, రత్నం లింగస్వామి, బొడిగె వసంత, జిల్లా ఇందిరా, కేతారాజు అనసూయ, రెడపాక సంధ్య, సీమ సునీత, షేరిఫ్,నర్రా శేఖర్ రెడ్డి, దుదిగామ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల...

**మహబూబాబాద్ :** కమ్యూనిస్టుల సాయిధ పోరాటంతోనే తెలంగాణలో రజాకార్ల నుండి ప్రజలకు విముక్తి కలిగిందని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారధి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా పెరుమాళ్ళ సంకీస గ్రామంలో ఆనాడు రజాకార్ల దాడిలో 22 మంది సజీవ దహనమైన ప్రాంతంలో సిపిఐ ఆధ్వర్యంలో అరుణ పతాకాన్ని ఎగురవేసి వారికి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్ నాయకులు నెల్లూరి నాగేశ్వర్ రావు, తురక రమేష్, కరణం రాజన్న, కే ప్రభేష్, బుడమ వెంకన్న, రామగోని రవి, రేపకుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

### చరిత్రను వక్రీకరిస్తే జాతి క్షమించదు

**ఖమ్మం :** చరిత్రను వక్రీకరిస్తే తెలంగాణ జాతి క్షమించదని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. తెలంగాణ పోరాటాన్ని మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని, స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, తెలంగాణ పోరాటంలో బిజెపికి ఎటువంటి పాత్ర లేదన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ప్రారంభ సందర్భంగా గురువారం పాత బస్టాండ్ సమీపంలోని సాయుధ పోరాటయోధుడు, సిపిఐ అగ్ర నాయకులు నల్లమల గిరిప్రసాద్ విగ్రహానికి పూలమాలలు వేసి వార్షికోత్సవాలను హేమంతరావు ప్రారంభించారు. పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. యర్రాబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిజాం స్వాతంత్ర రాజుగా ప్రకటించుకున్న తర్వాత రావి నారాయణరెడ్డి, ముగ్దుం మోహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. నిజాం రక్కసి పాలనకు వ్యతిరేకంగా సాగిన మహత్తర పోరాటంలో సామాన్యులు సాయుధులై పోరాడారన్నారు. నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు అమరులయ్యారన్నారు. నాటి సాయుధ పోరాట ఘట్టాలను నేటి తరానికి తెలియజేసేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు హేమంతరావు తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మిడికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, తాటి నిర్మల, బోడా వీరన్న, ఎస్‌కె సైదా, మోహన్‌రావు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**సూర్యాపేట టౌన్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తూ మతోన్మాదులు రాజ్యమేలుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను గురువారం స్థానిక కామ్రేడ్ ధర్మభిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రారంభించారు. అనంతరం సిపిఐ జిల్లా నాయకులు చామల అశోక్ తల్లి దండ్రులు సీనియర్ కమ్యూనిస్టు నాయకులు చామల లచ్చయ్య (సిఎల్) విజయలక్ష్మి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు ఖమ్మంపాటి అంతయ్య సిపిఐ జెండా ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లంల యాదగిరి, బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్‌కుమార్, సీనియర్ పాత్రికేయులు డేగల జనార్ధన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్, సిపిఎం జిల్లా నాయకులు బుర్రి శ్రీరాములు, చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము, జి.రాజారామ్, ఎడెల్లి శ్రీకాంత్, ధరావత్ శివరాం, తలమల్ల హస్సేన్, పెంద్ర కృష్ణ, గాలి కృష్ణ, దంతాల పద్మరేఖ, దేశగాని హేమలత, పొదిలి వెంకటమ్మ, చామల దమయంతి, వాడపల్లి వెంకన్న, ఐతరాజు లింగయ్య, రిక్షా యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### సాయుధ పోరాటాన్ని బిజెపి వక్రీకరిస్తోంది

**మంచిర్యాల :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయంలో పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆవిష్కరించగా ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటాన్ని బిజెపి వక్రీకరిస్తోందని విమర్శించారు. ఆనాటి పోరాటంలో ఎటువంటి పాత్ర లేని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు మతం రంగు రుద్దుతూ త్యాగాల చరిత్రను అవమానపరుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాస్, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, మిట్టపల్లి శ్రీనివాస్, మిట్టపల్లి పౌలు, మిర్యాల రాజేశ్వరరావు, దేవి పోచన్న, వనం సత్యనారాయణ, దొడ్డిపట్ల రవీందర్, పూజారి రామన్న, కొత్తపల్లి మహేష్, మామిడి గోపి, ఎగుడ మొండి, సాలిగామ సంతోష్, ప్రజా సంఘాల నాయకులు దొనికన సమ్మయ్య, మద్యలో శంకర్, సిరికొండ రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీరాంపూర్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా శ్రీరాంపూర్‌లో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి, అనంతరం బస్టాండ్ వద్ద సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, హిమ్మత్‌నగర్ సెంటర్ వద్ద సిపిఐ సీనియర్ నాయకులు నూకల రాజయ్య జెండా ఆవిష్కరించారు.

**భద్రాద్రి కొత్తగూడెం :** నైజాం నిరంకుశ పాలనను అంతం చేసేందుకు సాగిన తెలంగాణ సాయుధపోరాట స్ఫూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నయా దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సుజాతనగర్ మండల పరిధిలోని నాయకులగూడెంలో సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన అమరుడు రావి నారాయణరెడ్డి స్తూపం వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. సిపిఐ సుజాత నగర్ మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, చంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, భూక్యా ధస్రు, కందుల భాస్కర్, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వి.పద్మజ, కె.రత్నకుమారి, జక్కుల రాములు, తాళ్లూరి పాపారావు, అజిత్, ఎస్.విజయలక్ష్మి, నాయకులు యూసుఫ్, బోయిన విజయ్‌కుమార్, సత్యనారాయణ చారి, గుత్తుల శ్రీనివాస్, మిరియాల రాము, మూడ్ గణేష్, దండు నాగేశ్వరరావు, కోమారి కృష్ణ, ఈర్ల రమేష్, తాళ్లూరి ధర్మారావు, బాలు రామయ్య, శ్రీను, రమేష్, నరేష్, మెదిని లక్ష్మి పాల్గొన్నారు.

**నిర్మల్ టౌన్ :** తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను నిర్మల్ పట్టణంలోని మయూరి జంక్షన్‌లో వీరనారి ఐలమ్మ విగ్రహం వద్ద ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.విలాస్, జిల్లా కార్యదర్శి భూక్య రమేష్, కార్యవర్గసభ్యులు ఎస్.ఎన్,రెడ్డి, ఎస్.కె. సమీర్, కైలాస్ సపవాట్, జశ్వంత్, సాయి, దేవి లాల్, రమేష్, జాదవ్ శంకర్ పాల్గొన్నారు.

**కోరుట్ల :** భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం మట్టి మనసులు నడిపిన పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటమని సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా జగిత్యాల డివిజన్ కేంద్రంలోని భగత్‌సింగ్ నగర అల్లమయ్య గుట్టలో అరుణ పతాకాన్ని ఎగరవేశారు. అనంతరం సీనియర్ కమ్యూనిస్టు నాయకులు మచ్చ గరుడాద్రి, నల్ల భీమయ్య, పిన్నంశెట్టి బ్రహ్మనందం, ఎండి మౌలానా, బండ్ల కళావతి తదితర నేతలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా మండల పట్టణ నేతలు ఎన్.ఎం రాధ, ఎండీ ముక్రం, మహ్మద్ అలీ, చెన్న శ్రీనివాస్, మేదర్ గణేష్, తిప్పర్తి రమేష్, పులగం గోపాల్, బాదం మోహన్, గుండేటి పోశెట్టి సుశీల పద్మ తదితరులు పాల్గొన్నారు



భద్రాద్రి కొత్తగూడెం...



మంచిర్యాల...




జగిత్యాల...



ఖమ్మం...



సూర్యాపేట...




నిర్మల్...



శ్రీరాంపూర్...



మహబూబాబాద్...



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## బాధితులకు అండగా ఉంటాం

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** ప్రకృతి వైపరీత్యాల వల్ల పిడుగు పడి చనిపోయిన బాధ్యత కుటుంబాలకు అండగా ఉంటానని స్థానిక ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం జోగులాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో మృతి చెందిన కుటుంబాలను ఓదార్చి ధైర్యాన్ని ఇచ్చారు. ప్రభుత్వం అందించే సహాయంలో ఆలస్యం చేయవద్దని జిల్లా కలెక్టర్ సంతోష్ కి విజ్ఞప్తి చేశారు. మృత్యు చెందిన వారు ఐజ మండలంలోని భూమిపురం గ్రామానికి చెందిన సర్వేషు, సౌభాగ్యమ్మ, పార్వతీ లకు అక్క డికక్కడే మృతి చెందారు. మృతి చెందిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని వీలైనంత త్వరలో మృతదేహాలను వారి కుటుంబాలకు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం చేశారు.





## గర్భిణీలకు వైద్య సేవల పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దు

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్:** గర్భిణీ స్త్రీల వైద్య సేవల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.గురువారం ఆమె మండలంలోని రాములబండ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి హై రిస్క్ ఏఎన్ సి కేసులు,కుక్క కాటుకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్,ఈడిడీ క్యాలెండర్,ఆసుపత్రిలో మందుల అందుబాటు,మలేరియా,డెంగ్యూ పరీక్షల నిర్వహణ తదితరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి డాక్టర్ జమీర్ తో మాట్లాడుతూ హై రిస్క్ గర్భిణీ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం వారికి వైద్య సేవలు అందించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రికి వస్తున్న జ్వరం కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిలో అందుబాటులో ఉన్న మందులు, ఆంటీ రేబిస్ వ్యాక్సిన్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రతను పరిశీలిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ అప్పజిపేటలో ఉన్న చందుపట్ల మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ విద్యార్థులకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు.డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## డ్రగ్స్, గంజాయి మాఫియా అరికట్టాలి



**ప్రజాపక్షం/మోటకొండూరు** : యువత డ్రగ్స్, గంజాయి మాఫియా లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని సిపిఐ మోటకొండూరు మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం అన్నారు. ఆయన బుధవారం మోటకొండూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ గంజాయి మాఫియాను అరికట్టాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యువత, విద్యార్థులు గంజాయి డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని, విచ్చలవిడిగా డ్రగ్స్ గంజాయి తయారు చేసి సరఫరా చేస్తుంటే కేంద్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరనెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఫార్మల్ కెమికల్ ఫ్యాక్టరీల పేరుతో డ్రగ్స్ దందాకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యువజన సమైక్య ఎఐవైఎఫ్ మోటకొండూరు మండల అధ్యక్షులు కార్యదర్శి బోలగాని అశోక్, బీరకాయల మధు, జివికలపల్లి పాండు, గొట్టిపాముల సునీల్ కుమార్, జీవికలపల్లి గణేష్, బోల నర్సింహా, సిద్దుల కుమారస్వామి, జీవికలపల్లి నాగరాజు, మరికుక్కల మహేష్, వద్ద పోయిన వెంకటేష్, బొట్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## 207.056కిలోల గంజాయి.. 173 మత్తు టాబ్లెట్లు దగ్ధం



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా అక్రమ గంజాయి రవాణా పైన జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపడం తో పాటు అక్రమ గంజాయి నివారణ పైన నిరంతర నిఘా పెడుతుందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలలో 18 కేసులలో 207.056కేజీల గంజాయి 118 గంజాయి చెట్లు 173 మత్తు టాబ్లెట్స్ సీజ్ చేసి కోర్టు ఉత్తర్వుల ప్రకారం నిర్మానుషంగా జనావసానికి దూరంగా ఉన్నటువంటి నార్కట్‌పల్లి మండలం గుమ్మల బావి పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో గురువారం జిల్లా ఎస్‌పి,డ్రగ్ డిస్పోజల్ కమిటీ అధ్వర్యంలో పూర్తిగా దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా జిల్లా పోలీసులు అక్రమ గంజాయి సరఫరా చేయు వారి పైన ప్రత్యేక నిఘా పెడుతూ పట్టుబడి చేయడం జరిగిందన్నారు. జిల్లా పరిధిలో అక్రమ గంజాయి, డ్రగ్స్ రవాణా వినియోగం అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నమని తెలిపారు. ఎవరైన గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే, టోల్ ఫ్రీ నంబర్ 8712670266 సమాచారం తెలపాలని కోరారు.

## తాళం వేసిన ఇండ్లలో చోరీలు కీలక నిందితుడు అరెస్టు



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో రాపోతు రమేష్ ఇంట్లో ఏప్రిల్ నెలలో జరిగిన దొంగతనం కేసులో బాధితుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు నిందితున్ని పట్టుకొని అరెస్టు చేసినట్లు దేవరకొండ ఏఎస్పి మౌనిక తెలిపారు. ఈమేరకు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిందితుడు పిట్ల గంగాదర్(30) కళ్యాణ దుర్గం అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి చెడు వ్యసనాలకు అలవాటు పడి పేకాట, క్రికెట్ బెట్టింగ్ వంటి వాటికి అలవాటుపడి తాళం వేసిన ఇండ్లలో చోరీలు చేస్తున్నాడని ఇతనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో సుమారు 100కుపైగా కేసులు నమోదు అయ్యాయని ఆమె తెలిపారు. నిందితుడు దొంగతనం చేసిన కొంతమేర డబ్బులను ఖిల్లా పార్కులో దాచిపెట్టి వాటిని తీసుకువెళ్లడానికి దేవరకొండకు వచ్చిన సందర్భంలో పోలీసులు అతడిని అనుమానించి పట్టుకొని అతని వద్దనున్న సుమారు రెండున్నర లక్షల డబ్బు ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసు విచరణలో భాగంగా ఏఎస్పి మౌనిక ఆధ్వర్యంలో సిఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ నారాయణరెడ్డిలు తమ సిబ్బందితో టీంలుగా ఏర్పడి కేసును చేధించారు. కేసును చేధించిన సిఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐలు నారాయణరెడ్డి, మౌనిక, సిబ్బంది సతీష్, అంజయ్య, సింహాద్రి, చాంద్‌పాషాలను ఏఎస్పి అభినందించారు.

# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా గురువారం యాదగిరిగుట్ట మండల కేంద్రంలో స్వతంత్ర సమరయోధులు భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు అమరజీవి గోదా యాదగిరి స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించి ప్రారంభించారు. అదేవిధంగా సైదాపురం గ్రామంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు రాపోల్ కొండల్ రెడ్డి, క్యాసారం ముత్యం రెడ్డి, దుంబాల రాం రెడ్డి, నంద నరసయ్య గారల స్మారక చిహ్నం వద్ద మరియు ధర్మారెడ్డి గూడెం కాచారం చౌరస్తాలో ఉన్నటువంటి స్వాతంత్ర సమరయోధుల స్మారక చిహ్నాలు పరెడ్డి చెన్నారెడ్డి, కల్లూరు భద్రారెడ్డి, దుంపల మల్లారెడ్డి, జంగంపల్లి గ్రామంలో స్వాతంత్ర సమరయోధులు శివరాత్రి మల్లయ్యల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం తెలంగాణ ప్రజల యొక్క విముక్తి కోసం జరిగినటువంటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను నేడు కేంద్రాన్ని పాలిస్తున్నటువంటి భారతీయ జనతా పార్టీ వక్రీకరిస్తూ హిందూ ముస్లింల మధ్య జరిగిన పోరాటంలా చిత్రీకరిస్తున్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను నేటి యువతకు తెలిసే విధంగా పాఠ్యాంశాలలో చేర్చాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడినటువంటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలనను ఎంత సమర్థవంతంగా నిర్వహిస్తాఉన్నదో అదేవిధంగా సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పెరబోయిన మహేందర్ సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, సిపిఐ పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, మహిళా సమాఖ్య మండల అధ్యక్ష కార్యదర్శులు ఆరె పుష్ప, నరసమ్మ, రవీందర్ పాల్గొన్నారు.



## రుద్రమ్మ చెరువును పర్యాటక ప్రదేశంగా మార్చేందుకు కృషి

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మండల పరిధిలోని వెలుగుపల్లి రుద్రమ్మ చెరువును పర్యాటక ప్రదేశంగా మార్చేందుకు కృషి చేస్తానని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు. గురువారం వెలుగుపల్లి శివారులో గల రుద్రమ్మ చెరువును పర్యాటక అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 600 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన కాకతీయుల కాలం నాటి చెరువుకు మధ్యలో పక్కన పెద్ద పెద్ద గుట్టలు ఆనుకొని ఉండడం ఎంతో ఆహ్లాదకరంగా ఉందన్నారు. జాతీయ రహదారికి పక్కనే ఉన్నందు వల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి మరో లక్నవరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. చెరువులో బోటు, గుట్టల వద్ద స్టాల్స్‌తో అందంగా తీర్చిదిద్దితే బాగుంటుందని సంబంధిత ఈడి ఉపేందర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దయా నందం, డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, మండల పార్టీ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, నరేష్, చింతకుంట్ల మల్లేష్, దాసరి శ్రీను, కొండ రాజు, మాచర్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా ఎత్తిపోతల పథకాల పనులు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్



**ప్రజాపక్షం/చింతలపాలెం:** రాజీవ్ లిప్టు ఇరిగేషన్, వెల్లటూరు వద్ద ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ గురువారం పరిశీలించారు. గురువారం చింతలపాలెం మండల కేంద్రంలోని దొండపాడు గ్రామంలో నిర్మిస్తున్న రాజీవ్ లెఫ్ట్ ఇరిగేషన్ వెల్లటూరు వద్ద ముక్త్యా_ల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్‌ను ఇరిగేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం హైద్రాబాద్ వెల్లటూర్ ముక్త్యా_ల బ్రాంచ్ కెనాల వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా సంబంధిచిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉ త్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించి పనులు వేగంవంతంగా పూర్తి చేయాలని చూడాలని ఆకాంక్షించారు. వెల్లటూరు గ్రామంలో ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించిన అక్కడక్కడ భూసేకరణకు సంబంధించిన టైటిల్ సరిద్దులను, అటవి శాఖ వివాదాలు ఉన్నాయని వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. సమస్య ఉన్న రైతులతో విడివిడిగా మాట్లాడి ఆ భూములకి సంబంధించిన ఆధారాలు జతపర్చి ఆర్డీవోకి దరఖాస్తు సమర్పించాలని వాటిని 15 రోజులలో పరిశీలించి చట్టప్రకారం రైతులకు న్యాయం చేస్తామని అన్నారు. ఇప్పటికే ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు సంబంధించి భూ సేకరణ పూర్తయిందని గ్రామాల వారిగా అవార్డులు జారీ చేసి ఎలాంటి వివాదం లేని రైతులకు 30 కోట్ల రూపాయలు నష్టపరిహారం కింద రైతులకు చెల్లించడం జరిగిందన్నారు. వర్షాలు తగ్గినందున ఎక్కువ మిషనరిని ఏర్పాటు చేసుకుని కావాల్సినన్ని పైపులు సమకూర్చుకోవాలని, ఎక్కువ సిబ్బందిని నియమించి పైపులైన్లు త్వరగా వేయాలని అదే విధంగా పంప్‌హౌజ్ నిర్మాణ పనులు కూడా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను అదేశించారు.

**జిల్లాలో యూరియా సరిపడా ఉంది: కలెక్టర్**

జిల్లాలో యూరియా సరిపోను ఉందని, రైతులకు ఎంత అవసరం ఉంటే అంతే తీసుకోవాలని ముందస్తుగా తీసుకుని నిల్వ చేసుకోవద్దని బుధవారం ఒక వ్యాగిన్ గురువారం ఒక వ్యాగిన్ యూరియా వచ్చిందని వాటిని వ్యవసాయ అధికారుల ద్వారా అన్ని పిఏసిఎస్‌ల, ఆగ్రో సెంటర్‌లకు సరఫరా చేసి రైతులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## మొబైల్ కేంద్రంగా సైబర్ మోసాలు...

ఫోన్ వినియోగించడంలో జాగ్రత్తలు పాటించాలి :ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మొబైల్ కేంద్రంగా సైబర్ మోసాలు జరుగుతున్నాయని, ఫోన్ వినియోగించడంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సెల్‌ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో వివిధ రూపాల్లో పోగొట్టుకున్న సుమారు రూ.20లక్షల విలువ గల 100 ఫోన్లను గుర్తించి జిల్లా ఎస్‌పి చేతుల మీదుగా బాధితులకు ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికి నిత్యవసరమై దానిని కమ్యూనికేషన్ కోసం, ఆన్‌లైన్ విద్య కోసం వినియోగిస్తున్నాం, మన యొక్క విలువైన సమాచారంతోపాటు బ్యాంక్ అకౌంట్స్, పాస్‌వర్డ్స్, సోషల్ మీడియా అకౌంట్స్, వ్యక్తిగత ఫోటోలు మొదలైన వంటివి ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుంటున్నామని వివరించారు. మొబైల్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం నేరగాళ్ళు మొబైల్ దొంగిలించి, వీక్‌పాస్‌వర్డ్స్‌లను బ్రేక్ చేసి ఫోన్‌పే, గూగుల్‌పే తదితర మాధ్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారని హెచ్చరించారు. పోయిన మొబైల్ ఫోన్లు మళ్లీ దొరకదనుకున్న బాధితులు జిల్లా పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు సంబంధిత బాధితులు జిల్లా ఎస్‌పి, పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్‌పి రికవరీ చేసిన ఐటి కోర్ సిబ్బంది, పోలీసు స్టేషన్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట సబ్‌డివిజనల్ డిఎస్‌పి ప్రసన్న కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఐటి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటి కోర్ సిబ్బంది, మొబైల్ బాధితులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన సేవలు అందించాలి



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

**ప్రజాపక్షం/బీబీనగర్** : వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండి పేషెంట్లకు మెరుగైన సేవలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం బీబీనగర్ మండలం రాఘవాపూర్ గ్రామంలో పల్లె దవాఖానని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పల్లె దవాఖానలో ఎంఎల్‌ఎచ్‌పిలు, వైద్య సిబ్బంది రోజు వస్తున్నారా లేదా అని అటెండన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎంఎల్‌ఎచ్‌పి లేకపోవడంతో ఎక్కడికి వెళ్లారని ఆరా తీశారు. ఏంఎల్‌ఎచ్‌పి అందుబాటులో లేకుండా బీబీనగర్‌కి పిఎచ్‌సికి వెళ్లారని సిబ్బంది తెలుపడంతో రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పల్లె దవాఖానాలో ప్రజలకి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మీటింగ్స్ ఏమైనా ఉంటే సాయంత్రం 4 గంటల తరవాత పెట్టుకోవాలని చెప్పారు. మీ పరిధిలో రోజు వచ్చే ఓపీ రిజిస్టార్ సరిగా మెయింటైన చేయాలని అన్నారు. ఈ పల్లె దవాఖాన పరిధిలో ఎంత మంది గర్భిణిలు వచ్చారని పరిశీలించారు. రిజిస్టర్, ఈడిడిల రిజిస్టర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. గర్భిణిలు ప్రతి నెల చెకప్‌కి వస్తున్నరా లేదా చూసుకోవాలి, డెలివరీల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వ ఆసుపత్రిలో నార్మల్ ప్రసావాలు అయ్యేలా చూడాలని అన్నారు. అనంతరం బీబీనగర్ మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో మొత్తం మంజూరు అయిన ఇండ్లు ఎన్ని , అవి అన్ని కూడా నిర్మాణంలో ఉన్నాయా లేక్ ఏమైనా మొదలు పెట్టనివి ఉన్నాయ అని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు అందరూ కూడా ఇండ్లు వేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇసుక ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని తెలిపారు. ఇటుక కూడా ఎక్కువ రేటు కొనుగోలు చేయకూడదు, మేస్త్రిలకు నిర్మాణానికి ఎక్కువ డబ్బులు ఇవ్వొద్దు అని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 12న రాయగిరిలో సురవరం సంతాప సభ




**ప్రజాపక్షం/ఆలేరు :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆలేరు మండల ముఖ్య నాయకుల సమావేశం సిపిఐ ఆలేరు మండల పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ 12న రాయగిరిలో బసవలింగ ఫంక్షన్ హాల్‌లో సిపిఐ జాతీ య కార్యదర్శి నల్లగొండ మాజీ పార్లమెంటు సభ్యుడు సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుగ నుందని కావున ఈ సంతాప సభకు ప్రజలు, కమ్యూనిస్టు సభ్యులు, కూలీలు, రైతులు, మేధా వులు, కార్మికులు, కర్షకులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య మాట్లాడుతూ రేపు జరగబోయే కార్యక్ర మానికి అందరూ పాల్గొనాలని కోరారు. బొడ్డు ఆంజనే యులు, రాజు పాల్గొన్నారు.

## అత్యాచార నిందితుడికి 21ఏళ్ల జైలు

గత సంవత్సరం కాలం నుంచి 17 కేసులలో 18 మంది నిందితులకు జైలు శిక్ష: జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర

**ప్రజాపక్షం/నల్లగొండ** : మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారం చేసిన నిందితునికి 21 ఏళ్ల జైలు శిక్షతోపాటు జరిమాన విధించడం జరిగిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం దుగినవెల్లి గ్రామానికి చెందిన జడిగిల హరీష్ ఒక మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించించి మోసం చేసిన ఘటనలో బాధితురాలు 2018 జూలై 23న ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడి పైన ఎస్‌సి పోక్సో నెంబర్ కట్టంగూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి విచారణ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం కోర్టులో ఛార్జ్ సీట్ దాఖలు చేయగా గురువారం ఏడిజె II కమ్ ఎస్‌సి,ఎస్‌టి కోర్టు అత్యాచారం అండ్ ఫోక్సో కేసుల కోర్ట్ నిందితుని దోషిగా నిర్ధారించడం జరిగిందన్నారు. సెక్షన్ 376 ఐపీసీ, ఫోక్సో చట్టం సెక్షన్.5 (1) 6 పోక్సో యాక్ట్2012 ప్రకారం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ.25, వేల జరిమానా 420 ఐపీసీ ప్రకారం ఒక సంవత్సరం జైలు శిక్ష 5 వేల రూపాయల జరిమానా మొత్తం కలిపి 21 సంవత్సరాల జైలు 30 వేల రూపాయల జరిమాన విధించడం జరిగిందని తెలిపారు.అదే విధంగా బాధితురాలికి రూ.5 లక్షల పరిహారంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందించాలని తీర్పు వెలువడించిందని తెలిపారు. గడిచిన సంవత్సర కాలంగా పోక్సో యాక్ట్ ప్రకారం 17 కేసులలో 18 మంది నిందితులకు గౌరవ న్యాయస్థానం జైలు శిక్ష జరిమాన విధించడం జరిగిందని ఎవరైనా మైనర్ బాలికలపై అత్యాచారాలకు పాల్పడితే ఎప్పటికైన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ కేసులో సరి అయిన సాక్ష్యదారలు సేకరించి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు సమర్పించి నిందితునికి శిక్ష పడే విధంగా చేసిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సిఐలు క్యాస్ట్రో రెడ్డి,ఎస్ఐ రంజిత్ కుమార్ ప్రాసెక్యూషన్ కు సహకరించిన నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి,శాలిగౌరారం సిఐ కొండల్ రెడ్డి, కట్టంగూర్ ఎస్ఐ రవీందర్,పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వేముల రంజిత్ కుమార్, సిడిఓ రువ్వా నాగరాజు, లైజన్ అధికారులు,లీగల్ ఆఫీసర్ భరోసా సెంటర్ కె.కల్పన,పి.నరేందర్, ఎన్.మల్లికార్జున్‌లను జిల్లా ఎస్‌పి అభినందించారు.

# భూదాన జయంతి వజ్రోత్సవాల వేడుకలకు ముఖ్యమంత్రి !

పేదలకు భూదానం చేయాలన్న ఆలోచన రేకెత్తించింది వినోబాభావే

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : వచ్చే సంవత్సరం ఏప్రిల్ 18న యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 75 సంవత్సరాల భూదాన్ జయంతి వేడుకలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు తెలిపారు. భూదాన ఉద్యమ పితామహుడు ఆచార్య వినోబాభావే 130వ జయంతి సందర్భంగా గురువారం పట్టణ కేంద్రంలోని టూరిజం పార్కులో ఏర్పాటు చేసిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భూదానోద్యమ నేపథ్యాన్ని 100 ఎకరాలు భూమి దానం చేసిన భూదాత వెదిరే రామచంద్రారెడ్డి దానగుణాన్ని త్యాగాన్ని గుర్తుచేసుకొని వారి స్ఫూర్తితో ప్రజలకు చిత్తశుద్ధితో పనిచేయాలని ప్రజా ప్రతినిధులకు పిలుపునిస్తూ తనవంతుగా అదే చైతన్యంతో పని చేస్తానని అన్నారు. పేదలకు భూమి దానం చేయాలన్న ఆలోచన రేకెత్తించింది వినోబా భావే అని ఆయన ఆలోచనలకు అంకురార్పణ చేసిన ఘనత రామచంద్రారెడ్డిది అని కొనియాడారు. వినోబా భావే పాదయాత్రలో భాగంగా పోచంపల్లికి చేరుకున్న ఆయన ఆనాటి పేదలు బ్రతకడానికి భూములు కావాలని అడిగిన వెంటనే సంకల్పం పూని భూదాన్ ఉద్యమాన్ని పోచంపల్లి నుండి ప్రారంభించడం ఈ ప్రాంతం గొప్పతనం అని ఆ త్యాగధనులు ప్రపంచ చరిత్ర పుటల్లో నిలిచిపోయారని వారి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని పిలుపునిచ్చారు..

గాంధీజీ ప్రియ శిష్యుడు ఆచార్య వినోబాభావే తన భూదానోద్యమంతో ప్రపంచ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉద్యమాన్ని చేపట్టి ప్రథమంగా 100 ఎకరాలు భూమి దానం చేసిన ప్రథమ భూదాతగా రామచంద్రారెడ్డి చిరస్మరణీయులుగా నిలిచారని భూదాన్ పోచంపల్లిగా ప్రపంచ దేశాల వేదికలపై చేనేత పట్టుచీరలతో సిల్క్ సిటీగా ప్రత్యేక గుర్తింపు సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి వైస్ ప్రెసిడెంట్ కళ్లెం రాఘవరెడ్డి, మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, జిల్లా సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, అంబరీష్ రెడ్డి, టై అండ్ డై పట్టణ అధ్యక్షులు భారత లవకుమార్ పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షులు సీత శ్రీరాములు పాల్గొన్నారు.

## ప్రపంచ నైపుణ్యపోటీలకు 30లోపు రిజిస్ట్రేషన్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : యువత వరల్డ్ స్కిల్ కాంపిటీషన్ లో పాల్గొనుటకు సెప్టెంబర్ 30 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి నంద పద్మ తెలిపారు. వరల్డ్ స్కిల్ కాంపిటీషన్ 2025 నిర్వహించుటకు షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని. ఈ పోటీలు జిల్లా, రాష్ట్ర, నేషనల్, ఇంటర్ నేషనల్ స్థాయిలో నిర్వహించబడుతాయని, అర్హత కలిగిన అభ్యర్థులు దాదాపు 50 కి పైగా నైపుణ్యాలలో పోటీ పడొచ్చని,ఆటో బాడీ రిపేర్, ఆటో మొబైల్ టెక్నాలజీ, బేకరీ, బ్యూటీ థెరపీ, సిఎన్‌సి మిల్లింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, గ్రాఫిక్స్ డిజైన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఐటి సాఫ్ట్ వేర్ సొల్యూషన్ ఫర్ బిజినెస్ మొదలైన నైపుణ్యాలలో పోటీ నిర్వహించడం జరుగుతుందని. ఆసక్తి గల అభ్యర్థులు స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ వెబ్ సైటు లో సెప్టెంబర్ 30 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## పాన్‌గల్ మండలానికి 8 మంది గ్రామపాలన అధికారులు



**ప్రజాపక్షం/పాన్‌గల్ :** పాన్‌గల్ మండలానికి 8 మంది గ్రామ పాలన అధికారులను జిల్లా కలెక్టర్ కేటాయించడంతో గురువారం 8 మంది గ్రామ పాలన అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ అందజేసిన ఆర్డర్ కాపీలను తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి అందజేశారు. కేతేపల్లి గ్రామానికి ఉమావతి, పాన్‌గల్ గ్రామానికి రాధ , బుసిరెడ్డిపల్లి గ్రామానికి మల్లికార్జున్ , దావాజీపల్లికి రాములు, గోప్లాపూర్ కు కృష్ణవేణి, తెల్లరాళ్లపల్లికి భాగ్య లక్ష్మి, మహ్మదాపూర్ గ్రామానికి నాగయ్య, రేమొద్దుల గ్రామానికి బాబును కేటాయించినట్లు తహసీల్దార్ తెలిపారు.



## ‘చలో దోస్త్, చెస్ ఆడదాం’ పాలమూరు ఎస్ఆర్ఐ ఫోరం శ్రీకారం

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల పరిధిలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 203 చదరంగం బోర్డులతో పాటు చెస్ పుస్తకాలు కూడా పంపిణీ చేయడం జరిగింది. పాలమూరు ఎన్నారై ఫోరం కోఆర్డినేటర్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు ఎన్నారై ఫోరం చెస్ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా తీసుకోవాలని యూత్, విద్యార్థుల ఎక్కువ సంఖ్యలో మొబైల్ ఫోన్ చూస్తూ కాలం గడిపేస్తున్నారు. కాబట్టి ఇలాంటి టైంలో ఒక గేమ్ ఉంటే ఎలా ఉంటుందని ఆలోచన దృక్పథంతో మొదలైన ఈ గేమ్ చేస్ ఆట విద్యార్థులకు ఆలోచనా దృక్పథం పెంచుతుంది. విజయం సాధించే దిశగా చెస్ ఉపయోగపడుతుంది. ఎందుకంటే ఏదైనా ఆటలు ఆడేటప్పుడు ఉదాహరణకు ఒక క్రికెట్ తీసుకుందాం ఈ ఆటలో 11 మంది ఆడతారు, కానీ ఎవరో ఒకరు మంచిగా ఆడకపోయినా గెలవలేకపోతారు. కానీ ఈ చదరంగం ఆటలో గెలిచినా, ఓడినా ఒక్కరే ఆడతారు. అంటే తప్పు ఎవరు చేశారు అన్నది తెలిసిపోతుంది . ఎందుకు ఓడిపోయాను అనే కారణం తెలుసుకుంటాం. ఇప్పుడు ముందుకు వెళ్లడానికి ఈ గేమ్ ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమంలో పాలమూరు ఎన్నారై ఫోరం సభ్యులు రవి మీ రెడ్డి, చెస్ నెట్వర్క్ టీం సుధీర్, సంజయ్, హరిరాజ్, రాజన్న, చదరంగం బోర్డులను స్పాన్సర్స్ శివారెడ్డి, జాజాపూర్, పాలమూరు ఎన్నారై ఫోరం కన్వీనర్ మహిపాల్ రెడ్డి, మండల విద్యాధికారి గాయత్రి, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రదీప్ కుమార్, నరసింహ చారి, ఉపాధ్యాయులు, కేజీబీవీ ఎస్ఓ విద్యార్థులు పాల్గొన్నారు.



## కృష్ణలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేందుకు రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్

**ప్రజాపక్షం/కృష్ణ :** గత ఐదేళ్ల కృష్ణ మండల ప్రజల నిరసన ఫలితంగా కృష్ణ రైల్వే స్టేషన్‌లో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేందుకు రైల్వేశాఖ నుంచి అంగీకారం రావడంతో మండల ప్రజలు, బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా మండల నాయకులు, ప్రజలు ధర్నాలు, నిరసనలు చేసి వినతిపత్రాలు ఇచ్చినా కేంద్ర ప్రభుత్వం కాని, రైల్వే శాఖ అధికారులు స్పందించలేదని అన్నారు. ఈ విషయంపై ఎంపి డికె.అరుణ విన్నవించగా, ఎంపి పలుమార్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రికి విజ్ఞప్తి చేయడంతో గురువారం రైళ్లు నిలిపేందుకు కేంద్ర రైల్వే శాఖ నమ్మతించిదని నాయకులు తెలిపారు. కరోనా కాలం నుంచి కృష్ణ రైల్వే స్టేషన్‌లో రద్దు చేసి కోయంబత్తూరు, చెన్నై, ముంబై ఎక్స్‌ప్రెస్ రైళ్ళు ఇకపై ప్రతి రోజు నిలువనున్నాయి అన్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు, మండల ప్రజలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎంపి డికె.అరుణ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల బిజెపి అధ్యక్షుడు నల్లే నర్సప్ప, అమర్ కుమార్ దిక్షిత్, ఉమ్మడి మండలాల బిజెపి నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి : సిఐ



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ సర్కిల్ పరిధిలో చాలా కాలంగా కోర్టులో పెండింగ్‌లో వున్న కేసుల పరిష్కారం కోసం కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మక్తల్ సీఐ రామ్ లాల్ ఒక ప్రకటనలో ప్రజలకు తెలిపారు.ఈ నెల 13వ తేదీన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నారాయణ పేట కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడున ఈ లోక్ అదాలత్ ద్వారా చట్టరీత్యా రాజీకి అర్హమైన క్రిమినల్ కేసులతో పాటు రాజీపడదగిన సివిల్ కేసులు, భూ వివాదాలు, వాహన ప్రమాద పరిహార కేసులు, చిట్ ఫండ్, కేసులు చెక్‌బౌన్స్ కేసులు, వైవాహిక కేసులు, తగాదాలు, అన్ని రకాల ట్రాఫిక్ కేసులకు సంబంధించి జాతీయ లోక్ అదాలత్ నందు ఇరువర్గాల కక్షీదారులు అంగీకారయోగ్యమైన సత్వర పరిష్కారం ఈ లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చని, ఇరువర్గాల కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగించుకోని సమస్యలను పరిష్కరించుకోవాలని మరిన్ని వివరాలను లోకల్ పోలీస్ స్టేషన్ అధికారులను సంప్రదించాల్సిందిగా సిఐ తెలిపారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

**ప్రజాపక్షం/వంగూరు :** బిసిలకు చట్టప్రకారంగా 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బిసి మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గాజర గ్రామంలో బిసి హక్కులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న హైదరాబాద్ శ్రీశైలం ప్రధాన రహదారి వంగూరు గేటు సమీపంలోని వైఫంక్షన్‌లో నిర్వహించనున్న బిసి హక్కుల శంఖారావం మహాసభకు బిసిలు భారీగా తరలిరావాలని అన్నారు. కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు బాతకమల్లయ్యయాదవ్, వడ్ల ఆంజనేయులు, రాపోతు శ్రీనివాసులుగౌడ్, చిన్నపర్వతాలు, కోట్ల తిరుపతయ్య, కొమ్మువెంకటేష్, మంగలి సత్యనారాయణ పాల్గొన్నారు.

## గిరిజన తండారోడ్లకు మహర్దశ

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** దశాబ్దాలకారణంగా రోడ్డులేక మట్టిరోడ్డుపై ప్రయాణంచేసి నానా అవస్థలుపడిన గిరిజనులకోసం మండలంలోని గిరిజనుల అభివృద్ధికోసం నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో గిరిజనతండాలో బిటిరోడ్లకు నిధులు మంజూరుచేసిన స్థానిక ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి గిరిజన నాయకులతోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేతావత్ మాన్యనాయక్ హన్మ్యనాయక్, మొల్గర మహేందర్‌ధర్మ నాయక్‌లతోపాటు పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉత్సవాలను
# రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి

టి.నర్సింహులు
సిపిఐ నారాయణపేట్ జిల్లా కార్యదర్శి



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ఈనెల 11 నుంచి 17 వరకు జరిగే తెలంగాణ సాయుధ పోరాటం వారోత్సవాలను విజయవంతం చేయండి సెప్టెంబర్ 11 నమ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలు ఉద్దేశించి నాటి పోరాటం అమరుల త్యాగం మరువలేనిది మాట్లాడడం నారాయణపేట జిల్లా రాష్ట్రంలో జరుగుతున్న వారోత్సవాలను అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయగలరు నారాయణపేట్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సాయుధ పోరాటనే అధికారికంగా నిర్వహించలేకపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయితే తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని అధికారికంగా నిర్వహించాలంటే స్వరాష్ట్రం కావాలని ఆనాడు స్వరాష్ట్రం తెచ్చుకున్నాం, ఆనాటి రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతూ వస్తుండేటివి ఇప్పుడు స్వరాష్ట్రమైంది వచ్చి 13 సంవత్సరాలు అవుతున్న నేటికీ తెలంగాణ సాయుధ పోరాటాన్ని అధికారికంగా మొన్న ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం గాని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం గానీ తెలంగాణ సాయుధ పోరాటాన్ని అధికారికంగా నిర్వహించట్లేదు. తక్షణమే తెలంగాణ సాయుధ పోరాటాన్ని అధికారికంగా ప్రభుత్వం నిర్వహించాలని సిపిఐ డిమాండు, 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వతంత్రం సిద్దించిన తెలంగాణ రాష్ట్రానికి మాత్రం భారతదేశంలో విలీనం కాలేదు. ఆనాటి నైజాం నవాబు నేను హైదరాబాదు సంస్థానాన్ని ప్రత్యేక దేశంగా ప్రకటించుకుంటానని కరాకండిగా చెప్పడం జరిగింది. ఆనాటి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అగ్ర నాయకులు రవి, నారాయణరెడ్డి, మగ్దూం మోయుద్దిన్, బద్దం ఎల్లారెడ్డి, లు 1947 సెప్టెంబరు 10 న తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాటం సాగిన పోరాటంలో 4500 మంది రానార్పణ చేశారు. దున్నే వాడికి భూమి కావాలని 10 లక్షల ఎకరాలను పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.సంతోష్, మద్దూరు మండల కార్యదర్శి చాకలి వెంకటేశ్, సిహెచ్ గణేష్, రాములు, మొగులప్ప, సరోజనమ్మ, నారాయణమ్మ, మనెమ్మా, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## గురుతర బాధ్యత అధికారులదే

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** అడవుల సంరక్షణలో గురుతరమైన బాధ్యత అటవీశాఖ అధికారుల పైననే ఉందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లా ఫారెస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవులను సంరక్షణ చేయడంలో విధినిర్వహణలో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన చెప్పారు. తమ ప్రాణాలను అడ్డుపెట్టి అడవులను కాపాడుకోవడానికి అటవీశాఖ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయం అని ఆయన చెప్పారు. అడవులు కాపాడుకుంటేనే వర్షాలు బాగా కురిసి, రైతులు సంతోషంగా ఉంటారని ఆయన చెప్పారు. అటవీశాఖ అధికారుల చేతనే టూరిజం శాఖ అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, డిఎఫ్ఒ సత్యనారాయణ, ఎఫ్‌డిఒ గణేష్, ఎఫ్ ఆర్ఓ అబ్దుల్ హై, కమాలుద్దీన్, మాజీమున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఒక ట్రాక్టర్ పట్టివేత

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** కోస్గి పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమయంలో టాస్క్‌ఫోర్స్, కోస్గి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి కోస్గి శివారులో రెండు టిప్పర్లను, ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి టిప్పర్ డ్రైవర్‌లు టి.వంశి, శ్రావణ్, ట్రాక్టర్ డ్రైవర్ మధురెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బాలరాజు తెలిపారు. కోస్గి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా పర్మిషన్ లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

## ప్రజాసమస్యలపై పోరాటాలకు సిద్ధంకండి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రపంచపోరాటచరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడ్డాం తెలంగాణ రైతాంగ సాయుధపోరాట స్ఫూర్తితో సమాజంలోని సకల ప్రజల సమస్యల పరిష్కారానికై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా, జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్‌లు పిలుపునిచ్చారు. గురువారం మన్ననూర్ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో సాయుధపోరాట వారోత్సవాల ప్రారంభసభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న సిపిఐ నాయకులు తెలంగాణ అమరజీవి సాయుధపోరాటవీరుడు సైమన్‌రాములు స్థూపానికి నివాళులర్పించి అమరులను స్మరించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రస్తుత నాగర్‌కర్నూల్ జిల్లాకి విడదీయలేని సంబంధాలు ఉన్నాయని జిల్లాలోని అచ్చంపేట కొల్లాపూర్ నాగర్‌కర్నూల్ కల్వకుర్తి పరిధిలోగల గత ఏ పల్లెలోకి వెళ్లినా ఆనాటి వీరతెలంగాణ సాయుధపోరాటాల త్యాగాల గుర్తులు నేటికీ సజీవంగా కనబడుతున్నాయని అన్నారు. జిల్లాలో సాయుధ రైతాంగ పోరాటాన్ని సురవరం వెంకటరామిరెడ్డి, లక్ష్మణచారి, కక్కినేటి గోపాల్‌రావు, పెదలింగారెడ్డి, చిన్నలింగారెడ్డి, తప్పేటబుగ్గన్న, కమ్యూనిస్టు రంగమ్మ, సిఆర్ శర్మ ఇలా పెరమళ్ల మాసయ్య ఇలా అనేకమంది ఆనాటి ఉద్యమకారుల జ్ఞాపకాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిని ఇస్తున్నాయన్నారు. ఈపోరాట స్ఫూర్తితోనే జిల్లాలో ఉన్నటువంటి అనేక ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితిసభ్యులు కేశవులుగౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు టి.నర్సింహ్మా, అచ్చంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పెరుమాలగోపాల్, జిల్లా నాయకులు కృష్ణాజి, శంకర్‌గౌడ్, రవీందర్, ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిజ్జ శ్రీనివాస్, తుమ్మలశివుడు, కిరణ్‌కుమార్, దళితహక్కుల పోరాటసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లక్ష్మిపతి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దేశముని అంజి, అశోక్, చంద్రయ్యయాదవ్ పాల్గొన్నారు.

# సర్కారు వైద్యంపై ప్రజల్లో విశ్వాసం కల్పించాలి

జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/మద్దూర్/కోస్గి :** సర్కారు దవాఖనాల్లో అందించే సేవలపై ప్రజల్లో విశ్వాసం కల్పించాలని గురువారం రోజు కోస్గి మద్దూర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని వసతి సౌకర్యాలతో పాటు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరినట్లు అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని క్యాజువాలిటీ, రక్త పరీక్షల గది, మేల్, ఫిమేల్, చిన్నపిల్లల వార్డులతో పాటు రక్త పరీక్షల గది ఎక్స్‌రే ల్యాబ్ గదులను ఆమే పరిశిలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎవరెవరు రుగ్మతతో వచ్చారని వాకబు చేశారు. అనంతరం ఆస్పత్రిలోని వైద్య బృందంతో ఆస్పత్రి ప్రగతి, పనితీరుపై సమీక్ష జరిపారు. ఆస్పత్రికి అవసరమైన సదుపాయలు, సౌకార్యాలు ఏమేమి అవసరమో ఒక నివేదిక తయారు చేసి ఇవ్వాలని డిసిహెచ్ఎస్ డాక్టర్ మల్లికార్జున్‌ను ఆదేశించారు.

**మద్దూరు సిహెచ్‌సి పరిశీలన :** మద్దూరు కమిటీ ఆరోగ్యకేంద్రంలో ఎక్స్‌రే సేవలను వీలైనంత త్వరగా ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం రోజు మద్దూరు ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని తనిఖీ చేసి, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్‌ల వివారాలను అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లల వార్డు, జనరల్ వార్డ్‌ను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. కాడ నుంచి మంజురైన రూ.25లక్షల నిధులతో చేపట్టే ఆస్పత్రి ప్రహరీ గోడ నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయని ఆర్ఎంఒ పావనిని అడిగారు. అలాగే ఆస్పత్రికి మంజురైన రూ.30లక్షల జనరేటర్ వినియోగం గురించి వాకబు చేశారు. ఇంకా ఆస్పత్రికి అవసరమైన రిక్వైర్మెంట్‌లు ఎమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. అవసరమైన మందులు ముఖ్యంగా పాము కాటు మందులు (యాంటి వీనం) అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు.



## మెనూ ప్రకారం భోజనం అందించాలి

కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. గురువారం జడ్చర్ల పట్టణంలో ఉన్న తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల (ఇంగ్లీష్ మీడియం) జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, తరగతి గదులు పరిసరాలను, మెనూ పరిశీలించారు. మెను ప్రకారం భోజనం అందించకపోవడం గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు డైట్ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించాలని, భోజనం సిద్ధం చేస్తున్న సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఆహారం అందించాలని ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో సౌకర్యాలు, భోజనం, బోధన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువు పైనే దృష్టి ఉంచాలని, తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడుతూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు, సమయపాలన పాటించాలని సూచించారు.

**యూరియా పంపిణీ పరిశీలన**

**మహబూబ్‌నగర్/ జడ్చర్ల :** జడ్చర్ల మండలంలోని ఎరువుల దుకాణ విక్రయ కేంద్రాలను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి గురువారం తనిఖీ చేశారు. యూరియా సరఫరా, ధర గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. యూరియాను రైతులకు స్టాక్ వచ్చిన విధంగా ఇబ్బంది లేకుండా పంపిణీ చేయాలని సూచించారు. మార్క్‌ఫీడ్ గోదాంలోని బఫర్ స్టాక్ కూడా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో జడ్చర్ల సహయ వ్యవసాయ సంచాలకులు మండల వ్యవసాయ అధికారి గోపీనాథ్, తాహసీల్దార్ నరసింహరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు నర్సింలు, శారద పాల్గొన్నారు.

## మైక్రో బ్రూవరీస్ నోటిఫికేషన్ వెంటనే వెనక్కి తీసుకోవాలి

జిల్లా మద్యపాన నిషేధ సూపరిండెంట్‌కు
ఎన్ఎఫ్ఐడబ్ల్యు నేతల వినతి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో మద్యం అమ్మకాల కోసం మైక్రోబ్రువరీలు పేరిట ప్రభుత్వం కొత్తరకం మద్యం విధానంతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడేవిధంగా బీర్ల తయారీ కేంద్రాల ఏర్పాటు అనుమతి నోటిఫికేషన్ విడుదల చేసిందని ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా కార్యదర్శి కొండికంటి పద్మావతి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యూ మహబూబ్ నగర్ జిల్లా సమితి నేతృత్వంలో మైక్రో బ్రూవరీస్ నోటిఫికేషన్ వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మహబూబ్‌నగర్ జిల్లా సమీకృతి కలెక్టరేట్‌లోని మద్యపాన నిషేధ కార్యాలయం సూపరిండెంట్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొండికంటి పద్మావతి మాట్లాడుతూ మద్యం మహమ్మారితో ఇప్పటికే సమాజంలో తీవ్రమైన హింస, దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, వీటిని అరికట్టాల్సిన పాలకులు మద్యం ఏరులై పారించి ప్రజల మానప్రాణాలతో ఆరోగ్యాలను విధ్వంసం చేసే విధంగా మైక్రో బ్రూవరీస్ అంటూ మద్యం అమ్మకాల దందాతో ఖజానా నింపుకునేందుకు తెరతీస్తుందని మండిపడ్డారు. మైక్రో బ్రూవరీస్‌లతో యువత తప్పుదారి పడతారని, మైనర్లు కూడా తాగుడుకు బానిస అవుతారని అన్నారు. డ్రగ్ కల్చర్ బారినపడి యువత చెడు వ్యసనాలకు బానిస అయ్యారు. దానివల్ల మహిళలపై ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. ఈ నోటిఫికేషన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున మద్యం నిషేధ ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా నాయకురాలు ఎం.ఇందిర, మంజుల, రాధ, శిరీష, స్వప్న, వెంకటమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్తి ధ్వంసం చేస్తే ఎవరూ పట్టించుకోరా ..?

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి
రాచాల యుగేందర్ గౌడ్

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** వనపర్తి గురించి చెప్పగానే ముందుగా గుర్తుకు వచ్చేది పాలిటెక్నిక్ కళాశాల అని దేశ మొట్ట మొదటి ప్రధాన మంత్రి పండిత్ జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభించినటువంటి గొప్ప చరిత్ర పాలిటెక్నిక్ కళాశాలకు ఉందని అలాంటి పాలిటెక్నిక్ కళాశాల ముందు కళాశాలకు చెందిన బారికేడ్లను ధ్వంసం చేస్తే పట్టించుకునే వారే లేరా ? ఎక్కడపోతుంది సమాజమని బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్ ప్రశ్నించారు. గురువారం కళాశాల వద్ద పరిస్థితిని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన వినాయక చవితి సందర్భంగా కళాశాల ముందు విగ్రహం ఏర్పాటు చేసిన నిర్వాహకులు, అక్కడి రక్షణార్థం పెట్టిన చిన్న రాడ్లను బారికేడ్లను ధ్వంసం చేశారని ఆరోపించారు. విగ్రహం ఏర్పాటు చేసినకు పోలీసులు లేదా మున్సిపల్ శాఖ పర్మిషన్ ఇచ్చారా ..? ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేస్తే కేసులు పెట్టడం ఎందుకు లేదు. రైతుల కోసం పోరాటం చేస్తే నా మీద కేసులు పెట్టిన పోలీసులు ఇక్కడ ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అదేవిదంగా కళాశాల ముందు చెత్త వేయరాదని బోర్డు బెట్టిన అధికారులు, ఇప్పుడు బారికేడ్లు ధ్వంసం చేయబడితే ఎక్కడున్నారని మున్సిపల్ కమిషనర్ ఏమి చేస్తున్నారన్నారు. తర్వాత జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన ఆయన తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్ , జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్ , శ్రీరంగపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్ , ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్ , నాయకులు నాగరాజు, నరేందర్ సాగర్ , యశ్వంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విస్తరించే అవకాశం ఉన్నందున ప్రజలు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డిడిఓ డా. వంశీకృష్ణ అన్నారు. నీటి నిల్వలు, చెత్త కుప్పలు, దోమల పెరుగుదలకు కారణమయ్యే ప్రదేశాలను శుభ్రం చేయడం ద్వారా డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి వ్యాధులను నివారించవచ్చని అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రతి గ్రామంలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమాలను ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పకడ్బందీగా అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రతి శుక్రవారం రోజు ఇంటి ఆవరణలో నిల్వ నీటిని ఖాళీ చేయడం, ట్యాంకులు, డబ్బాలు శుభ్రం చేయడం, దోమల పెరుగుదలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గర్భిణీలు క్రమం తప్పకుండా ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేయించుకునేలా ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని, చిన్న పిల్లలకు టీకాలు సకాలంలో వేయించాలని సూచించారు.

# రీల్

## నార్త్ అమెరికాలో ఓజీ టికెట్ల హవా




పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం ఓజీ. సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం కోసం నార్త్ అమెరికాలో టికెట్లు భారీగా అమ్ముడుపోతున్నాయి. గ్యాంగ్ స్టార్ బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న సినిమా కావడంతో ఈ సినిమాపై భారీగా అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు , ట్రైలర్ కు మంచి స్పందన లభిస్తోంది. పవన్ కళ్యాణ్ సరసన ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటిస్తోంది.
అన్ని పనులు పూర్తి చేసి ఈనెల 25వ తేదీన విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే

## దుల్కర్ సల్మాన్ సరసన పూజా

దుల్కర్ సల్మాన్ 41వ చిత్రంలో హీరోయిన్‌గా పూజా హెగ్డే నటిస్తోంది. ఈ చిత్రం ద్వారా రవి నేలకుడిటి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. గ్రేట్ హ్యూమన్ డ్రామాతో నడిచే ప్రేమకథగా రూపొందుతోంది. ప్రస్తుతం పూజా హెగ్డే షూటింగ్ లో పాల్గొంటున్నారు. పూజ స్కూటీ నడుపుతూ, దుల్కర్ వెనుక కూర్చుని, వారి మ్యాజికల్ కెమిస్ట్రీని ప్రజెంట్ చేసే సన్నివేశం ఆకట్టుకుంది. అనయ్ ఓం గోస్వామి డీవోపీ, జివి ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంలో థియేటర్లలోకి రానుంది.

## కిష్కింధపురి లాంటి హారర్ సినిమా ఇప్పటివరకూ రాలేదు



హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కిష్కింధపురి'. ఈ చిత్రం సెప్టెంబర్ 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. డైరెక్టర్ కౌశిక్ కలిసినప్పుడు కిష్కింధపురి కథ చెప్పారు. నాకు బాగా ఇష్టమైన జానర్ ఇది. ఫస్ట్ టైం థియేటర్స్‌లో చూసాం. సినిమా అదిరిపోయింది. ముఖ్యంగా సౌండ్ సలార్, యానిమల్, కాంతారా సినిమాలకు పనిచేసిన సౌండ్ డిజైనర్ రాధాకృష్ణ సౌండ్‌ని అద్భుతంగా డిజైన్ చేశారు. సినిమా మీద చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాము. ఈ సినిమా చేయడం చాలా ప్రౌడ్‌గా ఉంది. సినిమాని ఇలా కూడా తీయొచ్చా అనిపించేలా చేసిన సినిమా ఇది. ఈ సినిమా కథలోనే యాక్షన్ ఉంది. మొత్తం ఆర్గానిక్‌గా చేసిన సినిమా ఇది. విజువల్ ఎఫెకట్స్ సౌండ్ పరంగా ఆడియన్స్ చాలా థ్రిల్ అవుతారు. అనుపమ పెర్ఫార్మెన్స్ కొత్తగా ఉంటుంది. నిజానికి అలాంటి క్యారెక్టర్ చేయడం చాలా టఫ్. టైసన్ నాయుడు షూటింగ్ అయిపోయింది. పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతుంది. హైందవ షూటింగ్ చివరి దశకు వచ్చింది. సమ్మె కారణంగా బ్రేక్ పడింది కానీ ఈపాటికి షూటింగ్ అయిపోయేది. ఈ రెండు కూడా డిఫరెంట్ సినిమాలు. అలాగే పొలిమేర డైరెక్టర్ అనిల్‌తో ఒక సినిమా ఉండబోతుంది.

## రొమాన్స్ క్యారెక్టర్ చేయాలనుంది

హీరోయిన్ రితికా నాయక్



తేజ సజ్జా హీరోగా నటించిన చిత్రం 'మిరాయ్'. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 12న ఈ సినిమా రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా రితికా నాయక్ మీడియా తో చిట్ చాట్ నిర్వహించింది. నా తొలి చిత్రం అశోకవనంలో అర్జున కళ్యాణం తర్వాత ఒక మంచి క్యారెక్టర్ కోసం చూస్తున్నప్పుడు మిరాయ్ అవకాశం వచ్చింది. అద్భుతమైన కథ. నా క్యారెక్టర్ చాలా నచ్చింది. హిమాలయాల్లో ఉండే ఒక మాంక్ క్యారెక్టర్. తనలో గ్రేట్ ఎనర్జీ ఉంటుంది. ఇందులో నా క్యారెక్టర్ గురించి అప్పుడే ఎక్కువ రివిల్ చేయకూడదు. మిరాయ్‌లో యాక్షన్ అడ్వంచర్ ఆడియన్స్ గొప్ప అనుభూతిని ఇస్తుంది. తేజ చాలా ప్రొఫెషనల్. వెరీ స్వీట్. డెడికేటెడ్‌గా వర్క్ చేస్తారు. మనోజ్ చాలా పవర్ఫుల్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు. జగపతిబాబు గారితో కలిసి వర్క్ చేయడం, శ్రీయాతో కలిసి స్క్రీన్స్ షేర్ చేసుకోవడం మరచిపోలేని అనుభూతి. ఈ సినిమాలో దాదాపు 80% లైవ్ లొకేషన్స్‌లో షూట్ చేశాం. ప్రతి రియల్ టైమ్ లొకేషన్స్‌లోకి వెళ్లడం వెరీ చాలెంజింగ్. అయితే మా టీమ్ అందరూ చాలా సపోర్ట్ చేశారు. కార్తీక్ చాలా విజన్ ఉన్న డైరెక్టర్. ఆయన సెట్‌లో చాలా క్లారిటీగా ఉంటారు. సినిమాని చాలా అద్భుతంగా తీశారు. ఆయనతో కలిసి వర్క్ చేయడం చాలా ఆనందాన్నిచ్చింది. కథలో ప్రాధాన్యత ఉన్న అన్ని రకాల పాత్రలు చేయాలని ఉంది. పెర్ఫార్మెన్స్‌కి స్కోప్ వుండే అన్ని రకాల పాత్రలు చేయడానికి సిద్ధంగా ఉన్నాను. అలాగే నాకు సూపర్ హీరో మూవీస్ అంటే చాలా ఇష్టం. యాక్షను రొమాన్స్ నా ఫేవరెట్ జోనర్స్. వరుణ్ తేజ్ గారితో ఒక సినిమా చేస్తున్నాను.

## 'తెలుసు కదా' టీజర్ విడుదల

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన తాజా చిత్రం రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా' అక్టోబర్ 17న విడుదలకు సిద్ధమవుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి పాత్రలతో కమ రిలేషన్ ఆసక్తికరంగా వుంది. 'లవ్ యు2' అనే ట్యాగ్‌లైన్ మరింత క్యూరియాసిటీని పెంచింది. హ్యాపీ నెస్, లవ్, ఎమోషనల్ మూమెంట్స్‌తో టీజర్ అదిరిపోయింది. నీరజ కోన నెటివిటిని చాలా మెచ్యూర్‌గా ప్రజెంట్ చేశారు. ఫన్, డ్రామా అద్భుతంగా వర్క్ అవుట్ అయ్యాయి. సిద్ధు జొన్నలగడ్డ డిజే టిల్లు పాత్రకు భిన్నంగా న్యూ ఛార్మింగ్ అవతార్ లో కనిపించారు. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు.



## 'లిటిల్ హార్ట్స్' సక్సెస్ మీట్



మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా నటించిన 'లిటిల్ హార్ట్స్' సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై దర్శకుడు సాయి మార్తాండ రూపొందించారు. ఆదిత్య హాసన్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాను అద్భుతంగా ప్రమోట్ చేసి నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ బన్నీ వాస్ తన బీవీ వర్క్స్ వంశీ నందిపాటి తన వంశీ నందిపాటి ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా థియేట్రికల్‌గా రిలీజ్ చేశారు. ఈ సినిమా థ్యాంక్స్ మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటులు నిఖిల్, హరి, జయక్రిష్ణ , నటి పద్మినీ , హీరోయిన్ శివానీ నాగరం ,డైరెక్టర్ సాయి మార్తాండ , మౌళి తనూజ్ , ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ , ఈటీవీ విన్ హెడ్ సాయికృష్ణ , నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్ పాల్గొన్నారు.

## అటవీ శాఖ అమరుల త్యాగం చిరస్మరణీయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ శాఖ అధికారుల త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శా ఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం నెహ్రూ జులాజికల్ పార్కులోఅటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి కొండ సురేఖ మాట్లాడు తూ రాష్ట్రంలో 1984వ సంవత్సరము నుండి ఇప్పటివరకు (22) అటవీ సిబ్బం ది ధైర్య సాహసాలతో అంకిత భావంతో పనిచేస్తూ అటవీ సంపద పరిరక్షణలో తమ అమూల్యమైన ప్రాణాలు అర్పించారన్నారు. తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అధికారులు తమ శాయశక్తుల కృషి చేస్తున్నారని అభినందించారు. అటవీ రక్షణలో భాగంగా రాష్ట్రంలో 174 బేస్ క్యాంపులు, 62 చెక్ పోస్టులను ఏర్పాటు చేయడమే కాకుండ అడవి సరిహద్దుల నిర్వహణకు పశువులు అడవిలో చొరబడకుండా నియంత్రించే కాలువలు నిర్మించడం,సాయుధ పోలీసు దళాలు కలప అక్రమ రవాణా అరికట్టడానికి తోడ్పాటును అందిస్తున్నాయని తెలిపారు.అంతకుముందు అమరుల స్తూపం వద్ద పోలీసుల గౌరవ వందనాన్ని ఉన్నతాధికారులతో కలిసి మంత్రి స్వీకరించారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ నదీమ్ అహ్మద్ వివిధ విభాగాల అధికారులు, అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.

## బిజెపి హైజాక్

(మొదటి పేజీ తరువాయి)

హాస్యాస్పదమన్నారు. నాడు జరిగిన వర్గ పోరాటాన్ని నేడు రెండు మతాల మధ్య ఉద్యమంగా బిజెపి చిత్రీకరించి రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నిస్తోందని విమర్శించారు. కమ్యూనిస్టుల చరిత్ర చెరిపితే చెరిగిపోయేది కాదని, అమరుల త్యాగాలకు ఎవరూ వెల కట్టలేరని ఆయన స్పష్టం చేశారు. అజీజ్ పాషా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాయుధులైన రైతులు నిజాం రజాకార్లను తరిమి తరిమి కొడితే తన పరాభావం తప్పదన్న భయంతో నిజాం అప్పటి కేంద్ర ప్రభుత్వంతో చేసుకున్న చీకటి ఒప్పందంలో భాగంగానే నాడు 'ఆపరేషన్ పోలో' జరిగిందన్నారు. హైదరాబాద్ రాష్ట్రం కమ్యూనిస్టు వశం కానుందని ఆనాడే అమెరికా గ్రహించి భారత ప్రభుత్వానికి లేఖ రాసిందని, అందులో భాగంగా ప్రజలను హింసించి రజాకార్లను కాకుండా కమ్యూనిస్టు యోధులను నాడు కేంద్ర బలగాలు మట్టు పెట్టాయన్నారు. ఎంతో చరిత్ర గల పోరాటాన్ని ఎవరు వక్రీకరించినా చరిత్ర ఎప్పుడూ చరిత్రగా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, సిపిఐ రాష్ట్ర నాయకులు బి.వెంకటేశం, పి.ప్రేమ్ పావని, ఎం.నర్సింహ్మా, ఎం.ధర్మేంద్ర, ఎం.అనిల్ కుమార్, కమతం యాదగిరి, ప్రజానాట్యమండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా, లక్ష్మి నారాయణతో పాటు సిపిఐ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ట్యాంక్‌బండ్‌పై ఎర్ర కవాత్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో ఎర్ర సైనికులు ట్యాంక్‌బండ్‌పై కదం తొక్కారు. మఖ్దూం మోహియుద్దీన్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ 'రెడ్ ఫ్లాగ్ మార్చ్'తో అరుణ పతకాలు రెపరెపలాడాయి. ప్రజానాట్య మండలి కళాకారుల ఆట పాటల మధ్య రెడ్ షర్ట్ వాలంటీర్లు అరుణ పతాకాలతో ముందుకు సాగారు. నాటి తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలాపించిన గేయాలు, మరో వైపు ఎర్ర జెండా కవాత్ ట్యాంక్‌బండ్‌పై ప్రయాణికులను, ప్రజలను ఆకట్టుకున్నాయి.



## ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలు వెంటనే చెల్లించాలి

ఎస్‌జిపిఎటి డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత ఏడాది కాలంగా ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలను సత్వరం చెల్లించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అర్విణి రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ఎంవి.నరసింగరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగింది. ఎస్‌జిపిఎటి సమావేశం పెన్షనర్లకు ప్రత్యేక డైరక్టరేట్ ఏర్పాటు చేయాలని, కరువుభత్యం బకాయిలు వాయిదాల పద్ధతిలో కాకుండా ఏక మొత్తం గా చెల్లించాలని, 2023 జూలై నుండి పిఆర్‌సి వర్తింపచేయాలని సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానించింది. ఎస్‌జిపిఎటి రాష్ట్ర ఉపాధ్యక్షులు విరామనోహర్ కూర్పు చేసిన 'సమస్యలు సమాధానాలు' పుస్తకాన్ని సీనియర్ పెన్షనర్ జి. శంకరయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐఎస్‌పిఎఫ్ సెక్రటరీ జనరల్ సుధాకర్, పూర్వపు సెక్రటరీ జనరల్ జి.పూర్ణచంద్ర రావు, పెన్షనర్ జెఎసి సెక్రటరీ జనరల్ తులసి సత్యనారాయణ, సంఘం సలహాదారు ఇ.నరసింహారెడ్డి, సంయుక్త అధ్యక్షులు జి.వీరాస్వామి, వి.ఆర్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌జిపిఎటి నూతన నాయకత్వం ఎన్నిక

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎస్‌జిపిఎటి) రాష్ట్ర అధ్యక్షులుగా అర్విణి రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి గా ఎంవి.నరసింగరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అసోసియేషన్ ఎన్నికల అధికారులు ఎంవి.గోనారెడ్డి, జి.లచ్చయ్య ప్రకటించారు. అసోసియేషన్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శిగా బి.నరసయ్య, సంయుక్త అధ్యక్షులు గా జి.వీరాస్వామి, అదనపు ప్రధానకార్యదర్శి గావి. రాంమనోహర్ ఎన్నికయ్యారు.

## టిమ్స్ ఆస్పత్రి కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది ఐదు నెలల జీతాలు వెంటనే చెల్లించాలి

ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిమ్స్ ఆస్పత్రి కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందికి గత 5నెలలుగా పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలిని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ డిమాండ్ చేశారు. కరోనా సమయంలో తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రిలో దాదాపు 160 మంది కాంట్రాక్టు నర్సింగ్ ఆఫీసర్స్‌ను నియమించుకోగా, అనంతరం 2022లో ఈ సిబ్బందిని నీలోఫర్ ఆసుపత్రి, ఉస్మానియా ఆసుపత్రి, సరోజినీ ఆసుపత్రి, కోటి మెటర్నిటీ ఆసుపత్రిలకు డిప్యూటేషన్‌పై టిమ్స్ అధికారులు పంపించడం జరిగిందన్నారు. అయితే వివిధ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బందికి గత ఏప్రిల్ నెల నుండి జీతాలు చెల్లించక పోవడం తీవ్ర అన్యాయమని వారు విమర్శించారు. హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో టిమ్స్ ఆస్పత్రి వివిధ ఆస్పత్రిలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ నర్సింగ్ ఆఫీసర్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎండి. యూసుఫ్, ఎం.నరసింహాలు మాట్లాడుతూ గత5 ఏళ్లుగా వారు విధులు నిర్వహిస్తున్నారని టిమ్స్ అనంతరం వివిధ ఆస్పత్రులకు డిప్యూటేషన్ పై పంపించిన అధికారులు గతంలో ప్రతినెల జీతాలు చెల్లించి గత ఏప్రిల్ మాసం నుండి నేటి వరకు జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈ అంశంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ లకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులకు అనేకసార్లు విన్నవించినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించాల్సి ఉండగా ఆరునెలగా నర్సింగ్ ఆఫీసర్లకు జీతాలు ఇవ్వకపోవడంతో వారు ఆర్థికంగా అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఐదు నెలల జీతాలు తక్షణం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాలను ఉధృత్తం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం నర్సింగ్ ఆఫీసర్స్ సిబ్బంది పాల్గొన్నారు.




## 680 బిలియన్ డాలర్లు

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఈ సహకారం విస్తృతమవుతుంది. మోదీ తన పార్లమెంటరీ నియోజకవర్గం వారణాసిలోని తాజ్ హోటల్‌లో మారిషస్ ప్రధానమంత్రికి ఆతిథ్యం ఇచ్చారు. ఈనెల 9న రామ్‌గూలమ్ భారత్ పర్యటన ప్రారంభించారు. 16వ తేదీ వరకూ అనేక ప్రాంతాలలో ఆయన పర్యటిస్తారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ ఆయనతో మాట్లాడుతూ, మారిషస్‌కు భారత్ ఇస్తున్నది ప్రత్యేక ఆర్థిక సహాయం కాదనీ, రెండు దేశాల ఉమ్మడి భవితవ్యానికి ఒక గొప్ప పెట్టుబడి అనీ చెప్పారు. మన రెండు దేశాల కలలూ, లక్ష్యాలూ ఒకటేనన్నారు. భారత్–మారిషస్ దేశాలు రెండూ కేవలం వాణిజ్య భాగస్వాములు మాత్రమే కాదనీ, ఒకే కుటుంబమని ప్రకటించారు. రెండు దేశాల మధ్యా ఉన్న సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పడానికి ప్రతిబింబంగా వారణాసిలో ఆయనకు ఆతిథ్యం ఇచ్చారు. వందలసంవత్సరాలక్రితమే రెండు దేశాలమధ్యా ప్రారంభమైన సాంస్కృతిక భాగస్వామ్యాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. రెండు దేశాలూ కేవలం వాణిజ్య భాగస్వాములు కాదనీ, ఒకే కుటుంబమనీ ఉద్ఘాటించారు. మారిషస్ భద్రతకు ప్రత్యేకించి ఆ దేశ ఆర్థిక మండల భద్రతను పటిష్టం చేయడానికి భారత దేశం పూర్తిగా కట్టుబడి ఉందని మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో మోదీ పేర్కొన్నారు. స్థానిక కరెన్సీలలోనే వాణిజ్యం చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. హైడ్రోగ్రఫీ ఒప్పందం కింద రెండు దేశాలూ సముద్రతలంపై, సముద్రాంతరం ఉమ్మడి పరిశోధనలు చేపడతాయి. రాబోయే ఐదేళ్ళపాటు హైడ్రోగ్రఫీ ఒప్పందం అమలులో ఉంటుంది. భారతదేశం మారిషస్‌లో త్వరలో 'మిషన్ కర్మయోగి''ని ప్రారంభిస్తుందని మోదీ చెప్పారు. మారిషస్ విశ్వవిద్యాలయంతో దేశంలోని మద్రాస్ ఐఐటి, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లానిటోరియం మేనేజ్‌మెంట్‌లు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ మేరకు ఎడ్యుకేషన్ రీసెర్చ్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన ఉమ్మడి హిందూ మహాసముద్ర ప్రాంతమే రెండు దేశాలకూ ప్రాధాన్యతాంశమని ఉద్ఘాటించారు. హిందూమహాసముద్ర ప్రాంత సంరక్షణలో భారతదేశం అందరికంటే ముందుగా స్పందిస్తుందన్నారు. ఈ ఒప్పందాల ప్రకారం మారిషస్ తీరప్రాంత గస్తీ దళాలకు భారతదేశం శిక్షణ ఇస్తుంది. ఛాగోస్ ఒప్పందం ముగింపు సందర్భంగా మారిషస్ ప్రభుత్వానికి, ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఇది ద్వీపదేశం మారిషస్ సార్వభౌమాధికారానికి ఒక చరిత్రాత్మకమైన విజయమన్నారు. భారతదేశం ఎప్పుడూ వలసల నిర్మూలనకు మద్దతు ఇస్తుందని, మారిషస్ సార్వభౌమాధికారాన్ని సంపూర్ణంగా భారతదేశం గుర్తిస్తోందని చెప్పారు. ఛాగోస్ దీవులను మారిషస్‌కు స్వాధీనం చేసేందుకు బ్రిటన్‌దేశం గడచిన మే నెలలో ఒక నిర్ణయం తీసుకుంది. ఈ ఒప్పందం ముగింపు ప్రకారం మారిషస్‌లో పలు దీవులపై బ్రిటన్ తన పూర్తి హక్కులను వదులుకుంటుంది.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

మావోయిస్టులు పోలీసు తూటాలకు తాలలేక అడువుల్లోనికి జారుకున్నటు తెలుస్తోంది. వారి కోసం మరింత ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. 2026 మార్చి 31నాటికి మావోయిస్టులే లేకుండా అంతం చేస్తామని కేంద్ర ప్రభుత్వం శపథం చేసిన నేపథ్యంలో మావోయిస్టుల వేట మరింత ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటి వరకు మావోయిస్టు కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు, కేంద్ర కమిటీ సభ్యులు చలపతి, వివేక్, ఉదయ్, రాష్ట్రకమిటీ సభ్యులు శర్మ, గౌతమ్, మధు, జయ, రూపేష్,కార్తీక్, నీతి, చేతే, గుడ్డ, సత్యం, అలోప్, పాపన్న, మధు, భాస్కర్, జగన్,అరుణ, విజయ్ తో పాటు జిల్లా కమిటి సభ్యులు 26, ఏరియా కమిటీ సభ్యులు 86, పిఎల్‌జిఏ సభ్యులు 152 మంది, స్థానిక నిర్మాణ సభ్యులు, ప్రజలు 38 మంది వివరాలు తెలియని వారు 43 మందితో సాహ తాజా ఎన్‌కౌంటర్‌తో కలిపి 374 మందిని భద్రతా బలగాలు కాల్చి చంపాయి.
ఆపరేషన్ కాగర్‌కు వ్యతిరేకంగా భారీ ప్రజా సమీకరణ

### సిపిఐ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ పిలుపు

మావోయిస్టు ఉద్యమాన్ని దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న సైనిక దాడి 'ఆపరేషన్ కగార్'ను ఓడించేందుకు భారీగా ప్రజా సమీకరణ అవసరమని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ నెల 21 నుంచి 27 వరకు దేశవ్యాప్తంగా పార్టీ స్థాపన 21వ వార్షికోత్సవాన్ని పెద్ద ఎత్తున జరుపుకోవాలని ప్రజలను సూచించింది. పార్టీని బలోపేతం చేసేందుకు, విప్లవోద్యమాన్ని రక్షించేందుకు గెరిల్లా యుద్ధంలో విస్తృత ప్రజాసమీకరణ అవసరాన్ని సిపిఐ (మావోయిస్టు) అత్యున్నత నిర్ణయాధికార కమిటీ ఒక ప్రకటనలో గుర్తుచేసింది. ఈ ఏడాది ఆపరేషన్ కగార్‌ను ప్రతిఘటిస్తూ, కొత్త ప్రజాస్వామ్య విప్లవ పోరాట లక్ష్యాల కోసం పోరాడుతూ సిపిఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి బసవరాజు (నంబాల కేశవ్ రావు), కేంద్ర కమిటీ సభ్యులు చలపతి, వివేక్, ఉదయ్తో సహా 366 మంది వీర మరణం పొందినట్లు పేర్కొంది. ప్రాణత్యాగం చేసిన వారి ఆలోచనలకు, సిద్ధాంతాలకు కట్టుబడి పోరాటాలను కొనసాగిస్తామని కేంద్ర కమిటీ ప్రతిజ్ఞ చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి, విప్లవ ప్రాంతంలో సాయుధ దళాల శిబిరాల ఏర్పాటు ఆపితే, ప్రజల విశాలమైన ప్రయోజనాల కోసం తమ పార్టీ ఎప్పుడూ శాంతి చర్చలకు సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేసింది. పీడిత వర్గాల ప్రయోజనాలను రక్షించడానికి సామ్రాజ్యవాద, హిందుత్వ ఫాసిస్ట్, జమీందారీ శక్తులపై పోరాటం చేయాలని ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com